thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08


# చురకలు

సాయంకాల దినపత్రిక
Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

సంపుటి - 19 సంచిక - 338 కరీంనగర్ గురువారం, 13 ఫిబ్రవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## మళ్లీ పరువునష్టం కేసులో ఇరుక్కున్న రాహుల్ గాంధీ..

కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తాజాగా మరో కేసులో ఇరుక్కున్నారు. చాన్నాళ్ల కిందట ఆయన ఇచ్చిన స్టేట్‌మెంట్ ఇప్పుడు కొత్త తలనొప్పులు తెచ్చిపెట్టనుంది. భారత్ జోడో యాత్ర సమయంలో భారత సైనికులకు సంబంధించి కొన్ని వ్యాఖ్యలు చేశారు. తాజాగా ఆ వ్యాఖ్యలపై నమోదైన కేసుకు సంబంధించి లక్నో కోర్టు అదనపు చీఫ్ జ్యుడీషియల్ మెజిస్ట్రేట్ అలోక్ వర్మ రాహుల్‌కు సమన్లు జారీ చేశారు. ఈ కేసు విచారణ తేదీని మార్చి 24, 2025 తేదీగా నిర్ణయించారు.




# మరోసారి కులగణన!
## ఫిబ్రవరి 16 నుంచి ప్రారంభం..

హైదరాబాద్: తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా కుల గణన సర్వే నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే.. వివిధ కారణాలతో ఈ కుల గణనలో సర్వేలో కొందరు పాల్గొనలేదు. ఈ క్రమంలో కుల గణన సర్వేలో పాల్గొనని వారికి ప్రభుత్వం బిగ్ అప్డేట్ ఇచ్చింది. బుధవారం (ఫిబ్రవరి 12) కమాండ్ కంట్రోల్ సెంటర్లో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన అత్యున్నత స్థాయి సమావేశం జరిగింది. ఈ భేటీలో కుల గణన నివేదిక, పంచాయతీ ఎన్నికల నిర్వహణ, బీసీ రిజర్వేషన్లపై ప్రధానంగా చర్చించారు. ఈ భేటీ అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సమావేశం వివరాలను మీడియాకు వెల్లడించారు. ప్రభుత్వం నిర్వహించిన కుల గణన సర్వేలో పాల్గొనని వారి కోసం మరోసారి సర్వే నిర్వహిస్తామని పేర్కొన్నారు. 2025, ఫిబ్రవరి 16 నుంచి 28 వరకు రీ సర్వే నిర్వహిస్తామని తెలిపారు. మొదటి సారి సర్వేలో పాల్గొనని వారు ఇప్పుడు వివరాలు ఇవ్వొచ్చని చెప్పారు. సర్వేలో పాల్గొనని వాళ్లు ఆన్‌లైన్, టోల్ ఫ్రీ నంబర్ లేదా మండల కార్యాలయానికి వెళ్లి తమ వివరాలు ఇవ్వొచ్చని చెప్పారు. గతంలో 96.9 శాతం మంది కులగణన సర్వేలో పాల్గొన్నారని.. కేవలం 3.1 పర్సంట్ మంది మాత్రమే సర్వేలో పాల్గొనలేదని వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం నిర్వహించిన కుల గణన నివేదిక స్పష్టంగా ఉందని.. కేవలం సర్వేలో పాల్గొనని 3.1 పర్సంట్ మంది కోసం మాత్రమే రీ సర్వే నిర్వహిస్తామన్నారు. కేసీఆర్, హరీష్ రావు, కేటీఆర్ వంటి వాళ్లు కొందరు ఉద్దేశపూర్వకంగా సర్వేలో పాల్గొనలేదని ఫైర్ అయ్యారు. ఇక, ఎన్నికల్లో మాట ఇచ్చినట్లుగానే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని స్పష్టం చేశారు. లోకల్ బాడీ ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై అసెంబ్లీలో బిల్లు పెట్టి పాస్ చేస్తాం. అసెంబ్లీ ఆమోదించిన తీర్మానాన్ని కేంద్రానికి పంపి వాళ్లపై ఒత్తిడి తెస్తామని తెలిపారు. బీసీ రిజర్వేషన్ల అంశంపై కలిసి వచ్చే రాజకీయ పార్టీలను తీసుకొని ఢిల్లీ వెళ్లి ప్రధాని మోడీని కలుస్తామన్నారు.



## సంగమేశ్వర ఆలయం నుంచి హరీష్ రావు పాదయాత్ర

హైదరాబాద్ : బీఆర్ఎస్ పార్టీ కీలక నేత, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు.. కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను ఎండగడుతూ ఉన్నారు. అవకాశం దొరికిన ప్రతి వేదికను వినియోగించుకుంటున్న ఆయన ప్రజల పక్షాన నిలబడుతూ.. వారి సమస్యలపై గొంతెత్తుతున్నారు. ఈ క్రమంలోనే ప్రతిరోజు సోషల్ మీడియా వేదికగా రైతులు, ఉద్యోగుల సమస్యలపై ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ వస్తున్న విషయం తెలిసిందే. ఇదిలా ఉంటే కొద్ది రోజుల క్రితం కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్ హౌస్‌లో సమావేశం ఏర్పాటు చేసి. రైతుల పక్షాణ హరీష్ రావు అధ్యక్షతన ఉద్యమం చేయాలని.. దీనికి అందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఇందులో భాగంగానే.. త్వరలో సంగమేశ్వర ఆలయం (సంగమేశ్వర ఆలయం)నుంచి మాజీ మంత్రి హరీష్ రావు పాదయాత్ర చేయనున్నట్లు తెలుస్తోంది.

సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టులను పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ పాదయాత్ర చేయాలని హరీష్ రావు నిర్ణయించుకున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ విషయంపై ఇప్పటికే బీఆర్ఎస్ శ్రేణులతో చర్చించిన హరీష్ రావు.. ప్రణాళికలు కూడా సిద్ధం చేసుకున్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ప్రాజెక్టుల నిర్దేశిత ఆయకట్టు ప్రాంతాల్లో వారం రోజుల పాటు.. దాదాపు 130 కిలోమీటర్ల దూరం హరీష్ రావు పాదయాత్ర చేయనున్నట్లు తెలుస్తోంది. ఈ పాదయాత్రలో భాగంగా.. గ్రామాల్లో రోజుకో సభ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అలాగే ఈ పాదయాత్ర ముగింపు రోజు భారీ సభను ఏర్పాటు చేయాలని నిర్ణయించగా.. ఈ సభకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ హాజరు కానున్నట్లు తెలుస్తోంది. అయితే ఈ పాదయాత్ర పై హరీశ్ రావు, బీఆర్ఎస్ పార్టీ అధికారిక ప్రకటన విడుదల చేయాల్సి ఉంది.


## మొదలైన మేడారం మినీ జాతర.. భారీగా తరలివస్తున్న భక్తులు

మేడారం : ప్రపంచంలో అతి పెద్ద గిరిజన జాతరలో ఒకటి మేడారం సమ్మక్క-సారలమ్మ జాతర. నేటి నుంచి (బుధవారం) మినీ జాతర ప్రారంభమైంది. జాతర నేపథ్యంలో మేడారం పరిసర ప్రాంతాలు భక్తులతో కళకళలాడుతున్నాయి. వనదేవతలైన సమ్మక్క-సారలమ్మ పేరిట ఫిబ్రవరి 12-15 వరకు మినీ జాతర జరగనుంది. నార్మల్‌గా అయితే ప్రతి రెండేళ్లకు ఒకసారి మేడారం జాతర జరగనుంది. మధ్యలో వచ్చేది మినీ జాతరగా నిర్వహిస్తారు. మాఘ శుద్ధ పౌర్ణమి రోజు (నేటి) నుంచి నాలుగు రోజుల పాటు మండ మెలిగే పండుగగా వ్యవహరించారు పూజారులు. మేడారం గద్దెల చెంత కన్నెపల్లి ఆలయంలో శుద్ధి నిర్వహించి దూపదీప నైవేద్యాలు సమర్పిస్తారు. వన దేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. అలాగే మేడారం గ్రామంలోకి దుష్టశక్తులు రాకుండా మామిడాకులతో దిష్టి తోరణాలు కడతారు. పున్నమి వెలుగుల్లో పూజారులు జాగారాలు చేయనున్నారు. పెద్ద జాతరకు రాని వాళ్లు తమ ముక్కులు ఇందులో చెల్లించుకుంటారు. జాతరకు ముందు నుంచే భక్తులు వేలాదిగా వచ్చి తల్లులను దర్శించుకుంటారు. బంగారం, పసుపు-కుంకుమ, చీరలు సమర్పించి మొక్కులు చెల్లించుకోవడం ఆనవాయితీగా వస్తోంది. జంపన్న వాగులో తొలుత స్నానమాచరిస్తారు. ఆ తర్వాత నేరుగా గద్దెల దగ్గరకు వచ్చి దర్శనాలు చేసుకుంటారు. పిల్లా పాపలతో చల్లగా చూడాలంటూ తల్లులను వేడుకుంటారు. మండ మెలిగే పండుగతో మినీ జాతరను మొదలవుతుంది. గురువారం మండ మెలిగే పూజలు, శుక్రవారం భక్తుల మొక్కుల చెల్లించుకుంటారు. శనివారం చిన్నజాతర చేపడతారు నిర్వాహకులు. కష్టాలు తొలగిపోవాలంటూ బెల్లం కానుకగా సమర్పిస్తారు భక్తులు. మినీ జాతర కోసం తెలంగాణ ప్రభుత్వం భారీగా ఏర్పాటు చేసింది. ఇందుకోసం దాదాపు ఐదున్నర కోట్ల రూపాయలు కేటాయించింది. నాలుగు రోజులు జరుగనున్న జాతరలో భక్తుల సౌకర్యార్థం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు అధికారులు. పోలీసులతో పాటు వివిధ శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది వెయ్యి మందికి పైగా విధుల్లో ఉంటారు. మినీ జాతరకు కేవలం తెలుగు రాష్ట్రాలతో పాటు ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిశా రాష్ట్రాల నుంచి భారీగా



భక్తులు తరలి రానున్నారు. ప్రస్తుతం జాతరకు 20 లక్షలకు పైగా భక్తులు వచ్చే అవకాశం ఉందన్నది అధికారుల అంచనా. తెలంగాణ సంస్కృతి సంప్రదాయలకు నిలువెత్తు నిదర్శనం మేడారం మహా జాతర. ఆదివాసీ ఆచారాలతో నిర్వహించే ఈ పండుగ రెండేళ్లకోసారి అత్యంత అంగరంగ వైభవంగా జరుగుతుంది. మహా జాతర జరిగిన మరుసటి ఏడాది చిన్న జాతర జరుగుతుంది.

జాతరకు వచ్చే భక్తుల కోసం ఆర్టీసీ దాదాపు 200 వరకు ప్రత్యేకంగా బస్సు సర్వీసులను నడుపుతోంది. భక్తుల రద్దీని బట్టి 24 గంటలు సైతం నడుపుతామని అంటున్నారు అధికారులు. గతంతో పోలిస్తే ప్రస్తుతం ఏర్పాట్లు బాగున్నాయని భక్తులు చెబుతున్నారు. మరోవైపు భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూడాలని అధికారులకు ఆదేశించారు మంత్రి సీతక్క. భక్తుల కోసం పుణ్య స్నానాల కోసం షవర్లు, మహిళలు దస్తులు మార్చుకునేందుకు గదులు, సులభ్ కాంప్లెక్సులు, తాగునీటి ట్యాంకులు, అంబులెన్సులు, వైద్యకేంద్రాలను ఏర్పాటు చేశారు. ఇక భక్తుల సేవలో వివిధ శాఖల అధికారులు ఉండనున్నారు. పోలీసులు, దేవాదాయశాఖ, జిల్లా పంచాయితీ, వైద్య, ఆరోగ్యం, నీటి పారుదలశాఖ, ఎన్పీడీసీఎల్, రెవిన్యూ, గ్రామీణ తాగునీటి సరఫరా అధికారులు ఉండనున్నారు.




# ముందు పంచాయతీ తర్వాత ఎంపీటీసీ..!

**నోటిఫికేషన్ విడుదల కోసం మీటింగ్స్ - పక్కా వ్యూహంతో కాంగ్రెస్ అడుగులు**
**రాజకీయ పార్టీలతో ఈసీ సమావేశం - సీసీసీలో సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష**
**బీసీ రిజర్వేషన్లపై క్లారిటీయే తరువాయి - 23% స్థానాలకు కేటాయించే చాన్స్**

హైదరాబాద్: పంచాయతీ ఎన్నికలకు వేగంగా అడుగులు పడుతున్నాయి. సర్పంచ్, ఎంపీటీసీ ఎన్నికలను వెంట వెంటనే నిర్వహించనుందని సమాచారం. ఎన్నికలకు సన్నద్ధతపై ఇటు ప్రభుత్వం, అటు ఎన్నికల కమిషన్ అధికారులతో సమీక్షలు నిర్వహిస్తోంది. ఓటర్ల జాబితాను సైతం ఈసీ ఇటీవలే ప్రకటించింది. ముందుగా సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఆ తర్వాత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎలక్షన్స్ పెట్టే అవకాశం ఉంది. ఇవాళ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్ సెంటర్ లో పంచాయతీ ఎన్నికలపై సీఎస్ శాంతి కుమారి, పంచాయతీరాజ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ మేరకు బీసీ రిజర్వేషన్లపై క్లారిటీ వచ్చిన వెంటనే షెడ్యూల్ రిలీజయ్యే అవకాశం ఉంది. 42% సీట్లు ఇవ్వడానికి సుప్రీంకోర్టు తీర్పులు అడ్డొస్తున్న నేపథ్యంలో పాత పద్ధతినే అమలు చేస్తారని తెలుస్తోంది. ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లు యాభైశాతం ఉండేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్టు సమాచారం. అంతకన్నా ఎక్కువ సీట్లు కేటాయించాలంటే రాజ్యాంగ సవరణ జరగాల్సి ఉంటుంది. కేంద్ర ప్రభుత్వం ఉభయ సభలను సమావేశపర్చి రాజ్యాంగ సవరణ బిల్లును ప్రవేశపెట్టాల్సి ఉంటుంది. ఈ తరుణంలో అది సాధ్యం కాదని భావిస్తున్న కాంగ్రెస్ పార్టీ.. ఒక అడుగు ముందుకు వేసింది. తమ పార్టీ 42% సీట్లను బీసీలకు కేటాయిస్తుందని సీఎం రేవంత్ రెడ్డి, పీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు.

**పక్కా వ్యూహంతో కాంగ్రెస్...** స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధమవుతున్న కాంగ్రెస్ ఇటీవలే రైతు భరోసా మొత్తాన్ని కర్షకుల ఖాతాల్లో జమ చేసింది. బీసీ కులగణన చేపట్టి 56 శాతం వెనుకబడిన వర్గాల వారున్నారని తేల్చింది. వారికి రాజ్యాంగబద్ధంగా రిజర్వేషన్లు కల్పించేందుకు అడ్డంకులున్న దృష్ట్యా పార్టీగా ప్రకటిస్తామని వివరించింది. ముందుగా పార్టీ గుర్తుతో సంబంధం లేకుండా జరిగే సర్పంచ్ ఎన్నికలు నిర్వహించాలని భావిస్తోంది. ఏక గ్రీవాలు అధికంగా చేయడం ద్వారా మెజార్టీ పంచాయతీలను హస్తగతం చేసుకోవాలని భావించింది. ఈసీ నోటా అంశాన్ని తెరమీదకు తేవడంతో కొంత ఇబ్బంది పడ్డ కాంగ్రెస్.. ఇవాళ నిర్వహించిన ఆల్ పార్టీ మీటింగ్ లో ఒకే అభ్యర్థి బరిలో ఉంటే నోటాతో పోటీ పెట్టే అంశాన్ని వ్యతిరేకించింది. గెలిచిన సర్పంచులు.. అభివృద్ధి కోసం తమ పార్టీలో చేరుతారని భావిస్తోంది. వారిని చేర్చుకొని వాళ్ల అండతో ఎంపీటీసీ ఎన్నికలకు వెళ్లేందుకు సిద్ధమయ్యే అవకాశ ఉంది. ఇలా చేయడం ద్వారా మెజార్టీ మండలాల్లో పాగా వేయొచ్చన్నది కాంగ్రెస్ వ్యూహంగా కనిపిస్తోంది.

**బీసీలకు దాదాపు 23%...** సుప్రీంకోర్టు తీర్పులు అడ్డొస్తున్న నేపథ్యంలో న్యాయపరమైన చిక్కులు రాకుండా షెడ్యూల్ విడుదల చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. ఇందుకోసం బీసీలకు కొంచం తక్కువ 23% సీట్లను కేటాయించనుంది. అదే విధంగా ఎస్సీ, ఎస్టీలకు 28% స్థానాలను కేటాయించే అవకాశం ఉందని సమాచారం. దీనిపై న్యాయ సమీక్ష జరిగిన తర్వాత ఎలాంటి ఆటంకాలు రావని నిర్ధారించుకున్న మీదటే షెడ్యూల్ విడుదల చేసే అవకాశం ఉంది.



## ఉచితాలు ఇస్తే.. ప్రజలు పని చేసేందుకు ఇష్టపడరు..

దిల్లీ: ఉచిత పథకాలను ఉద్దేశిస్తూ సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఎన్నికల సమయంలో ఆయా రాజకీయ పార్టీలు వీటిని ప్రకటించే పద్ధతి మంచి కాదని వ్యాఖ్యానించింది. పట్టణ ప్రాంతాల్లో నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించాలని దాఖలైన పిటిషన్‌పై విచారణ చేపట్టిన న్యాయస్థానం.. ఉచితాలపై ఈ వ్యాఖ్యలు చేసింది. “ఉచిత పథకాలు మంచివి కావు. దురదృష్టవశాత్తూ.. వీటి కారణంగా ప్రజలు కష్టపడి పని చేసేందుకు ఇష్టపడడం లేదు. ఉచితంగా రేషన్, డబ్బులు అందుతున్నాయి. ఎలాంటి పని చేయకుండానే డబ్బులు వస్తుండటంతోనే ఇలా జరుగుతోంది. ప్రజలకు సౌకర్యాలు అందించాలన్న ప్రభుత్వాల ఉద్దేశం మంచిదే. కానీ, వారిని దేశ అభివృద్ధిలో భాగం చేయాలి. ఉచితాల ద్వారా అలా జరుగుతోందా..?ఎన్నికల్లో ఉచిత పథకాలు ప్రకటించే పద్ధతి సరైనది కాదు” అని జస్టిస్ బీఆర్.గవై, జస్టిస్ అగస్టిన్ జార్జ్ మాసిహ్‌తో కూడిన ధర్మాసనం వ్యాఖ్యానించింది. కేంద్రప్రభుత్వం పట్టణ పేదరిక నిర్మూలన మిషన్‌ను పూర్తి చేసే పనిలో ఉందని.. నిరాశ్రయులకు ఆశ్రయం కల్పించడంతో పాటు పలు సమస్యలను పరిష్కరించేందుకు యోచిస్తున్నట్లు అటార్నీ జనరల్ ఆర్.వెంకటరమణి ఈసందర్భంగా ధర్మాసనానికి తెలిపారు. దీనిపై న్యాయస్థానం స్పందిస్తూ.. ఈ నిర్మూలన మిషన్ ఎంతకాలం పాటు పని చేస్తుందో తెలియజేయాలని కేంద్రాన్ని ఆదేశించింది. ఈ పిటిషన్‌ను మరో ఆరు వారాల తర్వాత విచారిస్తామని వాయిదా వేసింది.



## సంక్షేమ పథకాల వల్లే కార్మికులు పనిచేయట్లేదు..!

‘భార్యను ఎంతసేపు చూస్తూ ఉండిపోతారు.. ఆదివారాలూ పనిచేయండి’ అంటూ ఇటీవల వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన ఎల్ అండ్ టీ ఛైర్మన్ ఎస్.ఎన్. సుబ్రహ్మణ్యన్ మరోసారి వార్తల్లో నిలిచారు. నిర్మాణ రంగంలో కార్మికుల వలసలు తగ్గిపోవడంపై ఆందోళన వ్యక్తంచేసిన ఆయన.. సంక్షేమ పథకాల అమలు కారణంగానే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. వాటివల్లే కార్మికులు పని చేయడానికి ఇష్టపడటం లేదన్నారు. చెన్నైలో జరిగిన భారత పరిశ్రమల సమాఖ్య సదస్సులో పాల్గొన్న ఆయన కార్మికుల కొరత అంశాన్ని ప్రస్తావించారు. “మా సంస్థలో ప్రస్తుతం 2.5 లక్షల మంది ఉద్యోగులు, 4 లక్షల మంది కార్మికులు ఉపాధి పొందుతున్నారు. ఉద్యోగుల సంఖ్యలో తగ్గుదల ఉన్నప్పటికీ ఆ విషయం పెద్దగా బాధించట్లేదు. కానీ, కార్మికుల లభ్యత గురించి నేను ఎక్కువగా ఆందోళన చెందుతున్నా. ఈ రోజుల్లో కార్మికులు అవకాశాల కోసం వేరే ప్రాంతానికి వలస వెళ్లేందుకు ఇష్టపడట్లేదు. బహుశా స్థానికంగా వారికి సంపాదన బాగానే ఉండొచ్చు. ఇక, అందుబాటులో ఉన్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు కూడా కారణం కావొచ్చు. వాటివల్లే వారు వేరే ప్రాంతాలకు వెళ్లి పనిచేయడానికి ఆసక్తి చూపించట్లేదు” అని సుబ్రహ్మణ్యన్ వ్యాఖ్యానించారు. “అయితే, కేవలం కార్మికుల్లో మాత్రమే కాదు.. వైట్ కాలర్ ఉద్యోగాలు చేస్తున్న వృత్తి నిపుణుల్లోనూ ఇదే భావన ఉందనిపిస్తోంది. నేను ఎల్ అండ్ టీ సంస్థలో ఇంజినీర్‌గా చేరినప్పుడు మా బాస్ దిల్లీలో ఉద్యోగం చేయాల్సిఉంటుందని చెప్పారు. కానీ, ఈ రోజుల్లో ఎవరైనా వ్యక్తిని అలా అడిగితే.. ‘బై’ అంటూ వెళ్లిపోతున్నారు” అని వివరించారు. ప్రస్తుతం ఆయన వ్యాఖ్యలు నెట్టింట వైరల్‌గా మారాయి. ఆ మధ్య వర్క్‌లైఫ్ బ్యాలెన్స్‌పై సుబ్రహ్మణ్యన్ చేసిన వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైన సంగతి తెలిసిందే. “ఇంట్లో కూర్చుని ఏం చేస్తారు. ఎంతకాలం అలా భార్యను చూస్తూ ఉండిపోతారు. ఇంట్లో తక్కువ సమయం, ఆఫీసులో ఎక్కువ సమయం ఉంటామని భార్యలకు చెప్పాలి. వారానికి 90 గంటల పాటు పనిచేయాలి. ఆదివారం సెలవునూ వదిలేయాలి” అని ఆయన చేసిన వ్యాఖ్యలు ఆన్‌లైన్‌లో పెను దుమారం లేపాయి. దీనిపై ఆ తర్వాత కంపెనీ స్పష్టతనిచ్చింది. అభివృద్ధి చెందిన దేశంగా ఎదిగే క్రమంలో అసాధారణ లక్ష్యాలను చేరాలంటే అసాధారణ కృషి అవసరం అంటూ తన ఛైర్మన్ వ్యాఖ్యలను సమర్థించింది.



## మీ సేవ కేంద్రాల వద్ద రద్దీ

హైదరాబాద్: నగరంలోని ‘మీసేవ’ కేంద్రాల్లో భారీగా రద్దీ నెలకొంది. కొత్త రేషన్ కార్డుల కోసం ప్రజలు బారులు తీరారు. బుధవారం ఉదయం నుంచే పెద్ద ఎత్తున అక్కడికి చేరుకున్నారు. రేషన్ కార్డుల్లో మార్పులు, చేర్పులు, ఆధార్ అప్‌డేట్ కోసమూ తరలి వస్తున్నారు. జనం భారీగా వస్తుండటంతో మీసేవ కేంద్రాలు కిక్కిరిసిపోతున్నాయి. గంటల కొద్దీ పడిగాపులు కాస్తున్నామని.. ప్రభుత్వం చెప్పిన రుసుం కంటే ఎక్కువగా వసూలు చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. రద్దీ పెరగడంతో సర్వర్లు మొరాయిస్తున్నాయని మీసేవ నిర్వాహకులు చెబుతున్నారు. మరోవైపు రేషన్‌కార్డుల దరఖాస్తుల్లో గందరగోళం నెలకొంది. ‘మీ సేవ’ కేంద్రాల్లో దరఖాస్తుకు సంబంధించిన రసీదును పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో ఇవ్వాలని నిర్వాహకులు సూచిస్తున్నారు. దీంతో ప్రజలు అక్కడికి వెళ్తున్నారు. భారీగా తరలి రావడంతో ఇటు మీసేవ కేంద్రాలు, అటు పౌరసరఫరాల కార్యాలయం వద్ద రద్దీ నెలకొంది. రెండు చోట్లా గంటల కొద్దీ వేచి ఉండాల్సి వస్తోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మీసేవలో దరఖాస్తు చేశాక మళ్లీ రసీదు ఎందుకు ఇవ్వాలని మండిపడుతున్నారు.

**రేషన్‌కార్డులకు దరఖాస్తు నిరంతర ప్రక్రియ: పౌరసరఫరాల శాఖ,,,** కొత్త రేషన్ కార్డుల కోసం ‘మీసేవ’ కేంద్రాలకు భారీగా ప్రజలు తరలివస్తుండటంతో మరోసారి పౌరసరఫరాల శాఖ స్పందించింది. రేషన్ కార్డుల దరఖాస్తులపై క్లారిటీ ఇచ్చింది.

“రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ నిరంతర ప్రక్రియ. దరఖాస్తుల సమర్పణకు ఎలాంటి గడువు లేదు. దరఖాస్తుదారులు తొందరపడాల్సిన అవసరం లేదు. ప్రజావాణిలో దరఖాస్తు చేసిన వారు మళ్లీ చేయొద్దు. కులగణన, ప్రజాపాలనలో దరఖాస్తు చేస్తే మళ్లీ అవసరం లేదు. మీ సేవలో ఇచ్చిన రసీదు దాచిపెట్టుకోవాలి. దాన్ని ఎక్కడా ఇవ్వాల్సిన అవసరం లేదు” అని స్పష్టం చేసింది.

## ముఖ్యమంత్రికి మాదిగలు రుణపడి ఉంటారు..ఎందుకంటే..?



జుక్కల్: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు చట్టభద్దత కల్పించడంతో పాటు షెడ్యూల్ కులాలను ఏ.బీ.సీ కేటగిరీలుగా రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రకటించినందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాదిగలు రుణపడి ఉంటారని జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అన్నారు. రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణ నేపథ్యంలో బుధవారం మాదిగ ప్రజా ప్రతినిధులతో కలిసి జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీ కాంతారావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని జూబ్లీహిల్స్ లోని ముఖ్యమంత్రి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..దేశంలో ఏ రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు ముందుకు రాకపోయినా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వచ్చి వర్గీకరణ అంశంపై ఏక సభ్య కమిషన్ ఏర్పాటు చేశారన్నారు. వర్గీకరణకు చట్టభద్దత కల్పించడానికి శాసన సభలో చర్చించి, షెడ్యూల్ కులాలకు ఏ.బీ.సీ కేటగిరీలలో రిజర్వేషన్లు అమలు చేయడానికి కార్యాచరణ ప్రకటించడం ఎంతో హర్షించదగ్గ విషయం అన్నారు. ఈ సందర్భంగా లక్ష్మీ కాంతారావు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మాదిగ, మాదిగ ఉప కులాల తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు తదితరులు పాల్గొన్నారు



## జేఈఈ (మెయిన్) ఫలితాలు వచ్చేశాయ్..

దేశ వ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు ఉత్కంఠతో ఎదురుచూస్తోన్న జేఈఈ (మెయిన్) ఫలితాలు వచ్చేశాయి. సోమవారం మధ్యాహ్నం ఫైనల్ కీ విడుదల చేసిన ఎన్‌టీఏ అధికారులు.. తాజాగా విద్యార్థులు సాధించిన పర్సంటైల్ స్కోరుతో ఫలితాలను విడుదల చేశారు. ఎన్ఐటీలు, ట్రిపుల్ ఐటీల్లో బీఈ/బీటెక్ కోర్సుల్లో ప్రవేశాలకు దేశ వ్యాప్తంగా జనవరి 22, 23, 24, 28, 29 తేదీల్లో పేపర్ -1 పరీక్షలు జరిగిన విషయం తెలిసిందే. స్కోర్ కార్డు డౌన్‌లోడ్ చేసుకొనేందుకు అభ్యర్థులు తమ అప్లికేషన్ నంబర్, పాస్‌వర్డ్‌తో పాటు క్యాప్చా కోడ్ ఎంటర్ చేయాల్సి ఉంటుంది.

**ఇద్దరు తెలుగు విద్యార్థులకు 100 పర్సంటైల్...** జేఈఈ మెయిన్ పరీక్షలకు దేశ వ్యాప్తంగా 13,11,544 మంది రిజిస్టర్ చేసుకోగా.. 12,58,136మంది హాజరయ్యారు. ఈ ఫలితాల్లో 14మంది విద్యార్థులు 100 పర్సంటైల్ స్కోరుతో అదరగొట్టారు. వీరిలో ఏపీ నుంచి సాయి మనోజ్ఞ గుత్తికొండ, తెలంగాణ నుంచి బనిబ్రత మజీ ఉండటం విశేషం. జేఈఈ (మెయిన్) పేపర్ -2 (బీఆర్క్/బి ప్లానింగ్) ఫలితాలను తర్వాత ప్రకటించనున్నట్లు ఎన్టీఏ వెల్లడించింది.

**జేఈఈ (మెయిన్) సెషన్-2 పరీక్ష.. దరఖాస్తులు షురూ..** ఏప్రిల్ 1 నుంచి 8వ తేదీ వరకు జేఈఈ మెయిన్ రెండో విడత పరీక్షలు జరుగుతాయి. మొదటి విడత పరీక్షలో సాధించిన స్కోరుతో సంతృప్తి చెందని వారు రెండో విడత పరీక్షలు రాస్తుంటారు. ఈ రెండింటిలో ఉత్తమ స్కోరును పరిగణనలోకి తీసుకొని విద్యార్థులకు ర్యాంకులు కేటాయిస్తారు. ఆ తర్వాత సామాజిక వర్గాల వారీగా రిజర్వేషన్లకు అనుగుణంగా మొత్తం 2.50లక్షల మందిని జేఈఈ అడ్వాన్స్‌డ్ రాసేందుకు అర్హత కల్పిస్తారు. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో సత్తా చాటిన విద్యార్థులకు జోసా కౌన్సిలింగ్ ద్వారా ప్రతిష్ఠాత్మక ఐఐటీల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో ప్రవేశాలు కల్పిస్తారు.



## జబల్‌పూర్ ప్రమాద ఘటన.. గాంధీ ఆస్పత్రికి మృతదేహాలు

సికింద్రాబాద్: ప్రయాగ్‌రాజ్‌లోని కుంభమేళా నుంచి తిరిగొస్తుండగా మధ్యప్రదేశ్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో హైదరాబాద్‌కు చెందిన ఏడుగురు యాత్రికులు దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. వీరి మృతదేహాలను రెండు అంబులెన్సుల్లో జబల్‌పూర్ నుంచి సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రికి తీసుకొచ్చారు. మృతదేహాలను తీసుకెళ్లేందుకు కుటుంబసభ్యులు గాంధీ ఆస్పత్రికి చేరుకున్నారు. పోలీసులు, డీఎంహెచ్‌వో, రెవెన్యూ అధికారుల సమక్షంలో మృతదేహాలను కుటుంబసభ్యులకు అప్పగించనున్నారు. మృతుల కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని బాధిత కుటుంబసభ్యులు, బంధువులు ప్రభుత్వాన్ని కోరారు.



## పథకాల్లో కోతలు.. ఉద్యోగులకు వాతలు

హైదరాబాద్: రాష్ట్రవ్యాప్తంగా 16వేలకుపైగా ఉన్న హోంగార్డులకు రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికీ వేతనాలు చెల్లించకపోవడం సిగ్గుచేటని మాజీ మంత్రి, భారాస ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. జీతాలు రాకపోవడంతో హోంగార్డుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయన్నారు.

ఈ మేరకు హరీశ్‌రావు ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. ఇంటి అద్దెలు, పిల్లల స్కూల్ ఫీజు, రోజువారీ ఖర్చుల కోసం అప్పులు చేయాల్సిన దుస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ప్రతి నెలా ఇదే తీరు కొనసాగుతోందని.. పట్టించుకునే వారే లేరని హరీశ్‌రావు అసహనం వ్యక్తం చేశారు. మాటలు కోటలు దాటితే, చేతలు గడప దాటని ముఖ్యమంత్రి... హోంగార్డులకు ఏం సమాధానం చెబుతారని నిలదీశారు. ‘పథకాల్లో కోతలు, జీతాలు చెల్లించకుండా ఉద్యోగులకు వాతలు..’ అని ఎద్దేవా చేశారు. ఇది ప్రజా పాలన కాదు.. ప్రజా వ్యతిరేక పాలన అని దుయ్యబట్టారు. హోంగార్డులకు తక్షణమే వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని హరీశ్‌రావు డిమాండ్ చేశారు.

## వరంగల్ వచ్చే ధైర్యం లేక రాహుల్ గాంధీ పారిపోయారు : కల్వకుంట్ల కవిత

హైదరాబాద్ : కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీవరంగల్ వచ్చే ధైర్యం లేక పారిపోయారని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జాగృతి మహిళా విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రజలకిచ్చిన హామీలపై నిలదీస్తారనే భయంతో రాహుల్ గాంధీ వరంగల్ పర్యటనను రద్దు చేసుకున్నారని ఆరోపించారు. వరంగల్ లో రాహుల్ గాంధీ చ్చిన రైతు డిక్లరేషన్ అమలే కాలేదని విమర్శించారు. ఇచ్చిన మాట తప్పితే ప్రజలు ఊరుకోబోరని అన్నారు. మహిళలకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే రాష్ట్రంలో కాంగ్రెస్ నాయకులు ఎక్కడా తిరగలేని పరిస్థితి ఏర్పడుతుందని హెచ్చరించారు. ఇక్కడి కాంగ్రెస్ నాయకులను ప్రజలు నమ్మకం లేక ఎన్నికలప్పుడు ఢిల్లీ నుంచి నాయకులను తీసుకొచ్చారని విమర్శించారు. సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ, రాహుల్ గాంధీ వచ్చి చిలుక పలుకులు పలికారని పేర్కొన్నారు. రేవంత్ రెడ్డి ముఖం కాదు. సోనియా, ప్రియాంక, రాహుల్ గాంధీల ముఖం చూసి మహిళలు కొంత వరకు ఓట్లు వేశారు. అధికారంలోకి వచ్చి 14 నెలలు అయినా మహిళలకు 2500 ఇవ్వడం లేదు . రేవంత్ రెడ్డి మహిళలకు రూ .35 వేల చొప్పున బాకీ పడ్డారని ఆరోపించారు. రాష్ట్రంలో మహిళలకు భద్రత లేని పరిస్థితి ఏర్పడిందని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి పాలనలో క్రైమ్ రేటు 20 శాతం పెరిగిందని అన్నారు. ఆడపిల్ల కాలేజీకి వెళ్తే ఇంటికొచ్చే వరకు ఎదురుచూసే పరిస్థితి ఏర్పడిందని, శివారు ప్రాంతాల్లోని ఇళ్లలో దొంగలు చెలరేగుతున్నారని ఆరోపించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో ఒక్క మతకల్లోలం జరగలేదని,రేవంత్ రెడ్డి ప్రభుత్వం వచ్చాకా ఎక్కడో ఒక చోట తరుచూ మతకల్లోలాలు జరుగుతున్నాయి,రాష్ట్రంలో శాంతి భద్రతలు క్షీణించాయని పేర్కొన్నారు.ప్రభుత్వం ఏర్పాటు చేసిన సీసీటీవీల్లో 70 శాతం పనిచేయడం లేదని ఆరోపించారు.



## ఉపవాసం ఉండే భక్తులకు పండ్లు, అల్పాహారం: మంత్రి కొండా సురేఖ

హైదరాబాద్: మహాశివరాత్రి పర్వదినం నేపథ్యంలో అన్ని శైవక్షేత్రాల్లో పటిష్ఠ ఏర్పాట్లు చేయాలని, భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని దేవాదాయశాఖ మంత్రి కొండా సురేఖ అధికారులను ఆదేశించారు. ఉపవాసం ఉండే భక్తులకు ఉచితంగా పండ్లు, అల్పాహారం పంపిణీ చేయాలని తెలిపారు. మహాశివరాత్రి ఏర్పాట్లపై మంత్రి సురేఖ సచివాలయంలో దేవాదాయశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.

భక్తుల తాకిడి ఎక్కువగా ఉండే వేములవాడ, కాళేశ్వరం, కీసర రామలింగేశ్వరస్వామి, ఏడుపాయల వనదుర్గాభవానీ అమ్మవారు, రామప్ప, మేళ్లచెరువు, పానగల్లు, పాలకుర్తి, వేయి స్తంభాల గుడి, కాశీబుగ్గ, భద్రకాళి తదితర ఆలయాల్లో అవసరమైన ఏర్పాట్లపై చర్చించారు. “ఎండలు పెరుగుతున్న నేపథ్యంలో తగు చర్యలు తీసుకోవాలి. ఆలయాల దగ్గర ఎక్కడా మద్యం అమ్మకాలు జరగకుండా కఠిన చర్యలు చేపట్టాలి. అందుకోసం ప్రత్యేకంగా గస్తీ ఏర్పాటు చేయాలి. అన్ని ఆలయాలను సమన్వయం చేసేందుకు హైదరాబాద్‌లో ఎండోమెంట్ కమిషనరేట్‌లో కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలి. గోదావరి, ఇతర నదీ పరీవాహక ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో నదీ హారతి కార్యక్రమం చేపట్టేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలో అన్ని ఆలయాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిపేందుకు జిల్లా కలెక్టర్లు, స్థానిక అధికారులతో సమన్వయం అవసరం” అని మంత్రి సూచించారు. సమావేశంలో దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్, కమిషనర్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# ఫిబ్రవరి 13...కొత్త ఢిల్లీ నగరం దేశ రాజధానిగా ప్రారంభించబడిన దినం




అది భారత దేశపు రాజధాని. వివిధ పాలకుల ఎలుబడులలో మహోన్నత వైభవానికి ఉత్తుంగ శిఖరంలా నిలిచిన ఢిల్లీ నగరమది. భారతీయ ప్రాచీన సభ్యతా సంస్కృతులకు, సాంప్రదాయాలకు, వారసత్వాలకు, ఆచార వ్యవహారాలకు విభిన్న జాతులకు, మతాలకు, కులాలకు వేలాది సంవత్సరాల సాక్షీభూతంగా నిలిచి ఉంది. సహస్రాబ్దుల కాలగమనంలో ఎన్నో ఉత్థాన పతనాలను అనుభవించింది. 42.7 చదరపు కి.మీ. విస్తీర్ణం కలిగిన ప్రస్తుత క్రొత్త ఢిల్లీ, మెట్రోపాలిత ప్రాంతంలో, భారత ప్రభుత్వ కేంద్రపాలిత ప్రాంత పరిధిలో ఉంది. యునైటెడ్ కింగ్ డంకు చెందిన వాస్తు నిపుణులు తయారు చేసిన నిర్మాణ నమూనా అధారంగా రూపొందించిన కొత్త ఢిల్లీ 1931 ఫిబ్రవరి 13న దేశ రాజధానిగా ప్రారంభించ బడింది. కొత్త ఢిల్లీ పూర్వాపరాలు ఒక్కసారి మననం చేసుకుంటే... ఢిల్లీ కేంద్రంగా ఎన్నో వేల సంవత్సరాల చరిత్రలో ఎన్నో సామ్రాజ్యాలు వెలిశాయి, పతన మైనాయి. మహా భారతంలో పాండవుల రాజధాని ఇంద్రప్రస్థం అని ఈ నగరాన్ని ప్రస్తావించారు. 19వ శతాబ్దారంభం వరకు "ఇందర్‌పాత్" అనే గ్రామం ఇక్కడ ఉండేది. బ్రిటిష్‌వారి క్రొత్త రాజధాని నిర్మాణంలో ఆ గ్రామం కనుమరుగు అయింది. క్రీ.పూ. 1000 సంవత్సరాల నాటి రంగువేసిన కూజాలు త్రవ్వకాలలో వెలుగు చూశాయి. పురావస్తు పరిశోధనా సంస్థ (ఆర్కియలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా) వారి అంచనాల ప్రకారం వేల సంవత్సరాలలో నిర్మించిన చారిత్రిక కట్టడాలు 60,000 పైగా ఢిల్లీలో ఉన్నాయి. ఇటీవలి చరిత్ర లోనే "ఏడు సామ్రాజ్యాల రాజధాని"గా ఢిల్లీని వర్ణిస్తారు. గంగా - యమునా మైదానానికి... ఆరావళీ - వింధ్య పర్వత శ్రేణులకు మధ్య ప్రాంతంలో క్రొత్త ఢిల్లీ, యమునా నదికి పశ్చిమ భాగాన ఉన్నందున పురాతన కాలం నుండి ఢిల్లీ ప్రధాన వర్తక మార్గాలకు కూడలిగా ఉంది. ఆ సౌకర్యాల కారణంగానే అక్కడ విద్య, సంస్కృతి, రాజ్యాధికారాలు, వర్ధిల్లాయి. మౌర్యసామ్రాజ్యం కాలం నాటి (క్రీ.పూ. 300) ఆధారాలు స్పష్టంగా తెలుస్తున్నాయి. అప్పటి నుండి ఢిల్లీ అవిచ్ఛిన్నంగా జనావాసంగా వర్ధిల్లింది. శ్రీనివాసపురి ప్రాంతంలో అశోకుని కాలంనాటి శాసనం 1966లో కనుగొన్నారు. ఫిరోజ్‌షా తుగ్లక్ రెండు అశోకుని కాలం నాటి శాసన స్తంభాలను ఢిల్లీకి తెచ్చాడు. కుతుబ్ మినార్ వద్ద ప్రసిద్ధి చెందిన ఉక్కు స్తంభం గుప్త వంశజుడు కుమార గుప్తుడు క్రీ.శ. 320–540 మధ్యకాలంలో తయారు చేయించ బడింది. దానిని 10వ శతాబ్దంలో ఢిల్లీకి తెచ్చారు. 1857 నుండి, ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామం తరువాత, ఢిల్లీ బ్రిటిష్‌వారి అధీనంలోకి వచ్చింది. అప్పుడు బ్రిటిషు వారు కలకత్తా నుండి రాజ్యం చేస్తున్నందు వలన ఢిల్లీ రాజధాని నగరం హోదాను కోల్పోయింది. మళ్ళీ 1911 లో కలకత్తా నుండి రాజధాని ఢిల్లీకి మార్చారు. ఎడ్విన్ లుట్యెన్స్ అనే భవన నిర్మాణ శిల్పి పాత నగరంలో కొంత భాగాన్ని పూర్తిగా కూలద్రోయించి క్రొత్త ఢిల్లీలోని ప్రభుత్వ భవనాల నిర్మాణాన్ని చేయించాడు. ఆంగ్లేయుల పాలనా కాలమందు డిసెంబరు 1911 వరకూ భారత రాజధాని కలకత్తా నగరం వుండేది. ఆ తరువాత రాజధాని ఢిల్లీకి మార్చ బడింది. కానీ ప్రాచీన కాలం నుండి ఢిల్లీ రాజకీయ కేంద్రముగా వుంటూ వస్తున్నది. ప్రత్యేకంగా మొఘల్ సామ్రాజ్య కాలం నుండి ముఖ్యంగా 1799 నుండి 1849 వరకూ ఢిల్లీ కేంద్రంగా వుంటూ వచ్చింది. 1900 ప్రారంభంలో బ్రిటిష్ పరిపాలనా కాలంలో భారత రాజధానిని, కలకత్తా నుండి ఢిల్లీకి మార్చాలనే ప్రతిపాదన వచ్చింది. కలకత్తా భారత్ కు ఈశాన్య దిశలోనూ, భారత్‌కు చెందిన అనేక ప్రాంతాలకు చాలా దూరంగా వుండేది. ఈ కారణాన బ్రిటిష్ రాజ్ పరిపాలనా సౌలభ్యం కొరకు రాజధానిని ఢిల్లీకి మార్చడమే ఉత్తమమని భావించింది. చక్రవర్తి 5వ జార్జి, భారత రాజధాని, కలకత్తా నుండి ఢిల్లీకి మార్చాలని ప్రకటించాడు. షాజహాన్ చే నిర్మింపబడిన పాత ఢిల్లీకి దక్షిణాన క్రొత్త ఢిల్లీ ఉంది. క్రొత్త ఢిల్లీ ఏడు ప్రాచీన నగరాల ప్రాంతంలో ఉంది. ఈ ప్రాంతంలోనే "యంత్ర మందిరం" లేదా జంతర్ మంతర్, లోధీ గార్డెన్స్ మొదలగునవి ఉన్నాయి. కొత్త ఢిల్లీని బ్రిటిష్ వాస్తు శిల్పులు సర్ ఎడ్విన్ లుటియెన్స్, సర్ హెర్బర్ట్ బేకర్ రూపొందించారు. కొత్త రాజధానిని 10 ఫిబ్రవరి 1931 న వైస్రాయ్ మరియు భారత గవర్నర్ జనరల్ లార్డ్ ఇర్విన్ ప్రారంభించారు. కలకత్తా (ఇప్పుడు కోల్‌కతా) బ్రిటిష్ రాజ్ కాలంలో, డిసెంబర్ 1911 వరకు భారత దేశానికి రాజధానిగా ఉంది. పంతొమ్మిదవ శతాబ్దం చివరి నుండి కలకత్తా జాతీయవాద ఉద్యమాలకు కేంద్రంగా మారింది. ఇది బ్రిటిష్ ఇండియా వైస్రాయ్ లార్డ్ కర్జన్ చేత బెంగాల్ విభజనకు దారి తీసింది. ఇది కలకత్తాలో బ్రిటిష్ అధికారుల రాజకీయ హత్యలతో సహా భారీ రాజకీయ, మత పరమైన తిరుగు బాటును సృష్టించింది. ప్రజలలో వలస రాజ్యాల వ్యతిరేక భావాలు బ్రిటీష్ వస్తువులను పూర్తిగా బహిష్కరించ డానికి దారి తీశాయి. పరిస్థితులను గమనించి, వెంటనే రాజధానిని న్యూ ఢిల్లీకి మార్చింది. డిసెంబర్ 12, 1911 న, అప్పటి భారత చక్రవర్తి జార్జ్ %ఎ%, అయన భార్య క్వీన్ మేరీతో కలిసి బ్రిటిష్ రాజ్ రాజధాని కలకత్తా నుండి ఢిల్లీకి మార్చాలని ప్రకటించారు. ఢిల్లీ కొత్త నగరాన్ని నిర్మించడానికి భూమిని, భూసేకరణ చట్టం 1894 కింద స్వాధీనం చేసుకున్నారు. 1912 లో మొదటిసారి ఢిల్లీ సందర్శించిన బ్రిటిష్ వాస్తు శిల్పులు ఎడ్విన్ లుటియెన్స్, హెర్బర్ట్ బేకర్ ప్రణాళిక సిద్ధం చేశారు. కాంట్రాక్టు శోభా సింగ్‌కు ఇవ్వబడింది. మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ప్రారంభమై...1931లో నగర నిర్మాణం పూర్తయిన తర్వాత 1931లో ఫిబ్రవరి 13న, లార్డ్ ఇర్విన్‌చే న్యూ ఢిల్లీ రాజధానిగా ప్రారంభించ బడింది. భారత స్వాతంత్ర్యం తరువాత, 1947 లో, కొద్దిపాటి స్వయం ప్రతిపత్తి నిచ్చి, భారత ప్రభుత్వంచే నియమించ బడ్డ ప్రధాన కమీషనర్ కు పరిపాలనాధికారాలు ఇవ్వ బడ్డాయి. 1956 లో ఢిల్లీ కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటింప బడినది. అలాగే ప్రధాన కమీషనర్ స్థానే లెఫ్టినెంట్ గవర్నర్ ను నియమించారు. భారత రాజ్యాంగ (69వ సవరణ - 1991) ప్రకారం, పూర్వపు జాతీయ రాజధాని ప్రాంతాన్ని కేంద్రపాలిత ప్రాంతంగా మార్చారు. ద్వంద ప్రభుత్వ ( డయార్కీ) వ్యవస్థను పరిచయం చేశారు. ఈ వ్యవస్థలో ఎన్నికైన ప్రభుత్వానికి విశాలాధికారాలు ఇవ్వబడ్డాయి. లా-,-ఆర్డర్ అధికారాలు మాత్రం కేంద్ర ప్రభుత్వ చేతులలో వుంటాయి.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# ఏఐతో ఉద్యోగాలు పోతాయా...జాగ్రత్త అంటున్న మోడీ!



కృత్రిమ మేధ ఏఐ ఇదే ఇపుడు ప్రపంచానికి తారక మంత్రంగా మారింది. ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ సంగతి ఏమిటో తెలియదు. దాని లోతు పాతులు అంతకంటే తెలియదు. కానీ అది టెక్నాలజీ. సాంకేతికత విస్తరించిన తరువాత అందిపుచ్చు కున్నా లేకపోయినా దాని పని అది చేసుకుని పోతుంది. అయితే తెలివైన మానవాళి చేసేది ఏంటి అంటే దానిని మన నియంత్రణలో ఉంచుకుని మరింతగా అభివృద్ధి చెందడం. ఫ్రాన్స్ పర్యటనలో ఉన్న ప్రధాని నరేంద్ర మోడీ ఏఐతో మంచీ చెడ్డా రెండూ ఉన్నాయని జాగ్రత్త అన్న సందేశాన్ని ప్రపంచానికి పంపించారు. ఏఐ విస్తరిస్తోంది. అయితే అది చేసే ప్రమాదాలు పక్షపాతాల గురించి గుర్తెరిగి అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని మోడీ స్పష్టం చేశారు.


ఆర్థిక వ్యవస్థతో పాటు భద్రతాపరమైన రంగాలలో ఏఐ కొత్త పుంతలు తొక్కే సాంకేతికతను అందిస్తుందని మోడీ అన్నారు. అదే సమయంలో ఏఐ విషయంలో ప్రపంచమంతా జాగ్రత్తగా ఉండడమే కాకుండా పరస్పర సహకారం అవసరమని అన్నారు. మరీ ముఖ్యంగా మానవ జీవితాల్లోనూ ఏఐ కీలకమైన పాత్ర పోషిస్తుందని నరేంద్ర మోడీ అన్నారు.

ఏఐ ద్వారా ప్రపంచానికి మేలు చేసే డేటాసెట్ లను అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ప్రజలే కేంద్రంగా ఏఐ సేవలు ఉండాలని చెప్పారు. అంతే కాదు ఆరోగ్యం విద్య సంరక్షణ, వ్యవసాయం ఇలా అనేక కీలక రంగాలలో ఏఐ సేవలను ఉపయోగించుకోవాల్సిన దాని గురించి కూడా చర్చ జరగాలని అన్నారు. ఇక ఏఐ అంటేనే ఉన్న ఉద్యోగాలు పోవడం అన్న భయం ప్రపంచ సమాజంలో ఉందని నరేంద్ర మోడీ అన్నారు. అయితే ఆ భయం తప్పు అని ఏఐ వల్ల కొత్తగా ఉద్యోగాల సృష్టి జరుగుతుందని చెప్పారు. అయితే ఆయా ఉద్యోగాలను అందుకునే స్కిల్స్ ని నేర్చుకోవడానికి ప్రపంచం సిద్ధంగా ఉండాలని ప్రధాని సూచించారు. చరిత్రలో చూస్తే ఏ కొత్త సాంకేతికత అభివృద్ధి చెందినా కూడా కొత్త ఉపాధి అవకాశాలు రావడమే జరిగిందని కూడా ఆయన గుర్తు చేసారు.

ఆ విధంగా చూస్తే కనుక ఏఐ వల్ల మేలు ఎక్కువగానే జరుగుతుందని ఉద్యోగాలు ఎగిరిపోతాయన్న భయాలు ఎవరూ పెట్టుకోవద్దు అని మోడీ సూచించారు. ఇక చూస్తే కనుక మోడీ చెప్పిన దాంట్లో అనేక విషయాలు ఉన్నాయి. పక్షపాతంతో కూడిన ఇబ్బందులు వస్తాయని అన్నారు. అంటే ఏఐని ఎవరికి వారుగా వాడుకుంటూ ఇతర దేశాల ప్రయోజనాలకు భంగం కలిగించరాదు అన్నది అంతర్లీనంగా ఒక సందేశం ఉంది. అలాగే ఏఐ వల్ల పొంచి ఉన్న ప్రమాదాలు అని కూడా మోడీ ప్రపంచానికి హెచ్చరించారు. ఏఐ అన్నది మన నియంత్రణలోనే ఉండాలి. అది ఒక దశ దాటి శృతి మించితే అపుడు ప్రమాదాలే జరుగుతాయన్నది మోడీ చేసిన హెచ్చరికగా చెబుతున్నారు.

# వేద భారతావనిలో ప్రముఖుడు యాజ్ఞవల్క్యుడు

**శ్లో. వందేహం మంగళాత్మానం భాస్వంతం వేద విగ్రహమ్, యాజ్ఞవల్క్యం ముని శ్రేష్ఠం జిష్ణుం హరి హర ప్రభుమ్,**
**శ్లో. జితేంద్రియం జితక్రోధం సదా ధ్యాన పరాయణమ్, ఆనందనిలయం వందే యోగానంద మనీశ్వరమ్‌బీ**
**శ్లో. ఏవం ద్వాదశ నామాని త్రికాలే యః పఠే న్నరఃబీ యోగీశ్వర ప్రసాదేన విద్యావాన్ ధనవాన్ భవేత్...**



యాజ్ఞవల్క్య మహర్షి ప్రాచీన వేద భారతావనిలో ప్రముఖుడు. ఉపనిషత్తుల్లో ముఖ్యంగా కనిపించే యాజ్ఞ వల్క్యుడు శతపథ బ్రాహ్మణం (బృహదారణ్య కోపనిషత్తు సహా), యాజ్ఞవల్క్య సంహిత, యాజ్ఞవల్క్య స్మృతి రచించాడు. పూర్వం కురుపాంచాల దేశంలో గంగానదీ తీరాన చమత్కార పురం అనే నగరంలో ఉండే యజ్ఞవల్క్యుడు అనే మహర్షి, ఆయన భార్య సునందలకు జన్మించినవాడే యాజ్ఞ వల్క్యుడు. యాజ్ఞవల్క్యుడు భాష్కలుడి దగ్గర ఋగ్వేదాన్ని, జైమిని మహర్షి దగ్గర సామవేదాన్ని, అరుణి దగ్గర అధర్వణ వేదాన్ని నేర్చుకున్నాడు. వైశంపాయన మహర్షి దగ్గర యజుర్వేదాన్ని నేర్చుకున్నాడు. అయితే యాజ్ఞవల్క్యుడికి అహంకారం, విద్యామదం లాంటివి కలిగాయి. ఆ విషయాన్ని గురువు గ్రహించాడు. యాజ్ఞవల్క్యుడిలో నానాటికీ విద్యామదం అధికం అయింది. అది ఆత్మాభిమానమని యాజ్ఞవల్క్యుడు అనుకున్నాడు. ఓ రోజున వైశంపాయనుడు తన మేనల్లుడు అధర్మమార్గంలో సంచరిస్తున్నాడని తెలుసుకొని కోపం పట్టలేక కాలితో అతడిని తన్నాడు. బ్రాహ్మణుడిని కాలితో తన్నటం బ్రహ్మహత్యతో సమానమని ధర్మశాస్త్రాలు చెప్పిన విషయాన్ని వైశంపాయనుడు కోపం చల్లారిన తర్వాత గుర్తుకు తెచ్చుకున్నాడు. ఇక ఆ పాపాన్ని ఎవరు పోగొడతారా అని మదన పడసాగాడు. ఆ విషయాన్ని గమనించిన యాజ్ఞవల్క్యుడు గురువు దగ్గరగా వెళ్ళి ఆ పాపాన్ని పోగొట్టడం తనవల్ల తప్ప మరెవరివల్లా కాదని గర్వంగా అన్నాడు. తనపాపం పోవటం అటుంచి అంతటి కష్టకాలంలోను శిష్యుడు అంత గర్వంగా మాట్లాడటం గురువుకు కోపం తెప్పించింది. ఇక తాను ఎలాంటి విద్యలు అతడికి నేర్పబోనని, అప్పటిదాకా నేర్పిన వాటి నన్నింటినీ కక్కి (ఏవీ గుర్తుంచు కోకుండా మరిచిపోయి) వెళ్ళిపొమ్మని అన్నాడు. గురు ద్రోహానికి అదే తగిన శిక్ష అని అన్నాడు. అయితే అప్పటికి యాజ్ఞవల్క్యుడు తాను ఆత్మాభిమానం పేరున గర్వభావాన్ని కలిగివున్నానని తెలుసు కొన్నాడు. క్షమించమని గురువును వేడుకొన్నా లాభం లేకపోయింది. అయితే తనవంతు బాధ్యతగా యాజ్ఞవల్క్యుడు తన తపోబలంతో గురువుకు సంక్రమించిన బ్రహ్మహత్యా దోషాన్ని పోగొట్టి తాను నేర్చుకొన్న వేదాలను అక్కడే రక్తరూపంలో కక్కి వెళ్ళి పోయాడు. అయితే ఎంతో విచిత్రంగా యాజ్ఞవల్క్యుడు విసర్జించినదాన్ని కొన్ని తిత్తిరి పక్షులు గ్రహించి, అవి తిరిగి ఆ వేదసారాన్ని పలికిన పలుకులే తైత్తిరీయోపనిషత్తుగా ప్రసిద్ధికెక్కాయి. గురువు దగ్గర నేర్చుకున్నదంతా అక్కడే వదిలివేసిన యాజ్ఞ వల్క్యుడు ఆత్మస్థైర్యంతో సూర్య భగవానుడిని ఆరాధించి ఆయన కరుణకు పాత్రుడై శుక్ల యజు ర్వేదాన్ని నేర్చుకున్నాడు. తర్వాత సరస్వతీదేవిని ఉపాసించి సమస్త విద్యలూ అభ్యసించాడు. ఉత్తమోత్తమ విద్యాధిపతిగా యాజ్ఞవల్క్యుడు పేరుతెచ్చు కున్నాడు. కణ్వుడు లాంటి ఉత్తమ శిష్యులు ఆయనదగ్గర శిక్షణ పొందాడు. ఒకసారి జనకుడు యాగం చేస్తూ మహర్షులందరినీ ఆహ్వానించాడు. యాజ్ఞవల్క్యుడికి ఆహ్వానం వెళ్ళింది. అలా మహర్షు లందరూ రాగానే జనకుడు మీలో ఎవరు గొప్ప విద్యా వంతులైతే వారొచ్చి ఇక్కడున్న ధనరాశులను తీసుకు వెళ్ళవచ్చు అని అన్నాడు. రుషు లంతా ఒకరిముఖాలు ఒకరు చూసుకొని తామందుకు అర్హులం కామను కొంటూ ఊరకనే కూర్చున్నారు. యాజ్ఞవల్క్యుడు మాత్రం లేచి తన శిష్యులను పిలిచి ఆ ధనరాశులను తన ఇంటికి తీసుకు వెళ్ళమని ఆజ్ఞాపించాడు. యాజ్ఞవల్క్యుడి ధైర్యాన్ని చూసిన తర్వాత అతడితో శాస్త్ర విషయాల్లో పోటీకి దిగి యాజ్ఞ వల్క్యుడిని అనర్హుడిగా నిరూ పించేందుకు చేసిన ప్రయత్నం ఫలించక పోవడంతో జనకుడు ఆ రుషిని గొప్పగా పూజించి సత్కరించాడు. జనకునికి ఆయన అనేక ఆధ్యాత్మిక విషయాలను వివరించి చెప్పాడు. ఓ రోజున విశ్వావసుడు అనే గంధర్వుడు యాజ్ఞవల్క్యుడి వద్దకు వచ్చి, తత్త్వాన్ని ఉపదేశించమని కోరి ఎంతో నేర్చుకొని యాజ్ఞవల్క్య డంతటి గొప్పవాడు మరొకడు లేడని ఆ మహర్షికి ప్రదక్షిణ నమస్కారాలు చేసి వెళ్ళి పోయాడు. అనంతరకాలంలో ఆ రుషి గృహస్థాశ్రమాన్ని స్వీకరించాడు. ఆ రోజుల్లో కతుడు అనే ఒక రుషి ఉండేవాడు. ఆయనకు కాత్యాయని అనే పేరున్న కూతురుండేది. ఆమెను యాజ్ఞవల్క్యుడి కిచ్చి పెళ్ళిచేశారు పెద్దలు. అయితే మిత్రుడు అనే పేరున్న ఒక బ్రాహ్మణుడి కుమార్తె, పండితురాలైన గార్గి అనే ఆమె శిష్యురాలు అయిన మైత్రేయి యాజ్ఞవల్క్యుడిని వివాహ మాడాలని పట్టుబట్టింది.

అప్పటికే అతడికి కాత్యాయనితో వివాహం కావటంతో పెద్దలకు ఏంచేయాలో అర్థంకాలేదు. గార్గి ఈ సమస్యకు సమాధానాన్ని వెతికింది. మైత్రేయిని కాత్యాయనికి పరిచయంచేసి ఆ ఇద్దరూ ఎంతో స్నేహంగా ఉండేలా చేసింది. కాత్యాయని, మైత్రేయి ఒకరిని విడిచి మరొకరు ఉండలేని స్థితికి వచ్చారు. అప్పుడు గార్గి అసలు విషయాన్ని కాత్యాయనికి చెప్పింది. కాత్యాయని కూడా మైత్రేయి కోరికను మన్నించి యాజ్ఞ వల్క్యుడితో వివాహాన్ని జరిపించింది. అలా యాజ్ఞ వల్క్యుడికి ఇద్దరు భార్యల య్యారు. రుషులంతా యాజ్ఞ వల్క్యుడి లోని విద్యా వైభవాన్ని, యోగ ప్రాభవాన్ని గుర్తించి మాఘశుద్ధ పూర్ణిమ నాడు యోగీంద్ర పట్టాభిషేకం చేశారు. అతను ఋషులకు తెలియజేసిన విషయాలే యోగశాస్త్రమని యోగ యాజ్ఞవల్క్య మనీ ప్రసిద్ధికెక్కాయి. యాజ్ఞవల్క్యుడు భార్యలకు తత్వమునుపదేశించి సన్యసిం చాడు. ఆయన పేర ఒక స్మృతి ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# అవినీతిలో మన ర్యాంక్ అదిరిపోయిందిగా?


పాలకులు ఎవరున్నా.. మన దేశంలో అవినీతికి అడ్డుకట్ట వేయటం సాధ్యం కాదా? అవినీతి వ్యవస్థలో వేళ్లూరుకుపోవటమే కాదు.. అంతకంతకూ దాని వేళ్లు మరింత లోతుల్లోకి వెళ్లిపోతున్నాయా? అంటే అవుననే సమాధానం వస్తుంది. తాజాగా విడుదలైన ర్యాంకింగ్ సైతం ఇదే విషయాన్ని స్పష్టం చేస్తోంది. ఇప్పటివరకు కేంద్రంలో కొలువు తీరిన ప్రభుత్వాలకు.. మోడీ హయాంకు మధ్య ఒక తేడా ఉంది. గతంలో కేంద్రంలో ఏ పార్టీ ప్రభుత్వం కొలువు తీరినా మొదటి ఐదేళ్లు ఓకే. రెండో టర్మ్ వచ్చేసరికి.. అవినీతి పుట్టలు బద్ధలవుతూ ఉంటాయి. కానీ.. మోడీ హయాం అందుకు భిన్నం. పదేళ్లు నాన్ స్టాప్ గా పాలన సాగించి.. మరో ఐదేళ్లకు ప్రజల నుంచి అనుమతి పొంది.. అప్పుడే ఏడాది దాటేస్తున్న వేళ.. అవినీతిలో భారత ర్యాంకింగ్ గతంతో పోలిస్తే మెరుగ్గా ఉండాలి కదా? అందుకు భిన్నంగా ఉండటంలో అర్థమేంటి? తాజాగా అవినీతికి సంబంధించిన ర్యాంకింగ్ విడుదల కాగా.. అందులో భారత్ స్థానం మరింత దిగజారింది. ప్రపంచ వ్యాప్తంగా వివిధ దేశాల్లోని అవినీతిని లెక్క కడుతూ.. భారత్ ర్యాంకింగ్ ను డిసైడ్ చేశారు. 2022లో భారత్ ర్యాంక్ 85గా ఉంటే.. 2023లో 93వ స్థానంలోకి దూసుకెళ్లింది. తాజాగా మరో అడుగు ముందుకు వేసి.. 96వ స్థానానికి చేరుకుంది. అంటే.. గడిచిన రెండేళ్లలో అవినీతిలో మన దేశ ర్యాంక్



మరింత దిగజారటమే కాదు.. అంతకంతకూ దరిద్రపుగొట్టు స్థానానికి చేరుకుంటున్న వైనాన్ని తెలియజేస్తుందని చెప్పాలి. ప్రభుత్వ స్థాయిలో అవినీతి ఏ మేరకు ఉందో నిపుణులు.. వ్యాపారవేత్తల అభిప్రాయాలు తీసుకొని ట్రాన్స్ పరెన్సీ ఇంటర్నేషనల్ సున్నా నుంచి వంద మధ్య పాయింట్లను కేటాయించారు. సున్నా అయితే అవినీతి ఎక్కువగా పేర్కొంటున్నారు. ప్రపంచంలో అవినీతి అత్యంత తక్కువగా ఉన్న దేశంగా డెన్మార్క్ తొలి స్థానంలో నిలవగా.. ఫిన్లాండ్ రెండో స్థానంలో.. సింగపూర్ మూడో స్థానంలో నిలిచింది. ఆ తర్వాతి స్థానాల్లో న్యూజిలాండ్.. లక్సంబర్గ్ నిలిచాయి. టాప్ 5 స్థానాల్లో ప్రపంచానికి పెద్దన్న అమెరికాకు చోటు దక్కకపోవటమే కాదు.. సంపన్న దేశాలు లేకపోవటం గమనానార్హం. కఠిన చట్టాలు ఉంటాయని చెప్పే సౌదీ అరేబియా లాంటి దేశాలు సైతం టాప్ 5 అవినీతి రహిత దేశాల జాబితాలో లేకపోవటం విశేషం. ఇక.. మనకు ఇరుగుపొరుగు దేశాలైన పాకిస్థాన్.. శ్రీలంక.. బంగ్లాదేశ్ దేశాలు మనకంటే ఘోరమైన స్థానాల్లో ఉన్నాయి. మన కంటే కాస్త మెరుగైన స్థానంలో చైనా నిలిచింది. అత్యంత అవినీతి దేశంగా సౌత్ సూడాన్ నిలిచింది. ప్రపంచంలోని ప్రతి ప్రాంతంలోనూ అవినీతి ఒక సమస్యగా ఉందని.. అవినీతి పర్యావరణ చర్యలకు ప్రధాన ముప్పుగా మారిందన్న మాట.. ఆందోళనకు గురి చేసేదిలా ఉందని చెప్పక తప్పదు.

# ఇలాంటప్పుడే చంద్రబాబు.. కేసీఆర్ గుర్తుకొస్తారు రేవంత్?

రాజకీయాల్ని పక్కన పెట్టేద్దాం. అనుకోని ఆపద మీద వచ్చి పడినప్పుడు.. అందులో చిక్కుకుపోయినోళ్లు తెలుగోళ్లు అయితే.. వెంటనే స్పందించే రాజకీయ అధినేతల్లో మొదట చంద్రబాబు ఉంటారు. రెండోవారు కేసీఆర్ గా చెప్పాలి. నిజానికి ప్రాంతాలకు అతీతంగా రియాక్టు అయ్యే అధినేతగా చంద్రబాబును చెప్పాలి. తెలుగువారు ఏదైనా ప్రమాదంలో చిక్కుకున్న విషయం తెలిసినంతనే.. వెంటనే వారికి ధైర్యాన్ని చెప్పటం.. అన్నీ తాము చూసుకుంటామంటూ వారి సొంత ఊళ్లకు తీసుకొచ్చేలా చేసే విషయంలో చంద్రబాబు..కేసీఆర్ ఎవరికి వారు ముందుంటారనే చెప్పాలి. ఈ లోటు తాజాగా జరిగిన ఘోర ప్రమాదంలో రుజువైంది. మహా కుంభమేళాకు వెళ్లి తిరిగి వస్తున్న హైదరాబాద్ వాసులు ఘోర ప్రమాదానికి గురి కావటం.. ఏడుగురు ప్రాణాలు కోల్పోవటం తెలిసిందే. నిజానికి ఇలాంటి విషాదం చోటు చేసుకున్నంతనే రాష్ట్ర ముఖ్యమంత్రి హోదాలో ఉన్న తెలంగాణ సీఎం రేవంత్ రియాక్టు కావాలి. వెంటనే మంత్రుల టీంను ఏర్పాటు చేయటం.. వారిని



హుటాహుటిన హెలికాప్టర్ ఇచ్చి అక్కడకు పంపాలి. బాధితులకు ధైర్యం చెప్పాల్సిన అవసం ఉంది. కానీ.. అలాంటిదేమీ తాజా విషాదంలో కనిపించదు. జరిగిన ఘోర ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి తన దిగ్భ్రాంత్రిని వ్యక్తం చేస్తూ ప్రెస్ నోట్ రిలీజ్ చేయటం.. మిగిలిన వ్యవహారాల్ని అధికారులు చూసుకోవాలని ఆదేశించటమే కనిపిస్తుంది. ఇలాంటి విషాదం జరిగినంతనే..సదరురాష్ట్ర ముఖ్యమంత్రితో మాట్లాడటం.. సహాయ సహకారాల్ని అందించాలని కోరటం.. మంత్రుల టీం అక్కడకు వెళ్లి.. డెడ్ బాడీలను నగరానికి వేగంగా వచ్చేలా చూడటం లాంటివి చేయాలి కదా? గతంలో చోటు చేసుకున్న విషాదాల వేళలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పందించటం.. వారికి జరిగిన నష్టాన్ని పూడ్చలేకున్నా.. చేయగలిగినదంతా రాష్ట్ర ప్రభుత్వం చేస్తుందన్న భావన కలిగించేవారు. తాజా ఎపిసోడ్ లో సీఎం రేవంత్ నుంచి పెద్దగా రియాక్షన్ లేకపోవటం వల్లనేమో.. ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సైతం స్పందిచకుండా ఉండటం కనిపిస్తోంది. ఈ ఘోర ప్రమాదవేళ.. పలువురు నగరవాసులు చంద్రబాబును.. కేసీఆర్ ను గుర్తు తెచ్చుకోవటం చూసినప్పుడు.. అందుకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ ఎందుకు అవకాశం ఇస్తున్నారు? అన్న సందేహం కలుగక మానదు. కాదంటారా?

చురకలు

# సంపాదకీయం

## ఏక్ నాథ్ షిండే కుంపటి పెడుతున్నారా ?

రెండున్నరేళ్ళ క్రితం ఏక్ నాథ్ షిండే అన్న పేరు జాతీయ స్థాయిలో మారు మోగి పోయింది. ఆయన శివసేనలో విధేయ నాయకుడు. బాల థాక్రే ఆశీస్సులతో రాజకీయాల్లోకి వచ్చి ఆ తరువాత కుమారుడు ఉద్ధవ్ థాక్రే నాయకత్వాన్ని సైతం బలపరచి శివసేనకు దన్నుగా ఉన్న నేత. అటువంటి ఏక్ నాథ్ షిండే ఉద్ధవ్ థాక్రేకు హ్యాండ్ ఇచ్చి బీజేపీ వైపు వచ్చేశారు. తన దగ్గర ఉన్న ఎమ్మెల్యే బలాన్ని మద్దతుగా ఇచ్చి మహారాష్ట్ర లో బీజేపీ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేందుకు వీలు కల్పించారు. అయితే ఆనాడు ఏక్ నాథ్ షిండే బీజేపీకి దేవుడిలా ఆదుకున్నారు. అందుకే ఆయనకే సీఎం సీటు ఇచ్చేశారు. అది ఏక్ నాథ్ షిండే సైతం ఊహించలేనిది. అయితే తనకు దక్కిన ఉన్నతమైన పదవిని జాగ్రత్తగాన షిండే చేస్తూ తనదైన పాలనతో జనాలలో కొంత మంచి ఇమేజ్ నే సాధించారు. ఇక 2024లో ఎన్నికలు వచ్చాయి. మహాయుతి పేరిట కూటమి కట్టి బీజేపీ ఏక్ నాథ్ షిండే శివసేన, అలాగే ఎన్సీపీ అధినేత అజిత్ పవార్ లతో కలిసి ఎన్నికల్లో పోటీ చేశారు. బంపర్ విక్టరీ కొట్టారు. విపక్షాన్ని ఊది పారేశారు. ఆ తరువాత మొదలైంది అసలు రచ్చ. తనకే మళ్ళీ సీఎం పీఠం దక్కుతుందని భావించారు ఏక్ నాథ్ షిండే. కానీ అలా జరగలేదు. ఈసారి బీజేపీ ఈ పదవి తీసుకుంది. ఉప ముఖ్యమంత్రి పదవిని షిండేకు ఇచ్చింది. దాంతో కొన్నాళ్ళ పాటు ఆయన అసంతృప్తిగా ఉన్నా చేసేది లేక చివరికి ఆ పదవిలో కుదురుకున్నారు. కానీ ఆయన వర్గీయులకు అన్యాయం జరుగుతోందని పదవుల విషయంలో సరైన న్యాయం దక్కడం లేదన్న వేదన షిండేలో ఉంది. జిల్లాలలో నియమించే సంరక్షక మంత్రి పదవి కోసం శివసేన నేత రాయ్ గడ్ జిల్లాలో ఆశించారు. అలా శివసేనకు చెందిన భగత్ గొగోవాలేకి ఈ పదవిని ఇప్పించాలని షిండే కూడా అనుకున్నారు. జిల్లాల అభివృద్ధిలో నిధుల విడుదల ఖర్చు చేసే విషయంలో ఈ సంరక్షణ మంత్రులదే కీలకమైన పాత్ర. అందుకే ఈ పదవి కోసం శివసేన నేతలు కోరుకుంటున్నారు. కానీ ఈ పదవి మీద ఎన్సీపీ కూడా కన్నేసింది. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ కూడా ఈ పదవిని ఎన్సీపీకి ఇవ్వాలని చూడడంతో షిండే వర్గం రగిలిపోతోంది. తమకు ఆధిపత్యం ఉన్న రాయ్ గఢ్ జిల్లాలో ఎన్సీపీకి పదవి ఏంటని మండిపోతున్నారు. ఈ క్రమంలో ఎన్సీపీ అధినేత ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ రాయ్ గఢ్ జిల్లా మీటింగ్ నిర్వహించారు. దీనిని శివసేన వర్గం ఎమ్మెల్యేలు డుమ్మా కొట్టారు. దాంతో ఏదో జరుగుతోంది మయాయుతి కూటమిలో ముసలం పుట్టిందని అంటున్నారు. షిండే తన పూర్వం పార్టీ అయిన ఉద్ధవ్ థాక్రే శివసేనతో చేతులు కలుపుతారా లేక సొంతంగా రాజకీయం చేస్తారా లేక ప్రభుత్వాన్ని తన వైపు తిప్పుకుంటారా అన్న చర్చ సాగుతోంది. అధికారంలోకి వచ్చి నెలలు కాలేదు అపుడే లుకలుకలు రావడంతో పాటు ఏక్ నాథ్ షిండే కుంపటి మెల్లగా రాజుకుంటోంది అని అంటున్నారు. చూడాలి ఈ పరిణామాలు ఎంతవరకూ దారితీస్తాయో అన్నది అంటున్నారు.

# ఫిబ్రవరి 13...ప్రపంచ రేడియో దినోత్సవం




ప్రపంచ రేడియో దినోత్సవం ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 13న నిర్వహించ బడుతుంది. రేడియో మాధ్యమ ప్రాధాన్యతను తెలియజేయడానికి ఈ దినోత్సవం జరుపుకుంటారు. 1946, ఫిబ్రవరి 13న ఐక్యరాజ్యసమితి రేడియో ప్రారంభించబడింది కాబట్టి, ఆ సందర్భంగా ప్రతిఏటా ఫిబ్రవరి 13న ఈ దినోత్సవం జరుపుకునేలా జనరల్ కాన్ఫరెన్స్ 36వ సెషన్‌లో ప్రపంచ రేడియో దినోత్సవాన్ని ప్రకటించాలని బోర్డు యునెస్కోకు సిఫారసు చేసింది. ప్రపంచ రేడియో దినోత్సవాన్ని 2011 నవంబరులో యునెస్కోలోని అన్ని సభ్య దేశాలు ఏకగ్రీవంగా ప్రకటించాయి. రేడియో అనేది విద్య స్థాయి, సామాజిక, ఆర్థిక స్థితి, లింగం వయస్సుతో సంబంధం లేకుండా ప్రపంచ వ్యాప్తంగా చాలా మందికి చేరే మాస్ మీడియా. కాంతి వేగ పౌనఃపున్యాలతో విద్యుత్ అయస్కాంత తరంగాలను మాడ్యులేషన్ చేయటం ద్వారా తీగల ఆధారము లేకుండా గాలిలో శబ్ద సంకేతాలను ప్రసారం చేయు ప్రక్రియను దూర శ్రవణ ప్రక్రియ అంటారు. ఇలాంటి ప్రసారాలను వినటానికి ఉపయోగించే సాధనాన్ని రేడియో అంటారు. సమాచారాల చేర వేత కోసం గతంలో చాలామంది చేసిన ప్రయోగాలన్నీ మార్కోనీ పరిశోధనలకు దోహద పడ్డాయి. బోలోనా విశ్వవిద్యాలయానికి చెందిన ప్రొఫెసర్ రీగ్ అధ్వర్యంలో ఇరవయ్యేళ్ళ యువకుడు మార్కోనీ కొన్ని నెలల పాటు కృషి చేశాడు. తల్లిదండ్రులతో బాటు నివసిస్తున్న తన ఇంటి పై అంతస్తు లోనే అతని ప్రయోగశాల ఉండేది. ఒకరోజు అర్ధరాత్రి సమయంలో తల్లిని నిద్రలేపి ఓ తమాషా చూపిస్తానని పైకి తీసుకెళ్ళాడు. ఒకచోట మోర్స్ కీ 12 అడుగుల దూరంలో ఎలక్ట్రిక్ బెల్ ని అమర్చాడు. కీని నొక్కినప్పుడల్లా గంట మోగడం ప్రారంభించింది. మధ్యలో తీగలు లేకపోయినా గంట మోగటం ఆశ్చర్య పరిచింది. వైర్ లెస్ విధానం ద్వారా తొలి సంకేతాన్ని ప్రసారం చేసిన ఈ ప్రయోగం గొప్ప చారిత్రాత్మక సంఘటన అని చాలాకాలం తరువాత మార్కోనీ తల్లి గ్రహించ గలిగింది. మార్కొనీ క్రమంగా సంకేతాలు వెళ్ళగలిగే దూరాన్ని పెంచుతూ పోయాడు. ఓ చిన్న గుట్ట ఆవలిపైపు దాకా సంకేతాలు వెళ్ళగలిగాయి. సంకేతం ఆవలి వైపున చేరగానే దాన్ని గుర్తించానని తెలియ జేయడానికి గాను ఆయన తమ్ముడు గుట్టపై నిలబడి నాట్యం చేసేవాడు. క్రమంగా సంకేతాలను ఎక్కువ దూరం ప్రసరించేలా చేయడంలో మార్కోనీ కృతకృత్యు డయ్యాడు. 1898 వేసవిలో సముద్ర మధ్యంలో జరిగిన పడవ పందేల గురించి ఎప్పటికప్పుడు వార్తలు పంపడానికి డబ్లిన్ వార్తా పత్రిక మార్కోనీని నియమించింది. ఆయన సముద్ర తీరంలో గ్రాహకాన్ని అమర్చి, వైర్ లెస్ ప్రసారిణిని ఓ పడవలో ఉంచుకొని బయలు దేరాడు. వార్తలను వైర్ లెస్ ద్వారా సముద్ర తీరానికి పంపితే, అక్కడి నుంచి వార్తా పత్రిక కార్యాలయానికి టెలిఫోన్ ద్వారా చేర వేశారు. వైర్ లెస్ ద్వారా పంపబడిన మొట్టమొదటి పత్రికా వార్త ఇదే. వేల్స్ రాకుమారుడు ఒకసారి విహార నౌకలో వెడుతూ వైట్ దీవుల కావల జబ్బు పడ్డాడు. కుమారుని ఆరోగ్య పరిస్థితిని ఎప్పటి కప్పుడు తెలుసు కోవాలని విక్టోరియా రాణి సంకల్పించింది. వెంటనే మార్కోనీని అభ్యర్థించగా అతడు వైర్ లెస్ పరికరాలను నెలకొల్పి, 16 రోజుల పాటు నిర్విరామంగా వార్తలను చేరవేసే ఏర్పాటు చేశాడు. మొత్తం 150 టెలిగ్రాంలు అటూ, యిటూ ప్రసారం చేయబడ్డాయి. 1909 లో రెండు పడవలు సముద్ర మధ్యంలో ఢీ కొన్నాయి. వైర్ లెస్ ద్వారా తీరానికి సమాచారం వెంటనే అందించక పోయి ఉంటే 1700 మంది ప్రయాణీకులు మునిగిపోయే వారు. 1912 ఏప్రిల్ లో టైటానిక్ అనే ఓడ సముద్ర మధ్యంలో ఓ మంచు కొండను ఢీకొంది. ఓడ మునిగి పోతుండగా అక్కడి ఆపరేటర్ వైర్ లెస్ ద్వారా %బూూ% సంకేతాలను అనేక సార్లు పంపించాడు. ఫలితంగా 700 మందిని రక్షించటానికి వీలైంది. 1907 లో బ్రిటిష్ నావికాదళానికి చెందిన ఓడలు ప్రపంచ పర్యటన చేస్తున్న సందర్భంగా జాతీయ గీతం వాద్యాలాపనను ఒక ఓడ నుండి మరో ఓడకి ప్రసారం చేసుకో గలిగారు. మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో సముద్ర తీరం నుంచి 30 మైళ్ల దూరంలో ఉండే యుద్ధనౌకకు వైర్ లెస్ ద్వారా మార్కోనీ సందేశం పంపించ గలిగాడు. మార్కోనీ రేడియో ప్రసారానికి సంబంధించిన పరిశోధనల్ని అవిశ్రాంతంగా కొనసాగించాడు. లిస్బన్ వద్ద సముద్ర తీరంలో వైర్ లెస్ పరికరాల్ని అమర్చి 300 మైళ్ళ దూరం దాకా సంభాషణల్ని ప్రసారం చేయగలిగాడు. కొన్ని నెలల లోపే ప్రపంచంలో కెల్లా తొలి ప్రసార కేంద్రం పిట్స్ బర్గ్ లో స్థాపించ బడింది. అమెరికా అధ్యక్షుడిగా హార్డింగ్ ఎన్నికయ్యాడన్న వార్తను తొలి ప్రసారంలో ప్రకటించటంతో 1920 నవంబరు 2 వ తేదీన కార్యక్రమాలు ప్రారంభ మైనాయి. 1922 మే నెలలో 100 వాట్ల సామర్థ్యం గల రేడియో ప్రసార కేంద్రాన్ని లండనులో స్థాపించారు. 1922 నవంబరులో బ్రిటనులో ప్రసార హక్కులు గల ఏకైక సంస్థ బి.బి. సి. నవంబరు 14 నుంచి లండను కేంద్రం రోజువారీ ప్రసారాలు ప్రారంభించింది. అమెరికా బెల్ టెలిఫోన్ ప్రయోగ శాలల్లో పనిచేసే పరిశోధక బృందం తొలి ట్రాన్సిస్టర్ 1948 లో తయారు చేసింది. బాంబే ప్రెసిడెన్సీ రేడియో క్లబ్, ఇతర రేడియో క్లబ్‌ల కార్యక్రమాలతో బ్రిటిష్ రాజ్ సమయంలో జూన్ 1923 లో భారత దేశంలో ప్రసారం ప్రారంభమైంది. 1927 జూలై 23 న జరిగిన ఒక ఒప్పందం ప్రకారం, ప్రైవేట్ ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ లిమిటెడ్ (ఐబిసి) రెండు రేడియో స్టేషన్లను నిర్వహించడానికి అధికారం ఇచ్చింది: 1927 జూలై 23 న ప్రారంభమైన బొంబాయి స్టేషన్, కలకత్తా స్టేషన్ 1927 ఆగస్టు 26 న ప్రారంభమైంది. 1930 మార్చి 1 న కంపెనీ పరిసమాప్తిలోకి వెళ్లింది. ప్రభుత్వం ప్రసార సదుపాయాలను స్వాధీనం చేసుకుంది, 1930 ఏప్రిల్ 1 న రెండు సంవత్సరాల పాటు ప్రయోగాత్మక ప్రాతిపదికన ఇండియన్ స్టేట్ బ్రాడ్కాస్టింగ్ సర్వీస్ ను ప్రారంభించింది. 1936 జూన్ 8 న ఆల్ ఇండియా రేడియోగా మారింది. ఆకాశవాణి ప్రపంచములోని అతిపెద్ద రేడియో ప్రసార వ్యవస్థలలో ఒకటి. దీని ప్రధాన కార్యాలయము కొత్త ఢిల్లీ లోని పార్లమెంటు వీధిలో భారత పార్లమెంటు ప్రక్కనే ఉన్న ఆకాశవాణి భవన్ లో ఉంది. ఆలిండియా రేడియో ప్రభుత్వ ఆధికారిక రేడియో ప్రసార సంస్థ. ఇది భారత ప్రభుత్వ సమాచార, ప్రసార యంత్రాంగ ఆధ్వర్యములో స్వయం ప్రతిపత్తి కలిగిన ప్రసార భారతి యొక్క విభాగము. దూరదర్శన్ కూడా ప్రసార భారతిలో భాగమే. దేశాభివృద్ధిలో ప్రభుత్వాధీంలో ఉన్న రేడియో, అన్ని రంగాలలోను సమాచారాన్ని ఇస్తూ దేశ సమగ్రతకూ, అభివృద్ధికి ఎంతగానో ఉపయోగ పడుతోంది. ఆల్ ఇండియా రేడియో సేవలు దేశ వ్యాప్తంగా 420 స్టేషన్లను కలిగి, దేశ విస్తీర్ణంలో దాదాపు 92%, మొత్తం జనాభాలో 99.19%కి చేరు కుంటున్నది. 23 భాషలలో, 179 మాండలికాలలో ప్రసారాలు జరుగు తున్నాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494

# బహుముఖ ప్రజ్ఞాశాలి జీడిగుంట రామచంద్రమూర్తి - ఫిబ్రవరి 13... జీడిగుంట జయంతి

ప్రముఖ సినీ రచయిత, ప్రయోక్త, సాహితీవేత్త, కథలు, నాటకాలు, నాటికలు, నవలలు, సినిమా మాటల రచయిత జీడిగుంట రామచంద్ర హైదరాబాద్ రేడియో కేంద్రంలో 28 ఏళ్ల పాటు పనిచేసి పదవీ విరమణ చేశారు. హైదరాబాదు, ఆకాశ వాణిలో ప్రసారమైన 'కార్మికుల కార్యక్రమం'లో ఆయన బాలయ్యగా సుపరిచితులు. అందులోని చిన్నక్క, ఏకాంబరం, బాలయ్య పాత్రలు అప్పట్లో ఎంతో పాప్యులర్ అయ్యాయి. జీడి గుంట రామచంద్ర మూర్తి ప్రముఖ సాహితీవేత్త. రేడియో నాటకాలు రాయడం, వాటిల్లో నటించడంబీ కథలు, నాటికలు, నవలలు, సినిమాలకు సంభాషణలు, అనువాద వ్యాసాల రచన... ఇలా అన్నింట్లో తన కలానికున్న సత్తా చాటారు. 1940లో ఆంధ్రప్రదేశ్ లోని పశ్చిమ గోదావరి జిల్లా నిడదవోలులో జన్మించిన జీడిగుంట రామచంద్ర మూర్తి విద్యాభ్యాసం అనంతరం వరంగల్ సహకార బ్యాంకులో కొంతకాలం ఉద్యోగంచేశారు. ఆ తర్వాత కొన్నాళ్లపాటు విద్యాశాఖలో కూడా పనిచేశారు. 1971లో ఆకాశ వాణిలో ప్రయోక్తగా చేరి.. పూర్తిస్థాయి రేడియో కళాకారుడిగా కొనసాగారు. హంసగమన.. ఆయన రాసిన తొలి కథ. ఆ తర్వాత 400 కథలు, 40 నాటకాలు, 8 నవలలు రాశారు రేడియో, టెలివిజన్, సినిమాల ద్వారా ఆయన రచనలు ప్రాచుర్యం పొందాయి. ఆయన ప్రముఖ తెలుగు రచయిత. ఆయన ఆలిండియా రేడియో, హైదరాబాదు కేంద్రంలో 28 సంవత్సరాల పాటు తన సేవలనందించారు. కేవలం రచనపై ఉన్న ఆసక్తితోనే ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖలో ప్రభుత్వ ఉద్యోగం వదులుకుని ఆకాశ వాణిలో అడుగుపెట్టి పదవీ విరమణ వరకు అందులోనే ఉండి పోయారాయన.. ఆయన "కుటుంబ నియంత్రణ" విభాగంలో స్క్రిప్ట్ రచయితగా, తర్వాత "నాటక విభాగం"లో కార్యక్రమ నిర్వహణాధికారిగా పనిచేశారు. అప్పుడే దాదాపు 40 నాటికల్ని, నాటకాల్ని రాసి ప్రసారం చేశారు. అలాగే ప్రయోక్తగా మల్లాది వెంకట కృష్ణమూర్తి (మందాకిని), ముదిగొండ శివప్రసాద్ (అనుభవ మంటపం), వాసిరెడ్డి సీతాదేవి (ఉరితాడు), యండమూరి వీరేంద్రనాథ్ (నిశ్శబ్దం నీకూ నాకూ మధ్య) లాంటి ప్రముఖ రచయితల నవలలను రేడియో నాటకాలుగా ప్రసారం చేశారాయన. రేడియోలో ఆదివారాల్లో వచ్చే "కార్మికుల కార్యక్రమం"లో "బాలయ్య"గా ఆయన పాత్ర పోషించారు. చిన్నక్క, ఏకాంబరం పాత్రలతో పాటు బాలయ్యగా శ్రోతలు ఆయనను ఆదరించారు. సుమారు నాలుగేళ్లు ఈ కార్మికుల కార్యక్రమాన్ని నిర్వహించి రికార్డు సృష్టించారు. ఆయన ప్రముఖ నిర్మాత దుక్కిపాటి మధుసూదనరావు నిర్మించిన అమెరికా అబ్బాయి సినిమాకు కథ రాసారు. దుక్కి పాటికి రేడియో వాళ్లంటే ఎంతో అభిమానం. ఆ చిత్రానికి ప్రముఖ రేడియో ఆర్టిస్ట్ ఎర్రమనేని చంద్ర మౌళి మాటలు రాశారు. తర్వాత ఈ ప్రశ్నకు బదులేది, పెళ్లిళ్లోయ్ పెళ్లిళ్లు అనే సినిమాలకు సంభాషణలు రాశారు. మరో మాయాబజార్, అమృత కలశం చిత్రాలకు సహ రచయితగా వ్యవహరించారు. టెలివిజన్ లో బాగా ప్రేక్షకాదరణ పొందిన 'మనోయజ్ఞం' సీరియల్‌కు 40 ఎపిసోడ్లకు స్క్రిప్ట్ రాశారు. నిన్నటి కొడుకు కథలు, అశ్రు ఘోష (నాటకం)– 2004 తెలుగు విశ్వ విద్యాలయ సాహితీ అవార్డు లభించింది. ప్రేమకు మిగిలింది, గోదానం, అమూల్యం, నిన్నటి కొడుకు, అమ్మకో ముద్దు, కథలు, వెండితెర సాక్షిగా, గుడిలో పువ్వు ఆయన ప్రముఖ రచనలు. ఆయనకు ముగ్గురు కొడుకులు. ఇద్దరు కొడుకులు అమెరికాలో ఉంటారు. రెండో కుమారుడు జీడిగుంట శ్రీధర్ టీవీ సీరియళ్లలో నటుడు.



అలాగే వెండితెరపై వర్ధమాన నటుడు వరుణ్ సందేశ్ ఆయన పెద్ద కుమారుడు విజయ సారథి కుమారుడు. మనుమరాలు వీణా సాహితి కూడా పాటల రచయిత్రి. ఆమె అలా మొదలైంది సినిమాలో పాటలను వ్రాసారు. చాట్ల శ్రీరాములు నెలకొల్పిన "ప్రతిభా పురస్కారం" 2015 సంవత్సరానికి గానూ లభించింది. 2015 మన్మథ నామ సంవత్సర కళారత్న పురస్కారాన్ని "సాహిత్యం" విభాగంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అందజేసింది. సారా నిషేధ ఉద్యమంపై రచించిన 'పరివర్తన'కు ఉత్తమ రచయితగా నంది అవార్డు, 'ఊర్మిళ–ఉగాది రచనల పోటీ'కు ద్వితీయ ఉత్తమ రచయితగా నంది అవార్డు, దూరదర్శన్‌లో ప్రసారమైన 'పునరపి' సీరియల్‌కు ఉత్తమ టెలీఫిల్మ్ రచయితగా నంది అవార్డు, 'భర్తృహరి సుభాషిత కథలు' లఘుచిత్రాలకు ఉత్తమ కథా రచయితగా నంది అవార్డు, "గుండెపోటు" అనే కథకు 2007 సంవత్సర సోమేపల్లి సాహితీ పురస్కారం అందుకున్నారు. 2020లో కారోనా కాటుకు బలై నవంబర్ 10న ఈ లోకాన్ని విడిచి వెళ్ళారు.

రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494

# భారత కోకిల సరోజినీ దేవి - ఫిబ్రవరి 13 సరోజినీ దేవి జయంతి

దేశం బానిసత్వ, నియంతృత్వ సంకెళ్ళ నుంచీ విముక్తి పొంది స్వతంత్ర్య స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలతో జీవించాలన్న మహత్తర ఆశయం ఉన్నవారు దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచి పోయారు. అటువంటి వాటిలో పురుషులే కాక, ఏ రంగంలోనూ, తీసిపోరని నిరూపించిన వీరమహిళలు మన దేశంలో చాలా మంది పుట్టారు. అటువంటి వారిలో శ్రీమతి సరోజినీ నాయుడు కూడా ఒకరు. భారత కోకిలగా ప్రసిద్ధి చెందిన కవయిత్రి . సరోజినీ దేవి 1925డిసెంబరులో కానుపూరులో జరిగిన అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మహాసభలకు తొలి మహిళా అధ్యక్షురాలు, స్వతంత్ర భారతదేశపు తొలి మహిళా గవర్నరు కూడా. బెంగాలీయుల ఆడపడుచు, తెలుగు వారి కోడలు.. సరోజినీ పన్నెండో ఏట మద్రాస్ యూనివర్సిటీ మెట్రిక్యులేషన్ పరీక్షలో ప్రథమురాలిగా నిలిచి పలువురి ప్రశంసలందుకుంది. 13సంవత్సరంలోనే ది లేడి ఆఫ్ ద లేక్ పేరున 1300 పంక్తుల కవితను ఆరు రోజుల్లో రాసింది. సరోజినీ దేవి చటోపాధ్యాయ హైదరాబాదులో శ్రీమతి సరోజినీ నాయుడు అఘోరనాథ్ ఛటోపాధ్యాయ, వరద సుందరీ దంపతులకు 1879 ఫిబ్రవరి 13న వారి ప్రథమ సంతానంగా ఒక బెంగాలీ బ్రాహ్మణ కుటుంబములో జన్మించింది. తండ్రి అఘోరనాథ్ చటోపాధ్యాయ తూర్పు బెంగాల్ కు చెందిన గొప్పవిద్యావేత్త, డా.ఆఫ్ సైన్స్ డిగ్రీని పొందిన మొదటి భారతీయుడు. నిజాం కాలేజీ స్థాపకుడు, శాస్త్రవేత్త, తత్వవేత్త. తల్లి భువనసుందరి దేవి ఒక కవయిత్రి. చిన్నతనం నుంచీ ఆమెకు ఇంగ్లీషు భాషమీద చాలా మక్కువ ఉండేది. ఇంగ్లీషు మాట్లాడాలని ఆమె ఎంతగానో ప్రయత్నిస్తూండేది. ఆ పట్టుదలా, ధ్యేయాలతోనే ఇంగ్లీషు భాషను ఎంతో శ్రద్ధగా అభ్యసించింది. సెయింట్ జార్జ్ గ్రామర్ స్కూల్ లో చదువుకుంది. పదకొండో సంవత్సరం వచ్చేసరికి ఆమె అనర్గళంగా ఇంగ్లీషు మాట్లాడి అందరినీ ఆశ్చర్య చకితుల్ని చేసింది. ఆ వయసులోనే ఇంగ్లీషులో రచనలు ఆరంభించింది. ఆమె పన్నెండవ ఏట మదరాసు విశ్వవిద్యాలయం మెట్రిక్యులేషన్ పూర్తి చేయగలిగిందంటే ఆమె చురుకైన తెలివితేటలూ, విద్య యందు ఆమెకు గల భక్తి భావం మనం అర్థం చేసుకోవచ్చు. సరోజినీ పదమూడవ యేట చాలా పెద్ద రచన రచించింది. దానిపేరు సరోవరరాణి. అది పదమూడు వందల పంక్తులతో నిండిన అతి చక్కని రచన. తాను చెప్పదలచుకున్న విషయము ఇతరుల హృదయాలకు హత్తుకుని ఆలోచింపజేసే విధంగా కమ్మని శైలిలో చిన్న తనం నాడే రచనలు ప్రారంభించిన ఆమెలోని ప్రత్యేకతలు గ్రహించిన నిజాం నవాబు ఆమె యందు గల అభిమానంతో ఆమెను విదేశాలకు పంపాలని నిర్ణయించుకుని, ఆమె వివిధ శాస్త్రాలలో పరిశోధన చేసేందుకు ప్రోత్సాహమిస్తూ ఆమెకు ప్రతి సంవత్సరం నాలుగువేల రెండు వందల రూపాయలు విద్యార్థి వేతనంగా ఇచ్చేందుకు కూడా అంగీక రించాడు. సరోజిని కవితలని చదివి, మెట్రిక్యులేషన్లో మొదటి స్థానాన్ని తెచ్చుకున్న ఆమె ప్రతిభని గుర్తించిన హైద్రాబాద్ నిజామ్ ప్రభువు విదేశాల్లో చదువుకి ఉపకార వేతనం ఇచ్చారు. కానీ అనారోగ్య కారణంగా రెండు సంవత్సరాలు విశ్రాంతి తీసుకోవలసి వచ్చింది. ఆ రెండు సంవత్సరాలు పుస్తక పఠనంలోనే గడిపి అపారమైన జ్ఞానాన్ని సముపార్జించారు. ఆ కాలంలోనే పదహారేళ్ళ వయసులో సరోజినీ పై చదువులకు లండన్ ప్రయాణమై వెళ్ళారు. లండన్లోనే ప్రముఖ కవులైన ఎడ్మండ్ గాస్, ఆర్థర్ సైమన్ల పరిచయం కలిగింది. ప్రథమ కవితా సంకలనం "గోల్డెన్ త్రెష్ హెూల్డ్"లో మూడు ప్రక్రియలూ ఉన్నాయి. ఆ సంకలనం రూపొందడానికి ఆర్థర్ సైమన్ ముఖ్య కారకులు. ఆర్థర్ సైమన్ ప్రోత్సాహంతో మొదటి కవితా సంకలనం వెలువడింది. 1915 వ సంవత్సరం బొంబాయిలో జరిగిన కాంగ్రెస్ మహాసభ లకూ, 1916 లో జరిగిన లక్నో కాంగ్రెస్ సభలలో ఆమె పాల్గొనటం జరిగింది. ఆనాటి కాంగ్రెస్ భావాలు చాలా ఆదర్శంగా ఉండేవి. సరోజినీనాయుడు భారత దేశములో గల ముఖ్యమైన, నగర, పట్టణాలు తిరుగుతూ స్వాతంత్ర్యోద్యమ ఉపన్యాసాలిచ్చి, ప్రజలతో భాష విప్లవము వచ్చేందుకు కారకురాలయినది. సరోజినీ నాయుడు1930లో ఉప్పు సత్యాగ్రహంలో మహాత్మాగాంధీతో పాటు పాల్గొన్నది. ఆమె మద్రాసులో చదువుకున్నది. చదువు పూర్తయిన తర్వాత 19 సంవత్సరాల వయసులో ఆయనను కులాంతర వివాహము చేసుకున్నది. కులాంతర వివాహములకు సమాజము చాలా వ్యతిరేకముగా ఉన్న ఆ రోజుల్లో సరోజిని గోవిందరాజులు నాయుడును చట్టము ప్రకారము 1898 డిసెంబర్ 2న మద్రాసులో పెళ్ళి చేసుకున్నది. ఈ వివాహాన్ని కందుకూరి వీరేశలింగం పంతులు జరిపించారు. నాయుడు దంపతులకు నలుగురు పిల్లలు కలిగారు: జయసూర్య, పద్మజ, రణధీర, లీలామణి. ఆమె మొదటి1905లో కవిత్వం గోల్డెన్ త్రెషోల్డ్ ఇంగ్లీషులో కవిత్వం రాసింది. నైటింగేల్ ఆఫ్ ఇండియాగా ప్రపంచపు ప్రఖ్యాత గడించింది. తర్వాత ది బర్డ్ ఆఫ్ టైం, ది బ్రోకెన్ వింగ్, పాలంక్విన్ బేరర్స్ ఆమె కవితల్లో కొన్ని. జాన పద గేయాల్లో అత్యంత ప్రాముఖ్యమైన "పాలంకీన్ బియరర్స్" ఉంది. కవికోకిల కవితలలో గేయాలు, గీతాలు, పద్యాలు ఉన్నాయి. పురోగతినీ, స్వచ్ఛమైన స్వేచ్ఛా, స్వాతంత్ర్య జీవితాలను వాంఛించిన పురుష కవి రవీంద్రనాథ్ ఠాగూర్ మాదిరిగా



స్త్రీయై ఉండి కూడా జాతి విమోచనానికి శాయశక్తులా అహోరాత్రులు కృషి చేసిన త్యాగ పూరిత కవయిత్రి శ్రీమతి సరోజినీనాయుడనటంలో యే మాత్రము సందేహం లేదు. 1908లో మూసీనదికి వరదలు సంభవించిన సమయంలో చేపట్టిన సేవాకార్యక్రమానికి బ్రిటీష్ ప్రభుత్వం "కైజార్ ఎ హిందూ" స్వర్ణ పతకాన్ని బహుకరించింది. భారతీయ ప్రతినిధిగా 1931 వ సంవత్సరంలో లండన్ రౌండ్ టేబిల్ కాన్ఫరెన్స్ కు వెళ్ళింది. క్విట్ ఇండియా ఉద్యమంలో 1942 లో బ్రిటిష్ ప్రభుత్వాన్నెదిరించి ఎన్నో రకాలుగా స్వాతంత్ర్య పోరాటం సాగించిందామె. అందుకు ఫలితంగా అరెస్టు చేయబడి, దాదాపు 1945 వరకు దుర్భర కారాగారవాస జీవితం నవ్వుతూ అనుభవించింది. తండ్రి మరణాంతరం రచించిన విషాద కవితలు ఈమెకు కైసర్–ఇ–హిండ్' బంగారు పతాకాన్ని సాధించి పెట్టింది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత దేశంలో అతిపెద్ద అప్పటి రాష్ట్రం ఉత్తరప్రదేశ్ కు గవర్నరుగా నియమించ బడింది. హైదరాబాదులో తాను నివసించిన ఇంటికి తన మొదట కవితా సంకలనం 'పేరునే స్వర్ణ ప్రాంగణంగా" ఎన్నుకొన్నది. ఆమె 1949 మార్చి 2న లక్నోలో మరణించినది. ఈమె జ్ఞాపకార్థం భారత ప్రభుత్వం 1964 ఫిబ్రవరి 13న ఆమె చిత్రంతో ఒక తపాలబిళ్ళను విడుదల చేసింది. ఆమెపై అభిమానంతో హైదరాబాదులో సికింద్రాబాద్ లో ఒక వీధికి సరోజినీ దేవి రోడ్డు' అని నామకరణం చేసారు. ఈమె పేరున హైదరాబాదులో సరోజినీ కంటి ఆసుపత్రి'ని కూడా స్థాపించారు. ఆమె విలువైన వస్తువులు ఇప్పటికీ సాలార్ జంగ్ మ్యూజియంలోను, జాతీయ పురావస్తు ప్రదర్శనశాల లోనూ భద్రంగా ఉన్నాయి.

రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494

# విద్యుత్తు డిమాండ్ పైపైకి..

కొత్తగూడెం : ఎండల తీవ్రత మొదలవటంతో ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో విద్యుత్తు వినియోగం రోజురోజుకూ పెరుగుతోంది. వ్యవసాయం, పరిశ్రమలకు విద్యుత్తు వాడకం అధికమవటంతో పాటు గృహవినియోగం భారీగా ఉండటంతో గరిష్ఠ స్థాయిలో విద్యుత్తు డిమాండ్ నమోదవుతున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఖమ్మం జిల్లాలోని నాలుగు సర్కిళ్ల పరిధిలో ఫిబ్రవరి 1 నుంచి 6 వరకు 35.30లక్షల యూనిట్ల విద్యుత్తును కేటాయిస్తే.. 47.28లక్షల యూనిట్లు వినియోగించటం గమనార్హం. భద్రాద్రి జిల్లాలో 2024-25 సంవత్సరానికి 1,014.34లక్షల యూనిట్లు కేటాయిస్తే.. డిసెంబర్ నాటికే 962.28లక్షల యూనిట్ల విద్యుత్తును వాడేశారు. వచ్చే ఏప్రిల్ నాటికి కేటాయింపుల వినియోగం భారీగా పెరిగే అవకాశముంది.

**అధిక వినియోగానికి కారణాలు**

సాధారణంగా యాసంగి సీజన్‌లో సాగునీటి అవసరాలు పెరుగుతుంటాయి. విద్యుత్తు డిమాండ్ అధికంగా ఉంటుంది. వ్యవసాయ రంగానికి ప్రభుత్వం నిరంతరాయంగా విద్యుత్తు సరఫరా చేస్తుండటంతో కొంతమంది రైతులు అవసరానికి మించి వినియోగిసున్నారు.

ఖమ్మం, కొత్తగూడెం, పాల్వంచ లాంటి పట్టణాల్లో పరిశ్రమలు, ఐటీ కంపెనీలు, మౌలిక సదుపాయాలు పెరుగుతుండటంతో విద్యుత్తు వినియోగం గణనీయంగా పెరుగుతోంది. గతేడాదితో పోల్చితే పారిశ్రామిక అవసరాలకు కేటాయించిన విద్యుత్తు వినియోగం 20శాతం పెరిగినట్లు ఆశాఖ అధికారులు చెబుతున్నారు.

పట్టణాలు, పల్లెలు అనే తేడా లేకుండా సామాన్యులకు సైతం వాటర్ హీటర్లు, కూలర్లు ఇతర ఎలక్ట్రానిక్ ఉపకరణాలు అందుబాటులో ఉండటంతో విరివిగా ఉపయోగిస్తున్నారు. ఇది విద్యుత్తు వినియోగం పెరగటానికి కారణమవుతోంది. ఖమ్మం నగరం, కొత్తగూడెం, పాల్వంచ తదితర పట్టణాల్లో జనాభాకు అనుగుణంగా అపార్టుమెంట్ల సంఖ్య పెరుగుతుండటంతో విద్యుత్తు వినియోగమూ అధికంగా ఉంటోంది.

**అధికారులు తీసుకుంటున్న చర్యలు..**

విద్యుత్తుశాఖ ఉన్నతాధికారులు ప్రతినెలా సమీక్షలు నిర్వహిస్తూ.. డిమాండ్‌కు తగ్గ సరఫరా జరిగేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. విద్యుత్తు వినియోగం పెరిగిన సమయంలో సరిగ్గా పంపిణీ చేయటానికి ముందస్తు ఏర్పాట్లు చేస్తున్నారు. వేసవిలో విద్యుత్తు వినియోగం భారీగా నమోదయ్యే అవకాశం ఉండటంతో అందుకు తగ్గట్టు ప్రణాళికలు రూపొందిస్తున్నారు. సోలార్ ప్లాంట్ల ఏర్పాటును ప్రోత్సహిస్తున్నారు. వివిధ సంస్థలతో ఒప్పందాలు కుదుర్చుకుని సౌరశక్తి ద్వారా విద్యుదుత్పత్తిని పెంచేందుకు ప్రయత్నిస్తున్నారు. అధిక విద్యుత్తు వినియోగం నేపథ్యంలో విద్యుత్తు నియంత్రికలపై భారం పడకుండా చర్యలు చేపడుతున్నాం. ఇప్పటివరకు 13 సబ్‌స్టేషన్లలో లోడ్‌కు అనుగుణంగా వాటి సామర్థ్యాన్ని పెంచాం. అవసరాన్ని బట్టి కొత్త నియంత్రికలు అమర్చుతున్నాం. వేసవిలో విద్యుత్తు కోతలు తలెత్తకుండా చర్యలు చేపడుతున్నాం. సురేందర్, ఎస్ఈ, టీజీఎన్‌పీడీసీఎల్, ఖమ్మం

# వంతెన.. కథ కంచికేనా?

హైదరాబాద్ : నగరాభివృద్ధికి చిహ్నాలు అనుకున్న మూసీ నది వంతెనలు తీవ్ర నిర్లక్ష్యానికి గురవుతున్నాయి. నగరంలో 55కి.మీ పొడవున ప్రవహిస్తోన్న నదిని అబ్బురపరిచే పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించగా.. ఆ కారణంతో హెచ్ఆర్‌డీసీఎల్(హైదరాబాద్ రహదారుల అభివృద్ధి సంస్థ), ఎంఆర్‌డీసీఎల్(మూసీ నది అభివృద్ధి సంస్థ) 14 వంతెనలను రద్దు చేసింది. ఒక్క ముసారంబాగ్‌లోని వంతెన పనులే ప్రస్తుతం జరుగుతున్నాయి. రద్దయిన వాటిలో.. సగం పూర్తయిన పనులు ఉండటం ఆందోళనకు తావిస్తోంది. అనేక మంది రైతులను ఒప్పించి, వారి పొలాలను రోడ్డు నిర్మాణం కోసం సేకరించి, యుద్ధప్రాతిపదికన చేపట్టిన పీర్జాదిగూడ మూసీ వంతెన, పిల్లర్ల దశలో నిలిచిన చింతల్‌మెట్ వంతెన, ఇతరత్రా ఉన్నాయి. కోట్లాది రూపాయలతో చేపట్టిన రోడ్ల పనులను అర్ధాంతరంగా నిలిపేయడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. హెచ్ఆర్‌డీసీఎల్, ఎంఆర్‌డీసీఎల్ తీసుకున్న నిర్ణయంతో.. తమ ప్రాంతాలు ట్రాఫిక్ చిక్కుల్లో కూరుకుపోతున్నాయని ప్రజలు గగ్గోలుపెడుతున్నారు.

**వెలవెలబోతున్న పీర్జాదిగూడ వంతెన..**

మూసీ నదిపై రూ.545కోట్లతో పలు వంతెనలు నిర్మించాలన్నది గత సర్కారు ప్రణాళిక. ముసారాంబాగ్, చాదర్‌ఘాట్, నార్సింగి, ప్రతాపసింగారం, సన్‌సిటీ, తదితర ప్రాంతాల్లో వంతెనల పనులకు నాడు టెండర్లు పిలవగా.. పలు చోట్ల పనులు మొదలయ్యాయి. అందులో పీర్జాదిగూడ వంతెన కీలకమైనది. నాగోల్ బండ్లగూడ నుంచి ఇప్పటికే మూసీ నది వరకు లింకు రోడ్డు నిర్మించారు. పీర్జాదిగూడ ప్రధాన రహదారి నుంచి మూసీ వరకు భారీ రోడ్డు మార్గాన్ని నిర్మించి, బండ్లగూడ, పీర్జాదిగూడ ప్రాంతాలను కలపాలన్నది ప్రణాళిక. తద్వారా



వరంగల్ జాతీయ రహదారితో అనుసంధానం ఏర్పడుతుందని అధికారులు భావించారు. అనుకున్నట్టే.. మూడేళ్ల కిందట రూ.40కోట్ల అంచనా వ్యయంతో పనులు మొదలయ్యాయి. పీర్జాదిగూడవైపు 50శాతం పనులు పూర్తయ్యాయి. అంతలోనే ప్రాజెక్టును ఆపేయాలంటూ ఎంఆర్‌డీసీఎల్ కోరిందంటూ ఇంజినీర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వ సూచనతోనే తాము పనులు ఆపాలని కోరినట్టు ఎంఆర్‌డీసీఎల్ చెబుతోంది.

**ఇతర ప్రాజెక్టులదీ అదే పరిస్థితి..**

రూ.12.88కోట్లతో సన్‌సిటీ-చింతల్‌మెట్ ప్రాంతాల మధ్య నిర్మించనున్న పైవంతెన పనులు 20శాతం జరిగాయి. ఎంఆర్‌డీసీఎల్ పనులు ఆపేయాలని కోరినట్టు హెచ్ఆర్‌డీసీఎల్ చెబుతోంది. సన్‌సిటీ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది.

ముసారాంబాగ్‌లో మూసీపై మొదలైన వంతెన నిర్మాణం నిధుల్లేక నత్తనడకన సాగుతోంది. నాలుగు నెలల్లో వర్షాకాలం రాబోతుందని, పనుల్లో వేగం పెంచాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రతాపసింగారం-గౌరెల్లి గ్రామాల మధ్య, చాదర్‌ఘాట్ వద్ద నిర్మించతలపెట్టిన వంతెనలకు రెండేళ్ల కిందట శంకుస్థాపన జరిగింది. పనులు ఇప్పటికీ మొదలు కాలేదు. భూసేకరణ సమస్య పేరుతో సున్నంచెరువు-బోరబండ లింకు రోడ్డును మధ్యలో ఆపేయడంతో ఇబ్బందులు తప్పడంలేదు.

# గొంతెండే ఊళ్లు.. అందేనా తాగునీళ్లు!



పాల్వంచ : వేసవిలో తాగునీటి ఎద్దడి ఎదురవకుండా జిల్లా అధికార యంత్రాంగం జాగ్రత్తలు తీసుకుంటోంది. ఎంపీవో, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ, గ్రిడ్ ఏఈ, పంచాయతీ కార్యదర్శితో కూడిన ప్రత్యేక బృందం పంచాయతీలను సందర్శించి సమస్యలను గుర్తిస్తోంది. సమస్యల వారీగా ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపనుంది.

మారుమూల గొత్తికోయ గ్రామాల్లో దాహార్తి తీరే పరిస్థితుల్లేవు. చాలాగ్రామాల్లో తాగునీటి పథకాలు పనిచేయట్లేదు. వాటిల్లో అత్యధికం సౌర విద్యుత్, మోటారు ఆధారంగా ఏర్పాటు చేసినవే. గతంలో వేసిన చేతిపంపులు నిర్వహణలేక మూలనపడ్డాయి. అటవీశాఖ ఆంక్షల నేపథ్యంలో తక్కువ లోతులో పైపులు దింపగా.. అవన్నీ వేసవి ఆరంభంలోనే అడుగంటుతున్నాయి. ఫలితంగా వందలాది గిరిజన గూడేల ప్రజలు సమీప వాగులు, చెలమలపై ఆధారపడి దాహార్తి తీర్చుకుంటున్నారు. మిషన్ భగీరథ పథకం కింద పలు గొత్తికోయపల్లెల్లో ఇంటింటికీ నల్లాలు బిగించినా చుక్కనీరు సరఫరా కావటం లేదు.

**అక్రమ కనెక్షన్లపై నజర్..**

అధికారులు చేపట్టే ప్రత్యేక పరిశీలనలో మొత్తం తాగునీటి వనరులను పరిశీలిస్తారు. స్థానిక పథకాలెన్ని ఉన్నాయి? వాటిలో పనిచేసేవి ఎన్ని? చేపట్టాల్సిన మరమ్మతులేమిటి? అనేవి నమోదు చేస్తారు. పంచాయతీ స్థాయిలో పరిష్కారమయ్యేవి ఉంటే అధికారుల ప్రత్యక్ష పరిశీలనలో ఆయా పనులు పూర్తిచేయిస్తారు. లేదంటే ప్రతిపాదనలు తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తారు. గ్రామ సందర్శన సమయంలోనే 'మిషన్ భగీరథ' పైపులైన్‌కు ఏమైనా అక్రమ కనెక్షన్లు ఉన్నాయా? అని గమనిస్తారు. ఉదాహరణకు.. పాల్వంచ మండలం పాండురంగాపురం ఏరియాలో మిషన్ భగీరథ పైపులైన్‌కు అక్రమంగా కనెక్షన్లు ఇచ్చారు. కొందరు పైపు అడుగు భాగం నుంచి మరీ పైపులు అక్రమంగా బిగించారు. దీంతో పైప్రాంతాలకు నీళ్లు సరిగా సరఫరా కావడం లేదు. ఇలాంటి కనెక్షన్లు ప్రతి పల్లెలో పదుల సంఖ్యల్లో ఉన్నాయి. ప్రత్యేక డ్రైవ్‌లో ప్రతి పంచాయతీ సమస్యల్ని పరిశీలించి పరిష్కరిస్తాం. మరమ్మతులకు ఎక్కువ మొత్తం కావాల్సిన చోట ప్రతిపాదనలు రూపొందిస్తాం. తాగునీటి వనరులను అందుబాటులోకి తీసుకొస్తాం. మహేశ్వరి, ఏఈ, ఆర్‌డబ్ల్యూఎస్, పాల్వంచ

# ప్రసాద్ అందివస్తేనే.. పర్యాటక శోభ..!



భద్రాచలం : పవిత్ర పుణ్యక్షేత్రమైన భద్రాచలం, పర్ణశాలల్లో పర్యాటక శాఖ చేపట్టిన సుందరీకరణ, అభివృద్ధి పనులు అనుకున్న సమయానికి పూర్తయి ఉంటే ఇప్పటికే భక్తులకు ఉపయోగకరంగా అందుబాటులోకి వచ్చేవి. ఈ ఏడాది ఏప్రిల్ 6న శ్రీరామ నవమి సందర్భంగా సీతారామ కల్యాణం, 7న పట్టాభిషేక మహోత్సవం జరగనున్నాయి. ఆ వేడుకలకు వచ్చే భక్తులకు టూరిజం విభాగం ద్వారా సదుపాయాలను కల్పించాలంటే ఈ పనులను నాణ్యతతో పూర్తి చేయాల్సి ఉంది. ఈ అంశంలో సంబంధిత అధికారులు ప్రత్యేక చొరవ తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు. కేంద్ర పర్యాటక శాఖ మంత్రి కిషన్‌రెడ్డి చొరవతో 'ప్రసాద్' పథకం ద్వారా రూ. 41.38 కోట్లు మంజూరయ్యాయి. ఈ పనులకు 2022 డిసెంబరులో ఇక్కడ పర్యటించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము భూమి పూజ చేశారు. ఈ పనులు 2024 డిసెంబరులో పూర్తి కావాల్సి ఉన్నా ఇంకా తుది దశకు చేరలేదు. దీంతో ఈ ఏడాది మార్చికి పూర్తి చేస్తామని ఇంజినీర్లు గడువు కోరారు.

**సాగుతున్న పనులు..**రాముడు కొలువైన భద్రగిరితో పాటు వనవాసం సమయంలో నివాసం ఉన్న పర్ణశాలలో అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. భద్రాచలం రామాలయ కల్యాణ మండపం ప్రాంగణంలో భక్తులు కూర్చునేందుకు వీలుగా షెడ్ల నిర్మాణం పనులు బేస్‌మెంట్ వరకే సాగాయి.

భక్తుల వసతి సదుపాయాల కల్పనకు స్థానిక శిల్పినగర్‌లో కల్యాణ కట్ట, భద్రాతా సిబ్బంది కార్యాలయం, వ్రత మండపం, వసతి విభాగం, శౌచాలయ నిర్మాణం సాగుతోంది. ఈ పనులు దాదాపు సగం మేర పూర్తయ్యాయి. గోదావరి బ్రిడ్జి వద్ద క్యాంటిన్, పార్కింగ్, శౌచాలయ నిర్మాణం సాగుతోంది. ఈ రెండు చోట్ల విద్యుత్తు స్తంభాలు, ప్రత్యేక దీపాలు, సీసీ కెమెరా వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు.

భద్రాచలం, పర్ణశాల వద్ద నదిలో భక్తులు బోట్ షికారు చేసేలా ఏర్పాట్లు చేయనున్నారు. పర్ణశాలలో స్తంభాలు, షెల్టర్లు, కిచెన్, సమాచార కేంద్రం, వెయిటింగ్ హాల్, శౌచాలయాల నిర్మాణాల పనులు చేస్తున్నారు. వీటిని వీలైనంత త్వరగా పూర్తిచేసి పర్యాటకులను ఎక్కువ సంఖ్యలో రప్పించాలని పలువురు కోరుతున్నారు. ఇవన్నీ భక్తులకు అందుబాటులోకి వస్తే పుణ్యక్షేత్రానికి పర్యాటక శోభ పెరిగే అవకాశాలు ఉన్నాయని భావిస్తున్నారు. మార్చి నాటికి పూర్తిచేస్తాం.. : ప్రసాద్, ఏఈమార్చి ఆఖరుకు పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకుని వస్తాం. ఇందుకోసం నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం. ఇవి ఉపయోగంలోకి వస్తే పర్యాటకులకు సౌకర్యాలు పెరుగుతాయి.

# ఎడతెగని పంచాయతీ..!



ఖమ్మం:చింతకాని మండలం నామవరంలో సుమారు ఎనిమిదేళ్ల క్రితం రూ.10లక్షలతో పంచాయతీ భవన నిర్మాణం చేపట్టారు. ఇప్పటికీ పూర్తవలేదు. నిధుల కొరతే కారణం.

కామేపల్లి మండలం రుక్కితండాలో రూ.20లక్షలతో పంచాయతీ భవన నిర్మాణ పనులను ప్రారంభించారు. రెండేళ్లు దాటుతున్నా పునాదుల దశలోనే పనులు ఉన్నాయి. నిధుల కొరత, అధికారుల పర్యవేక్షణ కొరవడటమే ప్రధాన కారణాలు అని తెలుస్తోంది. ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని ఓ భవనంలో గ్రామపంచాయతీ కార్యకలాపాలు కొనసాగుతున్నాయి. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అనేక గ్రామాల్లో పంచాయతీ భవనాలకు ఏళ్ల క్రితమే శంకుస్థాపన జరిగినా.. ఇప్పటికీ అసంపూర్తిగానే దర్శనమిస్తున్నాయి. నిధుల కొరత ఏర్పడిన చోట మరికొంత డబ్బులు కేటాయించి పనులు పూర్తిచేయాలని ప్రభుత్వం సంకల్పించినా అడ్డంకులు ఎదురవుతున్నాయి. కొన్ని భవనాలు పునాదుల దశ దాటకుండా ఆగిపోతే.. ఇంకొన్ని పిల్లర్ల దశలో కనిపిస్తున్నాయి. కొన్నిచోట్ల స్థల వివాదాలతో పనులు మొదలుకాలేదు. మరికొన్నిచోట్ల పనులు పూర్తయినా భవనాలను వినియోగంలోకి తీసుకురావటం లేదు.

**నిధులు పెంచినా..**

మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద కొన్ని, పంచాయతీరాజ్‌శాఖ ఆధ్వర్యంలో మరికొన్ని, ఐటీడీఏ నిధులతో ఇంకొన్ని భవనాల నిర్మాణ పనులు చేపట్టారు. వీటి నిర్మాణం కోసం తొలుత రూ.13 లక్షలు, అనంతరం మరో రూ.3 లక్షలు కేటాయించారు. ఈ నిధులూ సరిపోకపోవటం వల్ల మేజర్ గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాల వ్యయాన్ని రూ.20లక్షలకు పెంచారు. పనులను అప్పట్లో సర్పంచులు, గుత్తేదారులు చేపట్టారు. సర్పంచుల పదవీకాలం ముగియటంతో పనులను ఆపేశారు. ప్రత్యేక అధికారులు పట్టించుకోవటం లేదు.

**ఒక్కోచోట ఒక్కో పరిస్థితి**

గ్రామాల్లో పంచాయతీలకు భవనాలు లేనిచోట కార్మికులు, గ్రామ అధికారులకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. అక్కడక్కడ పాత భవనాలు శిథిలావస్థకు చేరటంతో దస్త్రాలను భద్రపరిచే పరిస్థితి లేకుండా పోయింది. సమావేశాలు, గ్రామసభల నిర్వహణ సక్రమంగా సాగటం లేదు. నూతన గ్రామపంచాయతీల్లో పరిస్థితి మరింత దయనీయంగా మారింది. పంచాయతీ కార్యాలయాలు లేకపోవటంతో స్థానికంగా ప్రభుత్వ భవనాలను వినియోగిస్తున్నారు. వసతులు లేనిచోట చెట్ల కిందే కార్యకలాపాలు సాగించాల్సిన దుస్థితి నెలకొంది. పంచాయతీ భవన నిర్మాణ పనులను డీఆర్డీఓ, పంచాయతీరాజ్ శాఖల సహకారంతో పూర్తి చేస్తామని ఖమ్మం డీపీఓ ఆశాలత తెలిపారు.

## కొనసాగుతున్న సందిగ్ధం

ఖమ్మం : ఖమ్మం జిల్లాలో గ్రామ పంచాయతీల సంఖ్య 577కి తగ్గింది. మరో రెండు పంచాయతీలపై సందిగ్ధం నెలకొంది. ఖమ్మం రూరల్ మండలంలో 12 గ్రామపంచాయతీలను ఏదులాపురం పురపాలక సంఘంగా ఏర్పాటు చేశారు. 12 పంచాయతీల్లో 10 పూర్తిగా, రెండు పాక్షికంగా తీసుకున్నారు. గ్రామ పంచాయతీ అధికారుల లెక్కల ప్రకారం 12 గ్రామ పంచాయతీలు, అందులోని 132 వార్డులు మున్సిపాలిటీగా ఏర్పడ్డాయి. జిల్లాలో మొత్తం 589 గ్రామ పంచాయతీలు ఉండగా.. 12 తొలగిస్తే ప్రస్తుతం 577 పంచాయతీలున్నాయి. 589 పంచాయతీల్లో 5,398 వార్డులు ఉండగా.. ప్రస్తుతం 577 పంచాయతీల్లో 5,266 వార్డులున్నాయి. మున్సిపాలిటీలో పాక్షికంగా కలిసిన రెండు పంచాయతీలు, వాటిలో మిగిలిన 22 వార్డులను పంచాయతీరాజ్‌శాఖ ఉన్నతాధికారులు ప్రత్యేకంగా నోటిఫై చేయాల్సి ఉంటుంది. పాక్షికంగా మిగిలిన రెండు పంచాయతీలు, 22 వార్డులు నోటిఫై అయిన తర్వాతే తమ లెక్కలోకి వస్తాయని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. దీనిపై స్పష్టత రావాల్సి ఉందని, అప్పటి వరకు 577 పంచాయతీలు, 5,266 వార్డులుగానే పరిగణిస్తామని తెలిపారు.

# పిల్లలు తినే జెల్లీ.. ప్రమాదకరమే!

హైదరాబాద్ : ఆహార పదార్థాల తయారీ సంస్థలు నిర్లక్ష్యంగా వహిస్తే.. మార్కెట్లోకి వచ్చే ఉత్పత్తులు హానికరంగా మారతాయి. పలు సంస్థలు తయారుచేసిన కొన్ని నమూనాలను ఇటీవల జీహెచ్‌ఎంసీ పరీక్షించగా.. విస్తుపోయే నిజాలు వెలుగులోకొచ్చాయి. పిల్లలు తినే మామిడిపండు జెల్లీలో పది రెట్లు అధికంగా సల్ఫైట్ ఉంది. ఏం కలిపారో తెలియని వంట నూనె మార్కెట్లో చలామణి అవుతోంది. రంగులతో తయారయ్యే టీ పొడి, బెల్లం, బిర్యానీ, ఇతర మాంసాహారాలు, మిఠాయిలు, ఇతరత్రా ఆహార పదార్థాల్లోనూ మోతాకు మించి రసాయనాలు, రంగులు ఉన్నట్టు తేలింది.

**మ్యాంగో జెల్లీలో..**

దీపు మ్యాంగో జెల్లీ పేరుతో ఉన్న ప్యాకెట్‌లోని పదార్థాన్ని నాచారంలోని రాష్ట్ర ఆహార నమూనాల పరీక్ష కేంద్రానికి పంపగా.. అందులో 100 పీపీఎంగా ఉండాల్సిన సల్ఫైట్ 1,146 పీపీఎం ఉన్నట్టు తేలింది. అలాంటి జెల్లీని తింటే ఎలాంటి ప్రభావం ఉంటుందని ఎన్ఐఎన్ సీనియర్ శాస్త్రవేత్త డాక్టర్ లక్ష్మణ్‌ను అడగ్గా.. పిల్లలు, పెద్దల్లో వాంతులు, విరేచనాలు, చర్మంపై దద్దుర్లు వచ్చే అవకాశముందని తెలిపారు. అలాగే తింటూ ఉంటే.. కొంత కాలానికి నరాల సమస్య, క్యాన్సర్ వచ్చే ప్రమాదముందన్నారు. "సాధారణంగా సల్ఫర్‌ను, కొన్ని రకాల ఆహార రంగులను వంటల్లో ఉపయోగించవచ్చు. వాటి శాతం మోతాదులోపే ఉండాలి. మార్కెట్‌కు తయారైన వస్తువులను పంపించే ముందు పరీక్షలు



జరపాలన్న నిబంధన అమలు చేస్తే.. నాసిరకం, అనారోగ్యకర పదార్థాలను బయటకు వెళ్లకుండా అడ్డుకోవచ్చు" అని డాక్టర్ లక్ష్మణ్ వివరించారు.

**ఇతర అనారోగ్యకర పదార్థాలు..**

ప్రీమియం క్వాలిటీ ఒరిజినల్ కిమియా డేట్స్ ప్యాకెట్‌లోని కర్జూరాను పరిశీలించగా.. అందులో ఏ ఒక్కటీ తినేందుకు పనికిరాని స్థితిలో ఉన్నట్టు తేలింది. పైపొర కింద బూజు ఉన్నట్టు నిపుణులు తేల్చారు. బెల్లంలో సల్ఫైట్, టెట్రాజైన్‌తో పాటు సన్‌సెట్ ఎల్లో రంగులు కలిపినట్లు తేలింది. శ్రీసూర్య కాష్యూ పేరుగల ప్యాకెట్‌లోని జీడిపప్పులో పురుగులు, ఫ్రీ ఫ్యాటీ యాసిడ్స్.. నేషనల్ జింజర్ అండ్ గార్లిక్ పేస్టులో తక్కువ ఆమ్లం(ఇతర పదార్థాలతో కల్తీ జరిగిప్పుడు అలా జరుగుతుంది)హెల్త్‌కేర్ రిఫైన్డ్ వంట నూనె డబ్బాపై ఉన్న సమాచారానికి తగ్గట్టు.. అందులోని ప్రమాణాలు సరిపోలకపోవడం, తప్పుడు సమాచారంతో ప్యాకింగ్ చేసి మార్కెట్లో విక్రయిస్తున్నట్లు నాచారం ప్రయోగశాలలో గుర్తించారు. పైవన్నీ తినేందుకు పనికిరావని తేల్చారు.

**శిక్షలు, జరిమానాలు..**

పరీక్షల్లో అనారోగ్యకర పదార్థాలుగా తేలితే.. తయారు చేసిన వారిపై ఆహార భద్రత చట్టం ప్రకారం మొదటి మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో క్రిమినల్ కేసు నమోదు చేస్తామని, పదార్థాల నాణ్యతలో లోపాలను బట్టి జైలు శిక్ష, జరిమానాలు ఉంటాయని జీహెచ్‌ఎంసీ ఆరోగ్య విభాగం చెబుతోంది. గత కొన్ని రోజులుగా నమూనాల సేకరణను పెంచామని అధికారులు చెబుతున్నారు.

# పుడమి పులకరించేలా పండగ

హైదరాబాద్: ఆధునిక ప్రపంచం.. కాంక్రీటు పట్టణం.. పుడమి ప్రాధాన్యం తెలియని చిన్నారులు.. మానవ తప్పిదాలతో భూమికి వాటిల్లే ముప్పు.. వీటన్నింటిపైనా అవగాహన కల్పించడానికి రాజధానిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజీ ఆఫ్ ఇండియా (ఈఎస్‌సీఐ) వేదికైంది. ఎక్కడ చూసినా ప్రకృతికి సంబంధించిన సహజ సిద్ధ ఉత్పత్తులే. మన భూమి ప్రత్యేకత.. అందులో నుంచి వచ్చే ప్రకృతిసిద్ధమైన వస్తువులు, ఇతర ఉత్పత్తుల గురించి పిల్లలతో పాటు పెద్దవాళ్లు కూడా తెలుసుకున్నారు. ప్రముఖ తత్వవేత్త జిడ్డు కృష్ణమూర్తి సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన నైమిసం ఎర్త్ ఫెస్టివల్ రెండో ఎడిషన్ ఆదివారం గచ్చిబౌలిలో జరిగింది. ఈ కార్యక్రమానికి సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నారాయణపేట ఎమ్మెల్యే పర్ణికారెడ్డి, పద్మభూషణ్ పురస్కార గ్రహీత, ప్రముఖ కూచిపూడి కళాకారిణి స్వప్నసుందరి, ఈఎస్‌సీఐ డైరెక్టర్ జి.రామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ.. 'ప్రకృతి రక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలి. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుంటేనే మనుగడ ఉంటుంది. పుడమిని కూడా



సొంతిల్లుగా భావించాలి. ఇలాంటి కార్యక్రమాల వల్ల ప్రస్తుత తరానికి మంచి సందేశం ఇస్తున్నారు" అని పేర్కొన్నారు. పత్తి నుంచి వస్త్రం ఎలా తయారవుతుందని నేతన్నలు ప్రత్యక్షంగా చూపించారు. పత్తి నుంచి నూలు, ఆ తర్వాత వస్త్రం.. అన్ని రకాల దశలను సందర్శకులు ఆసక్తిగా తిలకించారు. నేటి తరానికి రెడీమేడ్ డ్రెస్సులపై అవగాహన ఉంది. సంప్రదాయ ఖాదీ వస్త్రాల గురించి పెద్దగా తెలియదు. ఖాదీ ప్రత్యేకత, మన్నిక తెలియజేయాలనే ఈ స్టాల్‌ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.

**మట్టి, నీరు, విత్తనాలు..** మొక్కలు నాటడం ఓ అలవాటుగా చేసుకోవాలని చిన్నారులకు ఈ ఫెస్టివల్‌లో అవగాహన కల్పించారు. 'పాట్ ప్లాంట్' పేరుతో ఏర్పాటు చేసిన స్టాల్‌లో స్వయంగా పిల్లలతోనే చిన్న కుండీల్లో మొక్కలు నాటించారు. అందులో వాడే మట్టి, నీరు, విత్తనాలు, మొక్కలు ఎలా పెరుగుతాయనే అంశాలపై అవగాహన కల్పించారు. సీడ్ బాల్ తయారీ, ఆకులతో బుట్టల తయారీపై శిక్షణ ఇచ్చారు.

# సర్కారు భూములు మావంటే చెల్లదిక..

హైదరాబాద్: తప్పుడు పత్రాలతో ప్రభుత్వ భూములను ఆక్రమిస్తున్న అక్రమార్కుల మాయాజాలాన్ని అడ్డుకునేందుకు రంగారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారులు కొత్త విధానాన్ని ప్రవేశపెట్టారు. పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం(అర్బన్ ల్యాండ్ సీలింగ్) పరిధిలోని ప్రభుత్వ భూముల వివరాలు, వాటిపై ఉన్న వివాదాలను తెలుసుకుని జిల్లా ట్రైబ్యునల్ కోర్టు.. హైకోర్టుల్లో ఎప్పటికప్పుడు సరైన వాదనలను వినిపించేందుకు 'ఈ-కోర్టు-యూఎల్‌సీ ఆర్‌ఆర్' పోర్టల్‌ను ప్రారంభించారు. శేరిలింగంపల్లి, గచ్చిబౌలి, రాజేంద్రనగర్, ఎల్బీనగర్, శంషాబాద్ వంటి ప్రాంతాల్లో పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టంలో భాగంగా వందల ఎకరాలు ప్రభుత్వ ఆధీనంలో ఉన్నాయి. వాటిపై కన్నేసిన ప్రైవేటు వ్యక్తులు తప్పుడు పత్రాలు సృష్టించి కోర్టులనుఆశ్రయిస్తున్నారు. వారు సమర్పించిన పత్రాలు నకిలీవని నిర్ధారించేందుకు ఈ-కోర్టు



పోర్టల్ న్యాయస్థానాలకు సరైన ఆధారాలు, పత్రాలను సమర్పించనుంది.

**అన్ని వివరాలూ ఆన్‌లైన్‌లో...**

పట్టణ భూ గరిష్ఠ పరిమితి చట్టం ప్రకారం ప్రభుత్వానికి దఖలుపడిన భూముల వివరాలన్నింటినీ కంప్యూటరీకరించారు. ఆయా సర్వేనంబర్లలో భూములు ప్రభుత్వం ఆధీనంలో ఉన్నాయా? ఎవరైనా కోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేశారా? ప్రభుత్వం వైపు నుంచి ఎవరు వాదనలు వినిపించారు? తదుపరి వాయిదాలు ఎప్పుడున్నాయి? అన్న వివరాలన్నీ ఒక్క క్లిక్‌తో తెలిసిపోతాయి. ఈ పోర్టల్‌ను తహసీల్దార్, ఆర్డీవో, అదనపు కలెక్టర్, జిల్లా కలెక్టర్‌లు ఏకకాలంలో చూసేందుకు అవకాశముంది. ఇక ఈ పోర్టల్‌ను అధికారులు తెరవగానే.. తదుపరి విచారణలు ఫలానా రోజున ఉన్నాయంటూ సంక్షిప్త సందేశాలు వారిని అప్రమత్తం చేయనున్నాయి.

**ప్రభుత్వ భూములను రక్షించేందుకే -సి.నారాయణరెడ్డి, కలెక్టర్, రంగారెడ్డి**

పట్టణ భూగరిష్ఠ పరిమితి చట్టం కింద వ్యక్తులు, సంస్థల నుంచి తీసుకున్న భూములను రక్షించేందుకు ఈ-కోర్టు పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువచ్చాం. కోర్టుల్లో ఫిర్యాదులు, విచారణల సందర్భంగా రికార్డులను సరిచూసుకునే వాళ్లం. కొత్త విధానంలో భూముల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో ఉంటాయి. ప్రస్తుతం 530 ఎకరాల భూములపై కోర్టుల్లో వివాదాలు కొనసాగుతున్నాయి. ఈ భూములన్నీ ప్రభుత్వానివేనని రుజువుచేసే ఆధారాలన్నీ మావద్ద ఉన్నాయి.

# అపరాలు.. ఆరోగ్యానికి వరాలు

పెద్దపల్లి : 'అప్పు చేసి పప్పు కూడు..' అన్నది పాత నానుడి.. అప్పు చేసి అయినా పప్పులు తినాలనేది నేటి మాట.. ఆరోగ్యానికి ఎంతో మేలు చేసే పప్పులు రోజువారీ భోజనంలో భాగం కావాలని నిపుణులు సూచిస్తున్నారు.. పప్పులో అధికంగా ప్రొటీన్లు, పొటాషియం, ఐరన్ వంటి పోషకాలు ఉండటంతో ఆరోగ్యపరంగా ఎక్కువ లాభాలున్నాయి. కొందరు గ్యాస్ట్రిక్ సమస్య కారణంగా తినేందుకు వెనకాడుతుంటారు. ఇవి హానికరమైన కొవ్వు పదార్థాలను కరిగించి గుండెను కాపాడుతుంటాయి.

**ఉచితంగా విత్తనాలు**

అపరాల సాగును ప్రోత్సహించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులకు రాయితీలు అందిస్తున్నాయి. కేంద్ర ప్రభుత్వం సామూహిక ప్రథమ శ్రేణి ప్రదర్శన క్షేత్రాల పథకంలో పెసరు, శనగలు, మినుములు, కందుల విత్తనాలను రైతులకు ఉచితంగా పంపిణీ చేస్తుంది. అధిక దిగుబడులు సాధించే వంగడాలను సరఫరా చేయడంతో విస్తీర్ణం పెరగడానికి దోహదపడుతుంది. కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు పంట క్షేత్ర స్థాయిలను సందర్శించి సస్యరక్షణ వివరిస్తున్నారు. కేంద్ర బడ్జెట్‌లో పప్పు ధాన్యాల స్వయం సమృద్ధికి నిధులు కేటాయించారు.

పెరగనున్న నేల సారం

పప్పు దినుసుల సాగులో ఎరువుల వాడకం తక్కువగా ఉంటుంది.

మొక్క వేరులో రైజోబియం అనే బ్యాక్టీరియా గాలిలో ఉన్న నత్రజనిని తీసుకుంటుంది.

భూమిలో నైట్రేట్ శాతం ఎక్కువగా లభించడంతో యూరియా వినియోగం తగ్గనుంది.

పంట కోత తర్వాత కలియ దున్నడంతో సేంద్రియ ఎరువుగా మారుతుంది.

పెట్టుబడి తక్కువే అయినా అనాసక్తి

ఉమ్మడి జిల్లాలో పప్పు ధాన్యాల విస్తీర్ణం ఏటా తగ్గుతోంది. ప్రజల వినియోగానికి అనుగుణంగా పండించకపోవడంతో ధరలు పెరుగుతున్నాయి. తక్కువ పెట్టుబడి ఉన్నప్పటికీ రైతులు ఆసక్తి చూపడం లేదు. ఉమ్మడి జిల్లాలో జలాశయాలు, ఎస్సారెస్పీ కాలువలు, బోర్లు, బావుల కింద సుమారు 13 లక్షల ఎకరాల్లో పలు రకాల పంటలు సాగవుతుండగా.. ఇందులో ఎక్కువగా వరినే పండిస్తున్నారు. కేవలం 8,486 ఎకరాల్లో పప్పు దినుసులు సాగు చేయడం ఆందోళన కలిగిస్తోంది. ఆరోగ్య ప్రయోజనాలు

సమతుల్య ఫైబర్‌తో అదుపులో మధుమేహం

గర్భిణులకు అధిక పోషక విలువలు, ఐరన్

ఎముకలు, కండరాల సంరక్షణకు తోడ్పాటు

క్యాన్సర్ బారిన పడకుండా కందులు, పెసర్ల ఆహారం

ఉలవల దినుసుల్లో పుష్కలంగా ఇనుము, కాల్షియం

చిక్కుడు జాతి గింజల్లో దండిగా పీచు, ప్రొటీన్లు

ప్రతి 100 గ్రాములకు ప్రొటీన్ ఇలా..

శనగ - 22, మినుములు- 25

పెసర - 24 , కందులు, బఠాణి - 8.3

అలసంద- 9, చిక్కుడు- 9

పప్పు దినుసుల సాగు విస్తీర్ణం(ఎకరాల్లో)

కరీంనగర్: 1,707, పెద్దపల్లి: 1,242

జగిత్యాల: 3,431 , రాజన్న సిరిసిల్ల: 2,106

సమృద్ధిగా ఫైబర్

మనం తినే ఆహారంతోనే ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. మానవ శరీరానికి కావాల్సిన పోషకాలు పప్పు దినుసుల్లో లభిస్తాయి. ఫైబర్ సమృద్ధిగా ఉండటంతో గ్లైసిమిక్ ఇండెక్స్ తగ్గి చక్కెర శాతం లేకపోవడంతో మధుమేహం ప్రభావం ఉండదు. డా.రాజశేఖర్ రెడ్డి, ఫిజీషియన్, మంథని ప్రభుత్వ ఆసుపత్రి

సాగుకు ప్రోత్సాహకాలు

రైతులు అధిక దిగుబడులు సాధించేందుకు మేలైన కొత్త వంగడాలు పంపిణీ చేస్తున్నాం. ఆయిల్‌పామ్, పండ్ల తోటల్లో అంతర పంటగా పప్పు ధాన్యాల పంటలు సాగు చేసుకోవచ్చు. రసాయన ఎరువుల వినియోగం తక్కువగా ఉంటుంది. తక్కువ పెట్టుబడితో లాభసాటి ఆదాయం సమకూరుతుంది. రసాయన ఎరువులు అధికంగా వినియోగించిన పప్పు దినుసులు తింటే చిన్న పిల్లలు చూపు కోల్పోయే ప్రమాదముంది.

కిరణ్, శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం, రామగిరి

గిట్టుబాటు ధరతో లాభదాయకం

నాకున్న ఎకరంలో అయిదేళ్లుగా కందులు సాగు చేస్తున్నా. వరి, పత్తి పంటల కంటే పెట్టుబడులు, కూలీల ఖర్చు తక్కువే. నీటి తడులు అందిస్తున్నా. శ్రమకు తగిన ప్రతిఫలం దక్కుతుంది. అయిదు క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది. గిట్టుబాటు ధర చెల్లిస్తే లాభదాయకంగా ఉంటుంది. పొన్నం సందీప్, చొప్పదండి

# కిట్లు లేవు.. నోట్లు రావు!



మెదక్: సర్కారు ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచేందుకు గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న నిర్ణయాలు అమలుకావడం లేదు. గర్భిణులు పేరు నమోదు చేసుకున్న నాటి నుంచి ప్రసవం జరిగే వరకు విడతల వారీగా సాయం అందించేది. వాటితో పాటు చిన్నారి చర్మ సంరక్షణకు అవసరమయ్యే కిట్టు ఇచ్చేవారు. గత కొన్నేళ్లుగా ఇవి అందడం లేదు. సాయం అందకున్నా... గర్భిణులు మాత్రం ప్రభుత్వ వైద్య సేవలు పొందుతున్నారు. జిల్లాలో మెదక్‌లోని మాతా, శిశు సంరక్షణ కేంద్రం, నర్సాపూర్ ప్రాంతీయ ఆసుపత్రి, తూప్రాన్ సామాజిక ఆసుపత్రితో పాటు... ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాలు జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో ఆడపిల్ల జన్మిస్తే రూ. 13 వేలు, మగ పిల్లాడికి రూ.12 వేలతో పాటు, 13 రకాల వస్తువుల కిట్‌ను అందజేశారు. దీంతో సర్కారు ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెరిగింది. ప్రైవేట్‌లో వేల రూపాయలు ఖర్చు చేయాల్సి రావడంతో గర్భిణులు ప్రభుత్వ ఆసుపత్రుల వైపు మొగ్గు చూపుతున్నారు.

**మూడేళ్లుగా అందక..**

బాలింతలకు అందజేసే సాయం 2022 నుంచి జమకావడం లేదు. ఈ లెక్కన గతేడాది డిసెంబర్ వరకు సుమారు 20 వేల మందికి పైగా సాయం అందకపోవడం గమనార్హం. మరోవైపు కాన్పు జరిగాక అందజేసే 13 రకాల వస్తువుల కిట్‌ను సైతం పంపిణీ చేయడం లేదు. ఆసుపత్రుల్లో స్టాక్ ఉన్నంత వరకే పంపిణీ చేయగా, గత కొన్ని నెలలుగా ఇవ్వడం లేదు. దీంతో బాలింతల కుటుంబ సభ్యులు బయట సామగ్రి కొనుగోలు చేస్తున్నారు. ఇది వారిపై ఆర్థికభారం పడుతోంది.

అందిస్తున్నాంశ్రీరాం, జిల్లా వైద్యాధికారి

ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవం జరిగే బాలింతలకు గత మూడేళ్లుగా సాయం అందడం లేదు. కాన్పు జరిగిన వారికి కిట్లను అందిస్తున్నాం.

కిట్టు, సాయం లేదుమొదటి కాన్పులో పాప జన్మించగా కిట్టు మాత్రమే ఇచ్చారు. ఆర్థిక సాయం ఇవ్వలేదు. ప్రస్తుతం రెండో కాన్పులో పాప పుట్టగా.. కిట్టు, ప్రోత్సాహకం అందలేదు.

రేణుక, తాళ్లపల్లి తండా, శివ్వంపేట

ఒక విడత డబ్బు రాలేదు

2022 జూన్‌లో ప్రసవం జరగగా కిట్టు మాత్రమే ఇచ్చారు. కానీ ఒక్క విడత సాయం రాలేదు. ఈ విషయమై పలుమార్లు వైద్య సిబ్బందిని కలిసి ఆరా తీసినా రావడం లేవు.

గుమ్ముల పావని, చెన్నాపూర్, శివ్వంపేట

# సగంలో ఆగిన సమీకృతం



మెదక్ : మున్సిపాల్టీల పదవీకాలం ముగిసినప్పటికీ సమీకృత మార్కెట్ల నిర్మాణం మాత్రం పూర్తికాలేదు. ప్రతి పురపాలికలో సమీకృత శాఖాహార, మాంసాహార మార్కెట్లను ఏర్పాటు చేయాలని గత ప్రభుత్వ హయాంలో నాలుగు మున్సిపాల్టీల్లో పనులు ప్రారంభించారు. వీటికి పూర్తిస్థాయిలో నిధులు విడుదల చేయక మధ్యలోనే ఆగిపోయాయి. మెదక్, నర్సాపూర్, రామాయంపేటల్లో ఎప్పటికి పూర్తవుతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఏడాదిలోపు పూర్తిచేయాలని అప్పట్లో నిర్ణయించినా.. అధికారుల పర్యవేక్షణ లోపం, గుత్తేదారులకు బిల్లులు అందక పనుల్లో తీవ్ర జాప్యం జరిగింది. తూప్రాన్‌లో నిర్మాణం పూర్తయినా వినియోగించడం లేదు.

**పిల్లర్ల స్థాయిలో..**

మెదక్‌లోని నీటి పారుదలశాఖ భవనాల సముదాయంలోని రెండెకరాల్లో ఎస్ఎఫ్‌సీ నిధులు రూ. 11.50కోట్లతో పనులు ప్రారంభించారు. ఏడాదిన్నర కావస్తున్నా అసంపూర్తిగానే ఉండటంతో వ్యాపారులు, ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. పిల్లర్ల స్థాయిలో నిలిచిన పనులు పూర్తిచేయాలని స్థానికులు కోరుతున్నారు. ఈ విషయాన్ని డీఈ మహేష్ వద్ద ప్రస్తావించగా.. నిధులు మంజూరు కాకపోవడంతో గుత్తేదారు పనులను నిలిపివేశారన్నారు.

**భవనం.. అలంకారప్రాయం**

తూప్రాన్ పట్టణంలో రూ. 10కోట్ల నిధులతో చేపట్టిన సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తయినా ప్రజలకు అందుబాటులోకి రావడం లేదు. 85స్టాళ్లలో నాలుగు మాత్రమే వినియోగంలోకి తెచ్చారు. మూడు సార్లు టెండర్లు పిలిచినా ఎవరూ ముందుకు రావడం లేదు. దీంతో భవనం వినియోగంలో లేక కళావిహీనంగా మారింది. ఈవిషయాన్ని మార్కెటింగ్ కార్యదర్శి వద్ద ప్రస్తావించగా కొత్తదాంట్లో వ్యాపారాలు సాగడం లేదని కొందరు పాత మార్కెట్ స్థలంలోనే ఏర్పాటు చేస్తున్నారు. 12దుకాణాలు టెండర్లు పెట్టినా ఎవరూ ముందుకు రావడం లేదన్నారు.

**రెండేళ్లుగా సాగని పనులు**

రామాయంపేట పట్టణంలో రూ. 2కోట్లతో రెండేళ్ల క్రితం సమీకృత నిర్మాణం ప్రారంభించారు. కొంత పిల్లర్లు, మరికొంత పునాదుల స్థాయిలో పనులు నిలిచిపోయాయి. 50 గదులు పనులు చేసిన మేరకు బిల్లులు రాకపోడంతో గుత్తేదారు పనులను మధ్యలోనే ఆపేశారు. ప్రస్తుతం సమీకృత మార్కెట్ నిర్మాణం పూర్తికాకపోగా.. పురపాలిక నూతన భవన నిర్మాణంకు ప్రతిపాదించిన స్థలంలో కూరగాయల మార్కెట్ నిర్వహిస్తున్నారు.

**మధ్యలో నిలిచిన నిర్మాణం...** నర్సాపూర్‌లో సమీకృత మార్కెట్ పనులు ఏడాదిన్నరగా అసంపూర్తిగా దర్శనం ఇస్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు పనులు నిలిచిపోయాయి. పాత తహసీల్దార్ కార్యాలయం స్థలంలో నిర్మాణం చేపట్టారు. గ్రౌండ్‌ఫ్లోర్, మొదటి అంతస్తులో పనులు నిలిచిపోయాయి. 3784 చదరపు అడుగుల విస్తీర్ణంలో దీనిని నిర్మిస్తున్నారు. బిల్లులు విడుదల కాక.. గుత్తేదారు పనులు చేపట్టడం లేదని కమిషనర్ రామకృష్ణారావు వివరణ ఇచ్చారు.

# తూకాల్లో మోసాలా.. ఇలా ఫిర్యాదు చేయండి




హైదరాబాద్ : ఓ యువకుడు నగరంలోని దుకాణంలో తినుబండారాలు కొన్నారు. దానిపై ఎమ్మార్పీ, ఎక్కడ తయారుచేశారు లాంటి వివరాలేవీ లేవు. దుకాణ యజమానిని నిలదీస్తే 'ఇష్టముంటే కొను, లేకుంటే లేదు' అని దురుసుగా సమాధానమిచ్చారు. కిరాణా దుకాణంలో ఓ మహిళ 4 కిలోల చక్కెర కొనుగోలు చేశారు. ఇంటికి వెళ్లి చూస్తే అనుమానం రావడంతో మరోచోట తూకం వేయిస్తే 400గ్రాములు తేడా చూపించింది. దీనిపై దుకాణ యజమానిని ఆరాతీస్తే 'మీ ముందే తూకం వేశాను. ఇంటికెళ్లాక మీరే మార్చారు' అంటూ నిర్లక్ష్యపు సమాధానమిచ్చాడు. ఇలా బహిరంగ మార్కెట్లలో ఏదైనా వస్తువు కొన్నప్పుడు వినయోగదారులు ఏదో ఒక రకంగా నష్టపోతూనే ఉంటారు. ఎవరికి, ఎలా చెప్పాలో అవగాహన లేక కిమ్మనుండిపోతారు. ప్రజల అవసరాలను ఆసరాగా చేసుకుని పలు సంస్థలు, వ్యక్తులు రకరకాల తినుబండారాలు, వస్తువులను నిబంధనలకు విరుద్ధంగా విక్రయిస్తున్నారు. తయారీ తేదీ, ప్రాంతం, సంస్థ పేరు, వస్తువు పరిమాణం, అమ్మకం ధర, చిరునామా, కస్టమర్‌కేర్ నంబరు తదితర వివరాలు లేకుండానే అమ్ముతున్నారు. గడువు తేదీ లేకపోవడంతో అందులో వస్తువులు మంచివేనా లేదా అన్నదీ తెలియదు. అవి పాడై ఉండి వాటిని తింటే ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదముంది.

**నేరుగా ఇలా చేయవచ్చు**

వినియోగదారుల్ని మోసం చేసినట్టు కనిపించినా, అనుమానం వచ్చినా %clm-ts@nic.in% ద్వారా ఫిర్యాదుచేయవచ్చు. ఫిర్యాది వివరాలు అధికారులు గోప్యంగా ఉంచుతారు. నేరుగా తూనికలు, కొలతల అధికారులకు కూడా ఫిర్యాదు చేయవచ్చు. తూకాల్లో మోసంపై ఆర్టీసీ క్రాస్ రోడ్స్ సమీపంలో గాంధీనగర్‌లోని లీగల్ మెట్రాలజీ ప్రధాన కార్యాలయంలో సమాచారం ఇవ్వవచ్చు. ఆ వివరాల ఆధారంగా దుకాణంలో తనిఖీలు చేసి యజమానిపై చర్యలు తీసుకుంటారు.

# ఆరు నెలల్లో మాదారం ఎంఎస్ఎంఈ పార్కు

హైదరాబాద్ : ఘట్‌కేసర్ మాదారంలోని ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల) పార్కులో ప్లాట్ల కేటాయింపులు 6 నెలల్లో పూర్తి చేయనున్నట్టు టీఎస్ఐఐసీ అధికారులు స్పష్టం చేశారు. తొలిదశలో 120 ఎకరాల్లో ఉన్న లేఅవుట్ ప్లాట్ల విక్రయానికి సంబంధించి ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతోందని వెల్లడించారు. రెండో దశలో 80 ఎకరాలకు సంబంధించి లేఅవుట్ రూపొందించనున్నట్లు తెలిపారు. ఎంఎస్ఎంఈ పార్క్ సిద్ధమైతే ప్రత్యక్షంగా 20 వేల మందికి, పరోక్షంగా 30 వేల మందికి ఉపాధి లభించనుందని, రూ.2 వేల కోట్ల వరకు పెట్టుబడులు రావొచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

**నేపథ్యం ఇదీ..**

కాప్రా, చర్లపల్లి, బాలానగర్, జీడిమెట్ల ప్రాంతాల్లో ఉన్న ఎంఎస్ఎంఈ పరిశ్రమల్లో ఎక్కువగా ఏరోనాటికల్, రక్షణ రంగాలవే. ఈ నేపథ్యంలో మాదారం పరిధిలోని సుమారు 200 ఎకరాల్లో ఎంఎస్ఎంఈ పార్కు ఏర్పాటు చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. అనంతరం భూసేకరణ చేపట్టగా.. జిల్లా కలెక్టర్ భూములను టీఎస్ఐఐసీకి బదలాయించారు.



120 ఎకరాల స్థలం లేఅవుట్‌కి అనుమతి లభించడంతో అధికారులు 56 ప్లాట్లకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానించారు. వీటి కేటాయింపులు పూర్తయిన తర్వాత మరో 80 ఎకరాల లేఅవుట్‌కు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధంచేయనున్నారు.

**కేటాయింపులు కొలిక్కొ వచ్చేనా...**

చదరపు మీటర్‌కు రూ. 6,178 చొప్పున 56 ప్లాట్లకు ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానించడంతో అనేక మంది సూక్ష్మ, మధ్యతరహా పరిశ్రమల నిర్వాహకులు ఆసక్తి చూపారు. ఎక్కువ సంఖ్యలో దరఖాస్తులొచ్చాయి. పారిశ్రామిక అవసరాల కోసం మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత టీఎస్ఐఐసీదే. విద్యుత్ సరఫరా, రహదారులు, డ్రైనేజీ తదితరాల ఏర్పాటు చేయాలి. ప్లాట్లు ఎత్తుపల్లాలుగా ఉండటంతో నిర్వాహకులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు. భూమి చదునుచేసే బాధ్యత ఎవరిదన్న అంశం కొలిక్కిరాలేదని, ఎవరికి, ఎక్కడ కేటాయిస్తారనేదీ తేల్చలేదని వాపోతున్నారు. దీంతో ఆరు నెలల్లో కేటాయింపుల ప్రక్రియ పూర్తి చేయడం, మౌలిక సదుపాయాలు కల్పించడం అధికారులకు సవాల్‌గా మారింది.

# కోహెడలో హైడ్రా కూల్చివేతలు

హైదరాబాద్ : ఆక్రమణలపై హైడ్రా దూకుడు పెంచింది. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో హైడ్రా ఆదివారం కూల్చివేతలు చేపట్టింది. సర్వే నంబర్ 951, 952లో పంచాయతీ లేఅవుట్లో తమ ప్లాట్లను సమ్మిరెడ్డి బాల్‌రెడ్డి ఆక్రమించినట్టు, రహదారులు లేకుండా అడ్డుగోడలు కట్టారని రాధే ధామం లేఅవుట్ ప్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు.. ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో హైడ్రా చర్యలు తీసుకుంది. భూమికి సంబంధించిన ధ్రువపత్రాలను పరిశీలించగా.. 1986లో భూయజమానులు కె.రాములు, పెద్దయ్య, ఈసయ్య పంచాయతీ లేఅవుట్ వేసినట్టు నిర్ధారణ అయ్యింది. సమ్మిరెడ్డి బాల్‌రెడ్డి భూమిని స్వాధీనం చేసుకొని, వ్యవసాయ క్షేత్రం నిర్మించడంతో పాటు పలు ప్లాట్లను సొంతం చేసుకొని అంతర్గత రహదారులను బ్లాక్ చేసినట్టు హైడ్రా అధికారులు ధ్రువీకరించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారుల విచారణ తర్వాత సదరు వ్యవసాయ క్షేత్రం, ప్రహరీ, ఫెన్సింగ్ కూల్చివేతకు హైడ్రా కమిషనర్ ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో పోలీసు బందోబస్తు నడుమ నిర్మాణాలు కూల్చివేశారు. సెలవుల్లోనూ కూల్చివేతల్లో ఎందుకంత హడావుడి చేస్తున్నారంటూ హైడ్రాను హైకోర్టు నిలదీసింది. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం కోహెడలో తమ నిర్మాణాలపై నోటీసులు జారీ చేసి గడువు ఇవ్వకుండా ఆదివారం కూల్చివేయడాన్ని సవాలుచేస్తూ ఎస్.బాలారెడ్డి ఆదివారం అత్యవసరంగా ఇంటివద్ద విచారణ చేపట్టాలంటూ హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. నోటీసులు జారీ చేసి శనివారమే వివరణ ఇవ్వాల న్నారు. ఆ పత్రాలను తీసుకెళ్లడానికి తగిన గడువు ఇవ్వకుండానే కూల్చివేతలు చేపట్టారు. వాదనలను విన్న న్యాయమూర్తి హైడ్రా తీరును తప్పుబట్టారు. ఎన్నిసార్లు చెప్పినా తీరు మారడం లేదని అసహనం వ్యక్తం చేస్తూ కూల్చివేతలను నిలిపివేస్తూ మధ్యంతర ఉత్తర్వులు జారీచేశారు. వారంలోగా అన్ని వివరాలు సమర్పించాలని పిటిషనర్‌ను ఆదేశించారు.

# హద్దులు దాటుతున్న ఆక్రమణలు

జగిత్యాల : గ్రామాల పరిధిలోని అటవీ భూమిని ఇటీవల కొందరు కబ్జా చేసే యత్నం చేయగా అటవీ శాఖ అధికారులు అడ్డుకున్నారు. సరిహద్దులు చెరిపేస్తూ భూములను చదును చేస్తుండగా పనులను నిలిపేశారు. ఇక్కడ కొన్నేళ్లుగా రెవెన్యూ భూముల సరిహద్దుల విషయంలో వివాదం నెలకొంది. రెండు గ్రామాల పరిధిలో దాదాపు 40 హెక్టార్ల అటవీ భూమి అన్యాక్రాంతమైనట్లు తెలుస్తోంది. బీర్పూర్ మండలం కండ్లపల్లి, తుంగూర్ శివారు ప్రాంతాల్లో కొందరు చెట్లు నరికివేసి నిదానంగా ఆక్రమణల పర్వానికి తెర తీస్తున్నారు. ఇప్పటికే జగిత్యాల జిల్లాలో సింహభాగం అటవీ భూమి ఉన్న సారంగాపూర్, బీర్పూర్ మండలాల పరిధిలోనే నరికివేత దర్జాగా సాగిస్తూ భూమిని చెరబట్టే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. కొందరు నేతలు, అధికారుల అండదండలతో హద్దులు చెరిపివేస్తున్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోనూ వనాల ఆక్రమణకు అడ్డుకట్ట పడటం లేదు. గత ప్రభుత్వ హయాంలో ఇక్కడ 2,857 ఎకరాల పోడు భూములకు సంబంధించి 1,614 మందికి పట్టాలిచ్చినా ఇప్పటికీ పలు చోట్ల కబ్జాలు కొనసాగుతున్నాయి. వీర్నపల్లి, చందుర్తి మండలాల్లోని కొన్ని గిరిజన తండాల వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ప్లాంటేషన్‌లను చదును చేసిన సందర్భాలున్నాయి. కేసులు నమోదవుతున్నా ఆక్రమణలు మాత్రం ఆగడం లేదు.

**రెండు జిల్లాల్లో అధికం**

భూ రికార్డుల ప్రక్షాళనకు ముందు రెవెన్యూ రికార్డుల్లో అటవీ సరిహద్దు ప్రాంత సర్వే నంబర్లలో సాగు విస్తీర్ణాన్ని పెంచుకున్నారు. అప్పట్లో వీఆర్వోలు, రెవెన్యూ ఉద్యోగులు ఆక్రమణదారులకు సహకరించారు. జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల పరిధిలో భారీగా అక్రమాలు జరిగాయి. జిల్లాల ఏర్పాటుకు ముందు ఉమ్మడి కరీంనగర్ పరిధిలోని 9,878 హెక్టార్లలో అటవీ భూమి అన్యాక్రాంతమైనట్లు అధికారులు నివేదిక రూపొందించారు. జిల్లాల విభజన తర్వాత రికార్డుల్లో ఉన్న 1,14,648.5 హెక్టార్ల అటవీ భూమిని నాలుగు జిల్లాలకు కేటాయించారు. ఈ విస్తీర్ణం కూడా రికార్డుల్లో ఒక రకంగా, క్షేత్ర స్థాయిలో మరో రకంగా ఉండటం గమనార్హం. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా దాదాపు వెయ్యి హెక్టార్లకుపైగా అటవీ భూమి ఆక్రమణకు గురైనట్లు తెలుస్తోంది.

# నిషేధం.. కాగితాలకే పరిమితం

రాయికల్ : పల్లెల్లో, పట్టణాల్లో ప్లాస్టిక్ నిషేధం కాగితాలకే పరిమితమవుతోంది. కూరగాయలు, పండ్లు, పూలు, మాంసం ఇలా ఏది కొన్నా దుకాణదారులు ప్లాస్టిక్ కవర్లలో వేసి ఇస్తున్నారు. ప్లాస్టిక్ వినియోగంలో క్షేత్రస్థాయిలో కఠిన వైఖరి అవలంభించకపోవడంతో మానవ జీవితంలో నిత్యావసర వస్తువుగా మారి మానవాళి మనుగడకు సవాలు విసురుతోంది. వినియోగించడం సరికాదని తెలిసినా ఎవరూ పట్టించుకోవడం లేదు. నియంత్రించే అధికారుల చర్యలు కాగితాలకే పరిమితం కావడంతో ప్లాస్టిక్ భూతం కరాళ నృత్యం చేస్తోంది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలే దర్శనమిస్తున్నాయి. ప్రతి రోజు ఒక్కో ఇంటి నుంచి సుమారు 10 ప్లాస్టిక్ కవర్లు చెత్త కుప్పల్లోకి చేరుతున్నాయి. రోజుకు 8 నుంచి 10 టన్నుల చెత్త సేకరిస్తుండగా అందులో 50 శాతం ప్లాస్టిక్ కవర్లే దర్శనమిస్తున్నాయి. పురపాలక సంఘం అధికారులు అప్పుడప్పుడు దాడులు నిర్వహిస్తుండగా కాలుష్య నియంత్రణ మండలి అధికారులు కనీసం కన్నెత్తి చూడటం లేదనే విమర్శలున్నాయి.

**సమష్టి సహకారంతోనే నియంత్రణ**

జగదీశ్వర్‌గౌడ్, కమిషనర్, రాయికల్



చెత్త సేకరణ వాహనాల ద్వారా మైకుల్లో ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై ప్రచారం నిర్వహిస్తున్నాం. గతంలో దాతల సహకారంతో నారసంచులు పంపిణీ చేశాం. తరచూ తనిఖీలు నిర్వహిస్తూ జరిమానాలు విధిస్తుండటంతో ప్లాస్టిక్ విక్రయాలు కొంత మేర నియంత్రణలో ఉన్నాయి. ఇప్పటివరకు జరిమానాల రూపంలో రూ.22వేల ఆదాయం సమకూరింది. అధికారులు తనిఖీలు నిర్వహించినప్పుడు ప్లాస్టిక్ విక్రయాలు నిలిపివేసి తనిఖీలు సద్దుమనిగాక తిరిగి యథావిధిగా అమ్ముతున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయి. విక్రయదారులు, వినియోగదారులు సమష్టిగా సహకరించినప్పుడే ప్లాస్టిక్ నియంత్రణ సాధ్యమవుతుంది. **వినియోగంతో అనర్థాలెన్నో..** పర్యావరణంపై అవగాహన లేని కొందరు జనావాసాల్లో, వ్యవసాయ క్షేత్రాలకు సమీపంలో పాలిథిన్ సంచులు, ప్లాస్టిక్ గ్లాసులు, ప్లేట్లు పడేయడం వలన వర్షాలు కురిసినపుడు నీరు భూమిలోకి ఇంకి పోకుండా ప్లాస్టిక్ వ్యర్థాలు అడ్డుగా ఉంటున్నాయి. పట్టణంలోని పలు కాలనీల్లో మురుగు కాల్వల్లోకి ప్లాస్టిక్ వ్యర్థాలు భారీగా చేరుకోవడంతో డ్రైనేజీ వ్యవస్థ దెబ్బతింటుంది. ప్లాస్టిక్ వ్యర్థాలను పశువులు తినడం ద్వారా గర్భకోశ వ్యాధులు వచ్చి మృత్యువాత పడుతున్నాయి. భూమిపైకి చేరిన ప్లాస్టిక్ కవర్లు నాశనం కావాలంటే వేల సంవత్సరాలు పడుతుం డగా పర్యావరణ సమతుల్యత దెబ్బతింటుంది. ప్లాస్టిక్ సంచులు, గ్లాసుల్లోని పదార్థాలు వినియోగిస్తే క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు సంక్రమించే అవకాశం ఉంటుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్లాస్టిక్ చెత్తను కాల్చడంతో వచ్చే వాయువులు విషపూరితమై సమీప కాలనీవాసులు శ్వాసకోశ వ్యాధులతో ఇబ్బందులు పడే అవకాశం ఉంది.

# స్థాయి సరే.. సౌకర్యాలు ఎలా..?

నల్గొండ : జిల్లా కేంద్రంలోని జనరల్ ఆసుపత్రి స్థాయి పెరుగుతోంది. వైద్య కళాశాలలో ముందు (2019) 250 పడకలు మాత్రమే ఉండేవి. తర్వాత వైద్యకళాశాలకు అనుమతి రావడంతో ప్రత్యేక వార్డులు ఏర్పాటు చేశారు. తాజాగా రూ.23.75 కోట్లతో కొత్తగా సీసీబీ (క్రిటికల్ కేర్ బ్లాక్)తో మరో 80 పడకలు, అధునాతన వసతులతో ప్రత్యేక ఆసుపత్రి మరో 20 రోజుల్లో సిద్ధం కానుంది. వైద్య కళాశాల తరగతి గదులు నూతన భవనం(ఎస్ఎల్‌బీసీ ప్రాంతం)లోకి మార్చడం ద్వారా 200 పడకలు కొత్తగా అందుబాటులోకి వచ్చేలా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో పాటు అదనపు భవనంపై మరో అంతస్తు నిర్మించడానికి అనుమతి రావడంతో మరో 200 పడకలు అందుబాటులోకి రానున్నాయి. మరో నాలుగు నెలల్లో జనరల్




ఆసుపత్రి 1,030 పడకల స్థాయికి చేరుతుందని అధికారులు చెబుతున్నారు. దీని ద్వారా జనరల్ ఆసుపత్రిలో సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందనున్నాయి.

**మానవ వనరుల పరిస్థితి ఏంటి..?**

జనరల్ ఆసుపత్రి పడకల స్థాయి పెరుగుతున్నా మానవ వనరుల సంఖ్య 250 పడకలకు సరిపోయేంత మాత్రమే ఉంది. ప్రస్తుతం వైద్యవిధాన పరిషత్ పరిధిలో కింది స్థాయి సిబ్బంది 180 మంది పనిచేస్తున్నారు. నిబంధనల ప్రకారం.. జనరల్ ఆసుపత్రిలో 550 పడకలకు 260 మంది వరకు ఉండాలి. కొత్తగా అందుబాటులోకి వచ్చే వార్డులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా ఉండాలంటే మరో 260 మంది కిందిస్థాయి సిబ్బంది అవసరం ఉంటుంది. పారిశుద్ధ్య కార్మికులు, సెక్యూరిటీ గార్డులు, పేషెంట్ కేర్ విభాగాల్లో పూర్తి స్థాయి సిబ్బంది లేని కారణంగా ప్రస్తుతం సిబ్బందిపై పని భారం పెరుగుతోంది. దీంతో రోగులకు పూర్తి స్థాయిలో సేవలు అందడం లేదు.

**మంత్రి కోమటిరెడ్డి దృష్టికి తీసుకెళ్లాం**

డా.నగేశ్, డిప్యూటీ సూపరింటెండెంట్, జనరల్ ఆసుపత్రి

జనరల్ ఆసుపత్రిలో పడకల స్థాయికి తగినట్లుగా పారిశుద్ధ్య కార్మికులు, ఇతర సిబ్బంది లేని మాట వాస్తవమే. దీనిపై గతంలో ఉన్నతాధికారులకు లేఖ రాశాం. ఇటీవల జనరల్ ఆసుపత్రికి వచ్చిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దృష్టికి కూడా తీసుకెళ్లాం. అధికారులతో సంప్రదింపులు జరిపి గుత్తేదారుల ద్వారా మానవ వనరుల స్థాయి పెంచేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

# కట్టమైసమ్మా.. కనిపించేలా చేయమ్మా



హైదరాబాద్ : చాలాచోట్ల చెరువు కట్టలపై మైసమ్మ దేవాలయాలు కనిపిస్తుంటాయి. స్థానికులు కట్ట మైసమ్మగానే కొలుస్తుంటారు. కనుమరుగైన చెరువులను గుర్తించడానికి హైడ్రా అధికారులకు ఇప్పుడు ఈ అమ్మవారి ఆలయాలే ఆధారం కానున్నాయి. నగరంలో కనిపిస్తున్న చెరువులు ఎన్ని..? కనిపించనివి ఎన్ని..? ఈ రెండు ప్రశ్నలకు కచ్చితమైన సమాధానం కనుగొనేందుకు హైడ్రా నడుం బిగించింది. మూడు దశాబ్దాల నాటి ఉపగ్రహ చిత్రాలు, ఇతరత్రా శాస్త్రీయ ఆధారాలతో తటాకాల లెక్క తేల్చేందుకు సర్వే చేపట్టింది. అధ్యయనం ఇటీవలే మొదలైంది. ఆరంభంలోనే హైడ్రా అదరగొట్టే ఫలితం సాధించింది. మాదాపూర్‌లో నాలుగు మీటర్ల మేర మట్టితో కప్పేసిన ఏడెకరాల ఈదులకుంట వెలుగులోకి వచ్చింది. అదే మాదిరి రికార్డుల్లో లేని ఇతర నీటి వనరులనూ గుర్తిస్తామని హైడ్రా కమిషనర్ ఎ.వి.రంగనాథ్ చెబుతున్నారు. శాస్త్రీయ పద్ధతులతో, పరిశోధనాత్మక సర్వేతో మట్టిలో పాతుకుపోయిన నీటి వనరులకు పునరుజ్జీవం కల్పిస్తామని స్పష్టం చేస్తున్నారు.

**మొదటి విజయం నమోదు..**

జీహెచ్ఎంసీ వద్ద 185 చెరువుల జాబితా ఉంది. ఇందులో ఈదులకుంట వివరాలు లేవు. స్థానికుల ఫిర్యాదులతో సర్వే ఆఫ్ ఇండియా పటాలు, ఎన్ఆర్ఎస్ఏ ఉపగ్రహ చిత్రాలను తెప్పించుకుని మూడుసార్లు చెరువును స్వయంగా పరిశీలించారు. చివరకు 15 అడుగుల లోతున కుంట ఆనవాళ్లను గుర్తించారు. పూడ్చిన చెరువుకు తిరిగి ఎలా ప్రాణం పోయాలన్నదానిపై ముందుకెళ్తున్నామని అధికారులు చెబుతున్నారు.

**1025 చెరువులపై సర్వే..**

నీటిపారుదలశాఖ నోటిఫైడ్ చెరువుల జాబిత, జీహెచ్ఎంసీ, రెవెన్యూ, హెచ్ఎండీఏ రికార్డులతోపాటు.. ట్రాక్(తెలంగాణ రిమోట్ సెన్సింగ్ అప్లికేషన్ సెంటర్), ఎన్ఆర్ఎస్ఏ(నేషనల్ రిమోట్ సెన్సింగ్ ఏజెన్సీ), సర్వే ఆఫ్ ఇండియా సంస్థలు రికార్డు చేసిన దశాబ్దాల నాటి ట్రోపోషీట్లు, ఉపగ్రహ చిత్రాల ఆధారంగా ఓఆర్ఆర్ లోపల 1025 ప్రాంతాల్లో నీటి జాడను గుర్తించారు. "తూము, అలుగు, చెరువు కట్ట, కట్ట మైసమ్మ దేవాలయం వంటి ఆధారాలను మొదట నమోదు చేసుకుంటున్నాం. తర్వాత.. అక్కడ ప్రస్తుతం నీరు నిలుస్తుందా, మట్టి కుప్పలతో నింపేశారా, ఆక్రమణ జరిగిందా, జనావాసాలున్నాయా, వ్యాపార కేంద్రాలను నిర్మించారా, వరద నాలా సంగతేంటి, ఇతరత్రా వివరాలను సేకరిస్తున్నాం. వాటిని ఉపగ్రహ చిత్రాలతో పోల్చి చూసి.. చెరువు ఆనవాళ్లను ప్రాథమికంగా నిర్ధారిస్తున్నాం."అని హైడ్రా చెబుతోంది.

**సీఎం చేతుల మీదుగా..**

ప్రస్తుతం చేపడుతోన్న సర్వేలో చెరువులను మాత్రమే గుర్తిస్తామని, అక్కడున్న నివాసాలు కూల్చమని, మిగిలి ఉన్న తటాకాలనైనా కాపాడుకోవాలనేది హైడ్రా ఉద్దేశమని అధికారులు చెబుతున్నారు. ఆక్రమణకు గురైన బతుకమ్మకుంటను ఇలాగే కాంగ్రెస్ సీనియర్ నేత వి.హనుమంతరావు, స్థానికుల పోరాటం, రెవెన్యూ, హైడ్రా అధికారుల కృషితో న్యాయపోరాటం ద్వారా బతికించుకోగలిగామని అంటున్నారు. త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతులమీదుగా ఈ చెరువు పునరుజ్జీవ కార్యక్రమానికి శంకుస్థాపన చేస్తామని అధికారులు తెలిపారు.

# లీజు ఒకరిది.. అనుభవం మరొకరిది




హైదరాబాద్ : జీహెచ్ఎంసీ ఆస్తులను అక్రమంగా అనుభవిస్తున్న దుకాణాలపై అధికారులు దృష్టిసారించారు. మున్సిపల్ మార్కెట్లు, కాంప్లెక్స్‌లు, మోడల్ మార్కెట్లలో అక్రమ లీజుదారులను ఖాళీ చేయించడమే లక్ష్యంగా రంగంలోకి దిగారు. మొత్తం దుకాణాల్లో మూడొంతుల మేర లీజు పూర్తయినవి ఉండటంతో 50 శాఎతానికిపైగా దుకాణాలకు ఎస్టేట్స్ విభాగం ఇప్పటికే మూసివేత నోటీసులు జారీ చేసింది. బల్దియా చరిత్రలో ఈ స్థాయిలో నోటీసులివ్వడం ఇదే మొదటిసారి.

**రూ.కోట్ల ఆస్తులు..**

అబిడ్స్‌లోని మోజంజాహి మార్కెట్లో 20కిపైగా దుకాణాలున్నాయి. చార్మినార్ సమీపంలోని పత్తర్‌గట్టీ, మదీనా, గౌలిగూడ, కోఠి, కింగ్ కోఠి, దిల్‌సుఖ్‌నగర్, పటాన్‌చెరు, ఉప్పల్, హబ్సిగూడ, సికింద్రాబాద్ తదితర ప్రాంతాల్లో ప్రధాన రహదారుల పక్కనే జీహెచ్ఎంసీకి చెందిన మున్సిపల్ మార్కెట్లు, కాంప్లెక్స్‌లు ఉన్నాయి. మార్కెట్లలోని అద్దెలను ప్రాతిపదికగా తీసుకుంటే వాటి నుంచి బల్దియాకు ఏటా రూ.30 కోట్ల ఆదాయం రావాలి. ప్రస్తుతం వసూలవుతోంది కేవలం రూ.4 కోట్లు మాత్రమే. కొన్నిచోట్ల 30, 40 ఏళ్ల క్రితం నిర్ణయించిన అద్దెతోనే దుకాణాలు కొనసాగుతున్నాయి. వాటిలో అసలైన లీజుదారుల ఆధీనంలో ఉన్న ఆస్తులు నామమాత్రమే. గతానికి భిన్నంగా బల్దియా నుంచి మూసివేత నోటీసులు అందడం, ఖాళీ చేయాలని ఒత్తిడి పెరగడంతో ఉప్పల్, హబ్సిగూడ, ఇతర ప్రాంతాల్లోని దుకాణదారులు నిత్యం కేంద్ర కార్యాలయానికి వరుస కడుతున్నారు. వారితో ఎస్టేట్స్ విభాగం అదనపు కమిషనర్ అశోక్‌సామ్రాట్ సమావేశం నిర్వహిస్తున్నారు.

**డిజిటలీకరణ వైపు..**

మార్కెట్లు, కాంప్లెక్స్‌లతోపాటు మోడల్ మార్కెట్లు, కమ్యూనిటీ హాళ్లను జియోట్యాగ్ చేయాలని, ఆయా ఆస్తుల వివరాలను డిజిటలీకరించాలని ఇటీవల కమిషనర్ ఇలంబర్తి ఐటీ విభాగాన్ని ఆదేశించారు. పరాధీనంలోని భవనాల జాబితా రూపొందించాలన్నారు.

# ఖర్చు కొండంత.. రాబడి పిసరంత



హైదరాబాద్ : కోటి ఇరవై లక్షలమంది దాహార్తిని తీర్చే జలమండలి అప్పుల ఊబిలో కూరుకుపోతోంది. మహానగరంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాలకు తాగునీటిని అందిస్తున్న జలమండలి రాబడి, వ్యయం మధ్య పొంతన లేకపోవడంతో లోటు బడ్జెట్‌తో తల్లడిల్లుతోంది. ప్రతినెలా వచ్చే రాబడి ఉద్యోగుల జీతభత్యాలకు, తాగునీటి సరఫరా నిర్వహణ ఖర్చులకే సరిపోతుండగా.. ప్రతినెలా విద్యుత్ బిల్లులు బకాయి పడుతోంది. ఏ ప్రాజెక్టు చేపట్టాలన్నా ప్రభుత్వం వైపు చూడాల్సి వస్తోంది. ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన బోర్డు సమావేశంలో ఎండీ అశోక్‌రెడ్డి జలమండలి రాబడి వ్యయాలను వివరించగా.. ఆదాయ వ్యయాలు ఆశాజనకంగా లేవని.. వాటిని అధిగమించేందుకు తక్షణ కార్యాచరణను రూపొందించుకోవాలని ఆదేశించారు.

**ఆదాయంతో సమంగా విద్యుత్తు ఛార్జీలు**

జలమండలికి ప్రతి నెలా రూ.120 కోట్లు వరకూ ఆదాయం వస్తుండగా వ్యయం రూ.230 కోట్లు ఉంటోంది. ఇందులో విద్యుత్తు ఛార్జీలకే సుమారు రూ.110 కోట్లు, రూ.120 కోట్ల మేర ఉద్యోగుల వేతనాలు, నిర్వహణ వ్యయం అవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఆర్థికశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, పురపాలకశాఖ ముఖ్య కార్యదర్శి, జలమండలి ఎండీ, ఇతర నిపుణులతో ఏర్పడే కమిటీ జలమండలి ఆర్థిక స్థితిగతులు, రాబడికి అవకాశాలపై అధ్యయనం చేయనుంది.

**ప్రభుత్వ శాఖలవే రూ.4,300 కోట్లు**

జలమండలికి వివిధ ప్రభుత్వ విభాగాలు, కార్యాలయాల నుంచి దాదాపు రూ.4,300 కోట్ల బకాయిలు రావాలి. విద్యుత్తు శాఖకు చెల్లించాల్సిన బకాయిలు రూ.5,500 కోట్లకు చేరాయి. కృష్ణా, గోదావరి నుంచి నీటిని తరలించేందుకు చేపట్టిన ప్రాజెక్టులకు తీసుకున్న రుణం రూ.1,847 కోట్లు ఉంది. మొత్తంమీద జలమండలి రూ.8,800 కోట్ల లోటులో ఉంది. వివరించారు. 8 లక్షల కుటుంబాలకు సరఫరా చేస్తున్న ఉచిత నీటి నిమిత్తం ప్రభుత్వం ఏటా రూ.300కోట్లు జలమండలికి ఇస్తోంది.

**11 సంవత్సరాలుగా పెంచలేదు**

2013కు ముందు నీటి ఛార్జీలను నగరంలో పెంచారు. సుమారు 11 ఏళ్లుగా అవే ఉన్నాయి. వేతనాలు, నిర్వహణ వ్యయం భారీగా పెరిగిన అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గోదావరి రెండో దశకు నిధుల సమీకరణపై దృష్టిసారించిన జలమండలి పకడ్బందీ ఆర్థిక ప్రణాళిక కు కసరత్తు చేస్తోంది.

# గుట్ట.. గుటకాయ స్వాహా..!

బషీరాబాద్: రోడ్డు నిర్మాణం చేసే ఓ గుత్తేదారు అటవీ భూమిలో చెట్లను తొలగించి మట్టిని తోడేశాడు. ఈ వ్యవహారం తెలిసినా కూడా సంబంధిత శాఖ అధికారులు సైతం ఏమీ చేయలేకపోయారని ఆరోపణలు వస్తున్నాయి. స్థానికులు తెలిపిన సమాచారం ప్రకారం.. పెద్ద యంత్రాలు, టిప్పర్లు ఏర్పాటు చేసి అటవీ భూమిలో దర్జాగా దారి నిర్మాణం చేసుకొని గుట్టను కరిగించారు. వందల ట్రిప్పుల మట్టిని దర్జాగా తరలించారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని సమీప గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు.

**దారి చదును కారణంగా చూపి..**

బషీరాబాద్ మండలం గొట్టిగకలాన్ నుంచి పాటుమీదిపల్లి మీదుగా రుద్రారం వరకు రోడ్డు నిర్మాణ పనులు సాగుతున్నాయి. దారి చదునుకు పెద్దమొత్తంలో మట్టి అవసరం అవుతుంది. బషీరాబాద్ రేంజ్ పరిధిలోని గొట్టిగకలాన్ ఊరి శివారులో అటవీ ప్రాంతం ఉంది. రోడ్డు పేరుతో గుత్తేదారు గుట్టపై దట్టంగా పెరిగిన చెట్లను తొలగించి మట్టిని తరలిస్తున్నారని స్థానికులు తెలిపారు. ఇటీవల అటవీశాఖ అధికారి ఒకరు అక్కడికి వెళ్లి పరిశీలించి వచ్చారనీ, ఒక టిప్పర్‌ను సైతం పట్టుకున్నారని తెలిపారు. ఈ విషయాలను అధికారులు గోప్యంగా ఉంచారు. ఇదే సమయంలో మట్టి తరలింపుపై అన్ని విధాల పరిశీలన చేశామని, వారిపై చర్యలు తీసుకుంటామని అటవీశాఖ అధికారులు పేర్కొనడం గమనార్హం.

**నాయకులు, అధికారుల అండ చూసుకునేనా..**

అటవీభూమిలో మట్టి తరలింపుపై గుత్తేదారుకు రాజకీయ పార్టీల నాయకులు, అధికారుల అండ ఉందని సమీప గ్రామాల ప్రజలు ఆరోపిస్తున్నారు. పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిశీలన చేసి వెళ్లిపోయారని, మట్టి తరలింపును అడ్డుకోవడం లేదన్నారు. జిల్లా పాలనాధికారి స్పందించి అటవీ భూమిలో మట్టి తరలిస్తున్న గుత్తేదారుపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

# దారిపై తూట్లు.. తప్పని పాట్లు

మోతె : సూర్యాపేట– ఖమ్మం, దేవరపల్లి 365 బీబీ జాతీయ రహదారి నిర్మాణం పూర్తయి వినియోగంలోకి వచ్చిన రెండేళ్లకే ప్రయాణికులకు పాట్లు తప్పడం లేదు. విశాలమైన నాలుగు వరుసల తారురోడ్డుపై దూసుకెళ్లాల్సిన వాహనాలు అక్కడక్కడా రోడ్డు డ్యామేజీతో కుదుపులకు గురై ప్రమాదాల బారిన పడుతున్నాయి.

ప్రస్తుత పరిస్థితులకు అనువుగా అవసరమైన సాంకేతికతతో ఎక్కడా జంక్షన్‌లు లేకుండా నిర్మించిన ఈ రహదారిలో అక్కడక్కడ రోడ్డు పాసింగ్‌ల కోసం అండర్‌పాస్ వంతెనలు అధిక సంఖ్యలో నిర్మించారు. వాగులపై, అండర్ రోడ్డు పాసింగ్ ప్రదేశాల్లో ఆర్ఈ వాల్‌తో నిర్మించిన వంతెనల వద్ద ప్రస్తుతం తారురోడ్డు ధ్వంసమైంది. మోతె మండల కేంద్రం సమీపంలోని రెండు పైవంతెనల పైన, మామిళ్లగూడెం టోల్‌ప్లాజా సమీపంలో వాగుపై నిర్మించిన వంతెనల వద్ద ఈ పరిస్థితి



ఉంది. దీంతో ఆ ప్రదేశంలో తారు పొరను తొలగించి వదిలేశారు. తిరిగి బీటీ వేయలేదు. అక్కడ నామమాత్రంగా పెట్టిన భద్రత సూచికలు రాత్రివేళ కనిపించక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. మోతె సమీపంలో పైవంతెనలపై రోడ్డు ధ్వసమైన చోట రహదారిని మూస్తూ భద్రతా సూచికలు ఏర్పాటు చేసి మరమ్మతులు చేయక నెలల తరబడి అవి అక్కడే దర్శనమిస్తున్నాయి. వేగంగా వచ్చే వాహనాలు వంతెనల వద్ద ఏర్పడ్డ గుంతల్లో పడి ప్రమాదాలతో పాటు మరమ్మతులకు గురవుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు.

ఈ విషయాన్ని ఓఅండ్ఎం మేనేజరు రవి దృష్టికి తీసుకెళ్లగా.. తవ్విన ప్రదేశంలో తారురోడ్డు పునర్నిర్మిస్తామన్నారు. తారు మిక్స్ అందుబాటులో లేక మరమ్మతుల నిర్వహణ కొంత ఆలస్యమైందన్నారు. మరమ్మతులు వెంటనే పూర్తిచేసి వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూస్తామన్నారు.

# పర్యవేక్షణ కరవు.. అవినీతి దరువు

యాదగిరిగుట్ట : యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అక్రమ రిజిస్ట్రేషన్ల బాగోతం మరోసారి బయటపడింది. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా ఎలాంటి లేఅవుట్ లేకుండా, పేరు, అనుమతులు లేని వెంచర్‌లలో 154 ప్లాట్లకు డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు చేసినందుకు ఇన్‌ఛార్జి సబ్ రిజిస్ట్రార్ పి.గోపిని విచారణ అనంతరం శాఖ డీఐజీ మధుసూదన్‌రెడ్డి, జిల్లా రిజిస్ట్రార్ హెచ్.రవి సస్పెండ్ చేసిన విషయం విధితమే. ఇప్పటికీ అనేక సార్లు అధికారులు, ఉద్యోగులు అవినీతి, విధుల దుర్వినియోగంతో దొరికినా వారి తీరు మాత్రం మారడం లేదని మరోసారి రుజువవుతోంది.

2019లో కార్యాలయంపై ఏసీబీ అధికారులు దాడులు జరిగాయి. నాడు రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న వాహేద్‌ఖాన్‌పై బదిలీ వేటు చేశారు. ఆయన బదిలీ అనంతరం మూడు నెలల వ్యవధిలోనే ఏడుగురు సబ్ రిజిస్ట్రార్లను మార్చడంతో వారి పనితీరుకు అద్దం పడుతుంది. ఆ తర్వాత దేవానంద్ బాధ్యతలు ఏడాదిలోనే వసూళ్లకు పాల్పడి ఏసీబీ దొరికి, సస్పెండ్ అయ్యాడు. ఏడాది కాలంగా ఇన్‌ఛార్జులతోనే



నెట్టుకొస్తున్నారు. జూనియర్ అసిస్టెంట్‌గా పని చేసిన లక్ష్మీ కూడా అవినీతికి పాల్పడి సస్పెండ్‌కు గురైంది. జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న పి.గోపిని రెండు నెలల క్రితం యాదగిరిగుట్ట సబ్ రిజిస్ట్రార్‌గా బాధ్యతలు చేపట్టారు. ఆలేరు మండలం, కొలనుపాక గ్రామ రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబర్ 472, 473 లో 7.24 ఎకరాల భూమిని ఎలాంటి అనుమతులు లేనప్పటికీ డిసెంబర్ 21, 22, 23 తేదీల్లో 154 ప్లాట్ల దస్తావేజులు రిజిస్ట్రేషన్లు చేయడం, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న ఫిర్యాదుతో అధికారులు విచారణ చేసి రుజువు కావడంతో సస్పెండ్ చేశారు.

**గుట్టలో ఎందుకు అలా..**

యాదగిరిగుట్ట అంటేనే స్థిరాస్తి వ్యాపారానికి కేంద్రంగా ఉంది. ఈ ప్రభావం చుట్టూ 40 కిలో మీటర్ల మేర ఉంటుంది. అందుకే యాదగిరిగుట్ట ఎంత దూరం ఉన్నా పక్కనే అన్నట్లుగా స్థిరాస్తి వ్యాపారులు కొనుగోలు దారులకు ఆశలు కల్పిస్తూ, భూముల క్రయవిక్రయాలు చేపడుతుంటారు. నియోజకవర్గంలో ఉన్న ఈ ఒకే ఒక్క ఈ సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయం ఎప్పుడు కిటకిటలాడుతుంటుంది. ఇదే అదనుగా అక్రమ వసూళ్లకు, రిజిస్ట్రేషన్లకు అణువుగా మారుతోంది. దస్త్రాల పని త్వరగా అవ్వడానికి స్థిరాస్తి వ్యాపారులు కల్పించే ఎరలకు, రాజకీయ నాయకుల అండదండలకు, అభయాలకు లొంగిపోయి నిబంధనలు కూడా తొక్కేస్తుంటారు. ఈ క్రమంలో దొరికి పోతూ అవినీతి పరులుగా మిగులుతుంటారు. అధికారుల అవినీతి జాడ తెలియకుండా డాక్యుమెంట్ రైటర్లు ఇందులో ప్రధాన పాత్ర వహిస్తున్నట్లుగా గతంలో ఏసీబీ దాడుల్లో వెలుగు చూసిందే. ఉమ్మడి జిల్లా కేంద్రంలో ఉండే పై అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరించడంతో అవినీతి, అక్రమాలు సాధారణంగా మారుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి.

చురకలు



# కల్లాల్లో పంట.. కళ్లల్లో మంట

కర్నూలు : ఓ వైపు పెట్టుబడుల భారం.. మరో వైపు తెగుళ్ల భయం.. వీటికి తోడు మార్కెట్‌లో ధరలేక మిర్చి రైతులు సతమతం అవుతున్నారు. కర్నూలు విపణిలో గత 15 రోజులుగా ధరలు 'నేల'చూపులు చూస్తున్నాయి. వ్యాపారులు సిండికేట్‌గా ధరలు అమాంతం తగ్గించేశారు. రెండు, మూడు లాట్లకు మాత్రమే అధిక ధర రాస్తున్నారు. మిగిలిన లాట్లకు రూ.10 వేల లోపే ధర నమోదు చేస్తున్నారు. నాణ్యత సరిగా లేదని.. తేమశాతం అధికంగా ఉందని.. రెండో రకం సరకు అంటూ వివిధ కారణాలతో ధర తగ్గించి కొనుగోలు చేస్తున్నారని అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. ఎకరాకు రూ.లక్ష నుంచి రూ.1.50 లక్షల వరకు పెట్టుబడి పెడితే కనీసం ఖర్చులూ రావడం లేదని.. అప్పుల ఊబిలో కూరుకుపోయే పరిస్థితి నెలకొందని రైతులు వాపోతున్నారు.

**వారంలోనే రూ.3 వేలు తగ్గింది**

కర్నూలు వ్యవసాయ మార్కెట్‌లో గతేడాది అక్టోబరు నుంచి ఇప్పటి వరకు 26,250 క్వింటాళ్ల వరకు ఎండుమిర్చి క్రయవిక్రయాలు జరిగాయి. ఇప్పటి వరకు క్వింటా గరిష్ఠ ధర రూ.20 వేలు ఒక్కసారి పలకలేదు. గతేడాది డిసెంబరు 19న మధ్యస్థ ధర క్వింటా రూ.15,820 పలికింది. ఆ తర్వాత అదే నెల 27న రూ.15,909, ఈ ఏడాది జనవరి 3న రూ.15,313, 22న రూ.13,809, 27న రూ.13,009, 31న రూ.12,249గా ఉంది. ఫిబ్రవరి 8వ తేదీన రూ.8,899కు పడిపోయింది. వారం రోజుల వ్యవధిలోనే క్వింటాపై రూ.3 వేలకు పైగా ధర పతనమవడం గమనార్హం.

**తూకాల్లో మోసాలు**

ఎలక్ట్రానిక్ వేయింగ్ యంత్రాలతో తూకాలు వేస్తున్నారు. ఈ-పాస్ యంత్రాలకు అనుసంధానం చేయడం లేదు. ఒక రైతుకు సంబంధించి ఒక సంచి తూకం వేయగా 44.800 కిలోలు తూగింది. గన్నీ బ్యాగు బరువు ఒక కిలో.. ఈ నేపథ్యంలో వ్యాపారికి 43 కిలోల కింద మాత్రమే లెక్కేశారు. 800 గ్రాముల అప్పనంగా ఉచితంగా మింగేశారు. ఇలా ఒక రైతు.. ఒక్కో బస్తాపై 500 గ్రాముల నుంచి 800 గ్రాముల వరకు కోల్పోతున్నారు. గన్నీ బ్యాగుల బరువు పోనూ ఒక్కో బస్తాపై అదనంగా 500 గ్రాముల ఎక్కువ తూకాన్ని వ్యాపారుల ఖాతాల్లోకి రాసేసుకున్నారు.

**అప్పులే మిగిలాయి..: మూరెప్ప, సి.బెళగల్**

రెండెకరాల్లో మిర్చి సాగు చేశా. రూ.2.50 లక్షల వరకు పెట్టుబడి పెట్టా. నెల కిందట 6 క్వింటాళ్ల విక్రయించా. ప్రస్తుతం 4 క్వింటాళ్లు తీసుకొస్తే వ్యాపారులు మరీ అధ్వానంగా ధర తగ్గించి రాస్తున్నారు. క్వింటా రూ.12-13 వేల ధర పలకాల్సి ఉంది. సరకు నాణ్యంగా ఉన్నా.. నాసిరకం, తేమ శాతం అధికంగా ఉందంటూ తక్కువ ధర రాశారు. క్వింటాపై రూ.4 వేల వరకు ధర పతనమైంది. చివరికి అప్పులే మిగులుతున్నాయి.

# నీరు.. అందని శివారు!

విశాఖ : విశాఖ ప్రజల తాగునీటి అవసరాలు తీర్చే ఇతర జిల్లాల్లోని నీటి వనరుల్లో ఆశించినస్థాయిలో నిల్వలు ఉండడంతో... ఈ ఏడాది వేసవిలో నీటి ఎద్దడి ఉండకపోవచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. అయితే సరఫరాలో ఎదురయ్యే ఇబ్బందులతో కొన్ని ప్రాంతాలకు నీటి ఇక్కట్లు తప్పేలాలేవు.

**ఇదీ పరిస్థితి:** నగరానికి నీరందించే ఏలేరు కాలువ నిర్వహణ పనుల నిమిత్తం త్వరలో నీటి సేకరణ పూర్తిగా నిలిపేస్తారు. అదే సమయంలో కణితి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, మేహాద్రిగెడ్డ నుంచి నీటిని తీసుకోవాలని ప్రణాళికలు రూపొందించారు. వేసవి ప్రారంభం నాటికి ఏలేరు కాలువ పునరుద్ధరణ పనులు పూర్తయితే... నీటికి కొదవ ఉండదు.నగర ప్రజలకు తాగునీటిని సరఫరా చేస్తున్న టీఎస్సార్‌తో సహా, ఇతర ప్రధాన కేంద్రాల్లో నీటిని పంపింగ్ చేసే మోటార్ల స్థానంలో ఇటీవలే కొత్తవి ఏర్పాటు చేశారు. ఈ మేరకు జీవీఎంసీ అధికారులు అమృత్ పథకంలో భాగంగా రూ.50 కోట్లు ఖర్చు చేశారు. దీంతో సరఫరాలో వేగం పెరగనుంది.

**ఆ ప్రాజెక్టు పూర్తయితే..:** తాటిపూడి, రైవాడ, ఏలేరు రిజర్వాయర్ల నుంచి సేకరించిన నీటిని శుద్ధి చేసి, టీఎస్సార్‌కు పంపిస్తున్నారు. అక్కడ నుంచి నగర వ్యాప్తంగా పంపింగ్ జరిగిన తర్వాత శివారు ప్రాంతాలకు పంపింగ్ చేస్తున్నారు. దీంతో నిత్యం ఆలస్యమవడంతో పాటు, తక్కువ మొత్తంలో నీరు అందుతుంది.

అయితే నరవలోని మంచినీటి శుద్ధి కేంద్రం నుంచి రూ.250 కోట్ల వ్యయంతో ముడసర్లోవ వరకు నిత్యం 2 ఎంజీడీల నీటిని తరలించే



ప్రాజెక్టును జీవీఎంసీ (ప్రాజెక్టు విభాగం ప్రతిపాదించింది. ఈ ప్రాజెక్టు పూర్తయితే టీఎస్సార్ నుంచి వెంకోజీపాలెం వరకు మాత్రమే నీటిని సరఫరా చేసే పరిస్థితి. బీ హనుమంతవాక నుంచి ఆరిలోవ, రవీంద్రనగర్, ఇతర శివారు ప్రాంతాలన్నింటికీ కొత్త ప్రాజెక్టు నుంచి నీటిని సరఫరా చేసే వీలుంటుంది. అయితే మూడేళ్ల నుంచి ప్రాజెక్టు పనులు ముందుకు కదలకపోవడంతో, శివారు ప్రాంతవాసులు వేసవిలో నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**అక్కడే సమస్య:** ప్రజలకు అవసరమైన నీటిని సకాలంలో సేకరిస్తున్నప్పటికీ, శివారు ప్రాంతాలకు సక్రమంగా సరఫరా జరగడం లేదు. ఆరిలోవ, రవీంద్రనగర్, విశాలాక్షినగర్, సాగర్‌నగర్, ఎండాడ, మధురవాడ, కారుషెడ్డు, పీఎంపాలెం, కొమ్మాది ప్రాంతాలకు వేసవిలో రెండు రోజులకోసారి మాత్రమే నీటిని అందించే వీలుంటుంది.

టీఎస్సార్ (టౌన్ సర్వీసు రిజర్వాయర్) నుంచి ఆయా ప్రాంతాలకు పైపులైను ద్వారా నీటిని పంపింగ్ చేసే సమయం తక్కువగా ఉండటం, మిగతా ప్రాంతాల్లో నీటి వినియోగం ఎక్కువగా ఉండటంతో శివారు ప్రాంతాల రిజర్వాయర్లు పూర్తిస్థాయిలో నిండడం లేదు. దీంతో వేసవిలో రోజూ నీటిని సరఫరా చేసే పరిస్థితి ఉండడం లేదు.

త్వరలో పనులు చేపడతాం: నరవ నుంచి ముడసర్లోవ వరకు ప్రతిపాదించిన పైపులైన్ ప్రాజెక్టు పనులు త్వరలోనే ప్రారంభమవుతాయి. ఈ మేరకు ప్రభుత్వం డీపీఆర్‌ను (సవివర పథక నివేదిక) అంగీకరించింది. వచ్చే ఏడాది వేసవి నాటికి పనులు పూర్తి చేస్తాం. ఈ ఏడాది శివారు ప్రాంతాలకు నీటి సరఫరాలో ఇబ్బందులెదుర్కోకుండా చూస్తాం.కేవీఎన్.రవి, జీవీఎంసీ మంచినీటి సరఫరా, ప్రాజెక్టు పర్యవేక్షక ఇంజినీర్

# పేరుకోసం పట్టు.. కష్టాన్ని తీర్చేటట్టు



ఎమ్మిగనూరు : ఎమ్మిగనూరు చేనేత కార్మికులు అగ్గిపెట్టెలో ఇమిడే చీరను తయారు చేసి అందరి మెప్పును పొందారు. మారుతున్న అభిరుచులు, అవసరాలకు అనుగుణంగా ఎప్పటికప్పుడు కొత్త డిజైన్లతో చీరలను తయారుచేస్తున్నా సొంత ఊరికి గుర్తింపు రావడం లేదనే ఆవేదన కార్మికుల్లో నెలకొంది. నేసిన చీరలన్నీ గద్వాల పట్టు, ధర్మవరం పట్టుగా గుర్తింపు పొందుతున్నాయని, ఎమ్మిగనూరు బ్రాండ్‌మీదుగా నమోదవ్వడం లేదని ఆందోళన చెందుతున్నారు.

**కొత్త డిజైన్లకు ప్రాధాన్యం**

కర్నూలు, ఎమ్మిగనూరు, నందవరం, గోనెగండ్ల, గుడేకల్లు, కోసిగి, ఆదోని, గూడూరు, కోడుమూరు, ప్రాంతాల్లో దాదాపు 17వేల చేనేత పట్టు మగ్గాలు ఉన్నాయి. మగ్గాలకు అవసరమైన ముడిసరకు, మగ్గాలు, పట్టుదారాలను మాస్టర్ వీవర్స్ సరఫరా చేస్తారు. గద్వాల, అనంతపురం జిల్లాలకు చెందిన మాస్టర్ వీవర్స్ దాదాపు 400 మందికి పైగానే కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారు. ఒక చీర విలువ రూ.5 వేల నుంచి రూ.20వేలుండగా, పట్టుచీరను తయారు చేయాలంటే ఆరు రోజుల నుంచి 15 రోజులు పడుతుంది. చేనేత కార్మికులకు కూలి కింద ఒక చీరకు రూ.600 నుంచి రూ.2 వేలు ఇస్తారు. ఎమ్మిగనూరులో తయారుచేసిన చీరలకు వివిధ ప్రాంతాల వారు పేర్లు పెట్టుకొని వ్యాపారాలు సాగిస్తున్నారు. గద్వాల, కళాంజలి, ధర్మవరం పట్టుచీరలు ఇక్కడ తయారు చేసినవే కావడం గమనార్హం.

**అమరావతిలో ప్రదర్శన**

అమరావతిలో ఇటీవల రెండు రోజుల పాటు చేనేత వస్త్రాల ప్రదర్శన నిర్వహించారు. ఎమ్మిగనూరు నుంచి 25 మంది కార్మికులకు అవకాశం కల్పించారు. దిల్లీకి చెందిన ఐఏఎస్ అధికారులు, ఏపీ అధికారులు నేతలు తయారు చేసిన చీరల విధానాన్ని పరిశీలించారు. కోటకొమ్మలు, శంఖులు, ఏనుగు, బుట్టబొమ్మలు, ఒంటె, జింక, ఇతర చిత్రాలతో నేసిన చీరల్ని పరిశీలించి వారి ప్రతిభను ప్రశంసించారు. పలు సూచనలు అందించారు.

**కోటకొమ్మలపై ప్రత్యేకం: పెద్ద రంగన్న, మాస్టర్ వీవర్స్ ఎమ్మిగనూరు**

అమరావతిలో రెండు రోజుల చేనేత వస్త్రాల ప్రదర్శనకు వెళ్లాం. ఎమ్మిగనూరులో తయారు చేసిన చీరల్ని చూపించాం. కొన్ని సూచనలు చేసి మెలకువలు నేర్పించారు. పట్టుదారాలతో బార్డర్, కోటకొమ్మలు, బుట్టలను నేయాలని సూచించారు. మనం తయారుచేస్తున్న వాటిలో ఈ మార్పులు చేస్తే మరింత మెరుగుదల కన్పిస్తుందన్నారు.

**నూతన ఆకృతుల్లో చీరలు: వెంకటేశ్వర్లు, వ్యాపారి**

కొత్త ఆకృతుల్లో చీరల్ని నేసేందుకు ప్రభుత్వం కొంత అవగాహన కల్పించింది. డిజైన్లలో కొన్ని మార్పుల్ని నేర్చుకున్నాం. ఏనుగు, జింక, బుట్ట, పెద్ద అంచు చీరపై వంకర వంకరగా ఉండే గీతలను, బుట్టలను నేయిస్తున్నాం. తమిళనాడు, మహారాష్ట్రలకు వెళ్లి కొత్త అంశాలు నేర్చుకున్నా. ప్రభుత్వం కూడా మాకు మూడు రకాల డిజైన్లు చూపించింది. పెద్ద బార్డర్‌కు కొత్త పువ్వులు, ఆకులతో కలిసి ఉండేలా అందమైన బొమ్మలు వేస్తే బాగుంటుందని సూచించారు. ప్రభుత్వం మాకు మార్కెట్ వసతి, రాయితీ నూలు, ఇతర సదుపాయాలు కల్పించాలి.

**30 ఏళ్లుగా వృత్తిలో.. : పరమేశ్, మాస్టర్ వీవర్స్, ఎమ్మిగనూరు**

చేనేత వృత్తిలో 30 ఏళ్లుగా ఉన్నా. గతంలో చేనేత మగ్గం నేసి చిన్నగా వ్యాపార రంగం వైపు వచ్చా. ఇప్పుడు దాదాపు వంద మగ్గాల వరకు నడుపుతున్నా. ఇప్పుడు వస్తున్న మార్పులకు అనుగుణంగా పట్టు మగ్గాలను నేస్తున్నా. ప్రభుత్వం మాస్టర్ వీవర్స్‌కు మార్కెట్ వసతి, చేనేత శాల, తక్కువ వడ్డీకి బ్యాంకు రుణాలు, గుర్తింపు కార్డులు ఇవ్వాలి.

# గురుకులాల్లో ప్రవేశాలకు వేళాయె!



డోన్ : పేద, బడుగు, బలహీన వర్గాల పిల్లల విద్యాభివృద్ధికి కార్పొరేట్ తరహాలో బోధించేందుకు గానూ 2025-26 ఏడాదికి గానూ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో చేరికలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు.అయిదో తరగతిలో ఒకసారి ప్రవేశం పొందితే ఇంటర్మీడియట్ వరకు ఉచిత విద్య, వసతిని పొందే అవకాశం ఉంటుంది. ఐఐటీ, నీట్ అకాడమీ శిక్షణతో కూడిన ఇంటర్ ప్రవేశాలకు వచ్చేనెల ఆరోతేదీ వరకు దరఖాస్తులు చేసుకోవచ్చునని చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో 15 వరకు డా.బి.ఆర్.గురుకుల బాలుర, బాలికల పాఠశాలలు, కళాశాలలు ఉన్నాయి. కర్నూలు జిల్లాలోని అరికెర, సి.బెళగల్, చిన్నటేకూరు, నంద్యాల జిల్లాలో జూపాడుబంగ్లా, డోన్ ప్రాంతాల్లో బాలుర ఎస్సీ గురుకుల పాఠశాలలు ఉన్నాయి. నంద్యాల జిల్లాలో డోన్, ఆళ్లగడ్డ రెగ్యులర్, ఆళ్లగడ్డ ఆర్‌పిఆర్‌పిఆర్, కోవెలకుంట్ల, కర్నూలు జిల్లాలో కంబాలపాడు, వెల్దుర్తి, దిన్నెదేవరపాడు, లక్ష్మాపురం ప్రాంతాల్లో ఎస్సీ బాలికల గురుకుల పాఠశాలలు ఉన్నాయి. వాటిలో 8,575 మంది చదువుతున్నారు. చిన్నటేకూరులో సైతం బాలుర ఎస్సీ గురుకుల పాఠశాల, కళాశాలలో ఐఐటీ, నీట్‌నకు అకాడమీ కోచింగ్ ఇస్తారు. ఈ గురుకులంలో 2023-24 ఏడాదిలో మెడికల్ సీట్లకు గానూ 60 మంది రాస్తే 20 మందికి, ఐఐటీ, ఎన్ఐటీలలో 41 మందికి సీట్లు వచ్చాయని డీసీవో శ్రీదేవి తెలిపారు.

**ఇవి తప్పనిసరి**

ఐదో తరగతిలో చేరికకు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు 2012 సెప్టెంబరు ఒకటి నుంచి 2016 ఆగస్టు 31 మధ్య జన్మించాలి.

ఓసీ, బీసీ, ఎస్సీ కన్వర్టెడ్ క్రిస్టియన్ (బీసీ-సి) విద్యార్థులు 2014 సెప్టెంబరు ఒకటి నుంచి 2016 ఆగస్టు 31 మధ్య పుట్టి ఉండాలి.

జూనియర్ ఇంటర్‌లో చేరికలకు 2024-25 ఏడాదిలో పదో తరగతి పరీక్షకు హాజరవుతున్న విద్యార్థులు అర్హులు.

ఐదో తరగతి, ఇంటర్ ప్రవేశాలకు విద్యార్థి తల్లిదండ్రుల ఏడాది ఆదాయం రూ.లక్షకు మించకూడదు

ఐదో తరగతికి హెచ్‌టిటిపి/ ఏపీబీఆర్ఏజిసిఇటి.ఏపిసిఎఫ్ఎస్ఎస్.ఇన్, ఇంటర్‌కు సంబంధించి హెచ్‌టిటిపి/ఏపిబిఆర్ఏజిసిఇటి. ఏపిసిఎస్ఎస్. ఇన్-ఇంటర్‌ద్వారా దరఖాస్తులు చేయాలి

ఒక్కో పాఠశాలలో ఐదో తరగతికి 80 సీట్లు, కళాశాలల్లో జూనియర్ ఇంటర్‌కు 80 సీట్లు ఉంటాయని అధికారులు చెబుతున్నారు.

జూనియర్ ఇంటర్‌లో డోన్ ఎస్సీ బాలుర గురుకుల పాఠశాల మినహాయిస్తే 14 కళాశాలల్లో 1,120 సీట్లు, ఐదో తరగతికి సంబంధించి 15 పాఠశాలల్లో 1,200సీట్లు ఉంటాయని అధికారులు తెలిపారు.

ఏవేవి అవసరమంటే..?

విద్యార్థి వివరాలు తప్పులు లేకుండా నమోదు చేసుకోవాలి. నమోదు సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి ఆధార్, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు, తెల్లరేషన్‌కార్డు, పూర్వ తరగతికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలు ఉండాలి.

చరవాణి నంబరు తప్పు లేకుండా నమోదు చేయాలి.

ప్రతిభా పరీక్షలో మెరిట్ జాబితా ప్రకారం నేరుగా కేంద్ర కార్యాలయం నుంచి సీటు కేటాయింపు ఉంటుంది.

ఉచితంగా దరఖాస్తు: డా.ఐ.శ్రీదేవి, ఉమ్మడి కర్నూలు జిల్లా డీసీవో ఏటా ఐదో తరగతి, జూనియర్ ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాం. బయట దరఖాస్తు చేయించుకుంటే డబ్బులు చెల్లించాలి. మీ సమీపంలోని ఎస్సీ గురుకుల పాఠశాలల్లోకి వెళ్లి ఉచితంగా దరఖాస్తు చేసుకోవచ్చు. దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థి ప్రవేశ పరీక్షకు హాజరు కావాలి. ప్రతిభ ఆధారంగా సీటు కేటాయిస్తాం. ఐదో తరగతి పిల్లలందరికీ సీటు రావడానికి 4వ తరగతి సిలబస్ వరకు చదివించాలి. ఇంటర్ వారికి పదో తరగతి సిలబస్ చదవాలి. నిర్ణీత సమయంలో దరఖాస్తు చేయించుకోవాలి.

# సబ్జీ కూలర్.. రోజంతా తాజా కూరగాయలు..!

విశాఖ : రైతుబజారుకు తీసుకొచ్చిన కూరగాయలు, ఆకుకూరలు తాజాగా లేకపోతే ఎవరూ కొనుగోలు చేయడం లేదు. ముఖ్యంగా ఆకుకూరలు గంటల వ్యవధిలోనే వాడిపోతున్నాయి. కష్టనష్టాలు పడి పండించిన పంటను పడేయలేక రైతులు తల్లడిల్లుతున్నారు. మరో వైపు ఆర్థికంగా ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. కూలర్ పెట్టుకోవాలంటే రూ.లక్షల్లో ఖర్చు చేయాల్సి వస్తోంది. వారి సమస్యలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ప్రత్యేకంగా పర్యావరణ హిత సబ్జీ కూలర్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఆసక్తి గల రైతులకు రాయితీపై వీటిని విక్రయించనున్నారు. ప్రయోగాత్మకంగా ఒక సబ్జీ కూలర్‌ను ఎంవీపీ రైతుబజారులో ఏర్పాటు చేశారు. **విద్యుత్తు అవసరం లేదు.. నీరుంటే చాలు**విద్యుత్ లేకుండానే సబ్జీ కూలర్ పని చేస్తుంది. కేవలం నీటిని మాత్రమే ఇందులో పోయాల్సి ఉంటుంది. అన్ని రకాల కూరగాయలు, ఆకుకూరలను నాలుగు రోజుల వరకు నిల్వ చేసుకునే అవకాశం ఉంది. దీన్ని ప్రతి రోజూ 25 లీటర్లకు తక్కువ కాకుండా నీటితో నింపాలి. కూలర్‌కు నాలుగువైపులా ఉన్న రంధ్రాల ద్వారా సమానంగా నింపాలి. ఆ నీరు నాలుగువైపులా వ్యాపించి బయట నుంచి వచ్చే వేడి గాలిని నియంత్రిస్తుంది. తద్వారా కూలర్ లోపల చల్లగా ఉంటుంది.సాధారణంగా ఆకుకూరలు విక్రయించే రైతులు ప్రతి 15 నిమిషాలకు నీటిని చిలకరిస్తుంటారు. వాటిని ఈ సబ్జీ కూలర్‌లో నిల్వ ఉంచితే తాజాదనం కోల్పోకుండా ఉంటాయని అధికారులు చెబుతున్నారు. తద్వారా రైతులు నష్టపోకుండా ఉంటారన్నారు. రైతులు వీటిని సొంతానికి కొనుగోలు చేయాలనుకుంటే 50 శాతం రాయితీపై మార్కెటింగ్ శాఖ సరఫరా చేస్తుంది. 100 కిలోల సామర్థ్యం కలిగిన సబ్జీ కూలర్ రాయితీపై రూ.25వేలకు లభిస్తుంది. విద్యుత్తు ఖర్చు ఉండదని, మరమ్మతులు కూడా రావని అధికారులు చెబుతున్నారు.

# బస్టాండుల్లో నీరోచక్రవర్తులు

కర్నూలు : పెళ్లిళ్ల సీజన్ మొదలైంది.. బస్సుల్లో రద్దీ నెలకొంది.. బస్టాండులు కిటకిటలాడుతున్నాయి.. అక్కడ తాగడానికి నీళ్లు కొనుక్కోవాల్సిందే.. కనీసం చేతులు శుభ్రం చేసుకుందామంటే నీటిధారలు కనిపించడం లేదు.. రూ.20 వెచ్చిస్తే తప్ప దాహం తీరడం లేదు. ఎండవేడిమి పెరిగింది.. ఫ్యాన్లు తిరక్క ప్రయాణికులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.. కనీసం కూర్చోవడానికి సరిగా కుర్చీలు ఉండటం లేదు.. టికెట్ కొనుగోలు చేసిన ప్రయాణికుల నుంచి సేవా రుసుము కింద రూ.1 నుంచి రూ.3 వరకు వసూలు చేస్తున్నారు. ఉమ్మడి జిల్లాలో ప్రతినెలా రూ.కోటి వరకు సమకూరుతుంది. వీటితో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి. ఏ బస్టాండులోనూ సరైన మంచినీటి వసతి లేనట్లు 'బృందం పరిశీలనలో తేలింది.

మొత్తం డిపోలు: 12 (కర్నూలు-1, 2, ఆదోని, ఎమ్మిగనూరు, పత్తికొండ, ఆళ్లగడ్డ, ఆత్మకూరు, బనగానపల్లి డోన్, కోవెలకుంట్ల, నందికొట్కూరు, నంద్యాల)

ప్రస్తుతం బస్సులు : 960



నిత్యం బస్సుల ప్రయాణం : 3 లక్షల కి.మీ.

రాకపోకలు సాగించే ప్రయాణికులు : 1.60 లక్షలు

రోజువారీ ఆదాయం : రూ. 40-60 లక్షలు

**జోరందుకున్న వ్యాపారం**

రాయలసీమ ముఖద్వారమైన కర్నూలు బస్టాండుకు నిత్యం వెయ్యికి పైగా బస్సులు రాకపోకలు సాగిస్తుంటాయి.

తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాలతోపాటు పలు జిల్లాల బస్సులు వస్తుంటాయి. 30-40 వేల మంది ప్రయాణికులు వెళ్తుంటారు. 24 గంటలూ రద్దీ ఉంటుంది. ఇంత ముఖ్యమైన బస్టాండులో కనీసం చేతులు కడుక్కోవడానికి నీళ్లు లేవంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. దీన్ని ఆసరా చేసుకొని దుకాణదారులు నీటి దందా చేస్తున్నారు. 200 వరకు దుకాణాలు ఉండగా ఒక్కోదాంట్లో నిత్యం రూ.2 వేలకు పైగా నీటి వ్యాపారం జరుగుతోంది.

**శుభ్రం చేసి ఎన్నాళ్లు అయ్యిందో**

కర్నూలు నంద్యాల, ఆదోని బస్టాండ్లలో బోరు నుంచి వచ్చే నీరు వాసన వస్తుండటంతో ప్రయాణికులు తాగలేకపోతున్నారు.

కర్నూలు బస్టాండులో ఉన్న నీటి కేంద్రాలన్నీ మరుగుదొడ్లు, మూత్ర విసర్జనశాలలకు సమీపంలో ఉండటం.. భరించరాని వాసన వస్తుండటంతో ఈ నీటిని తాగేందుకు జనం ఇష్టపడటం లేదు.

తాగునీరు సరఫరా చేసే పైపులు అధ్వానంగా ఉన్నాయి. బస్టాండ్లపై ఉన్న ట్యాంకులకు సంబంధించి మూతలు దెబ్బతిన్నాయి. తాగునీరు కలుషితమవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. దీనికితోడు నీటి ట్యాంకులు శుభ్రం చేసి ఏళ్లు అవుతుండటం గమనార్హం.

# ఈ నిర్లక్ష్యాన్ని ఏ'మందు'రు

కర్నూలు : కర్నూలు సర్వజన వైద్యశాలలో అవసరమైన ఔషధాలు అందుబాటులో లేకపోవడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు. చేసేది లేక బయటకు రాస్తున్నారు. ఒక్కోరోగిపై రూ.1,000 నుంచి రూ.1,200 వరకు భారం పడుతోంది.

**ఏటా రూ.8 కోట్లు కేటాయింపు**

ఔషధాల కోసం ఏటా నాలుగు క్వార్టర్లకు కలిపి రూ.8 కోట్ల వరకు ప్రభుత్వం నిధులు కేటాయిస్తోంది. ప్రస్తుతం రోగుల సంఖ్య భారీగా పెరగడంతో ఔషధాలు పూర్తిస్థాయిలో అందడం లేదు. మరోవైపు సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి అవసరమైన ఔషధాలు రాకపోవడంతో సమస్యలు తలెత్తుతున్నాయి. కొంతమేర బయట నుంచి తెప్పిస్తున్నారు.

1. విశ్రాంత ఉద్యోగి అనిల్‌కుమార్ తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబసభ్యులు ఆదివారం అత్యవసర విభాగానికి తీసుకొచ్చారు. వైద్యులు పరీక్షలు చేసి ఫ్లూయిడ్స్ ఎక్కించారు. అత్యవసర విభాగంలో ప్యాంటోప్ ఇంజెక్షన్ లేకపోవడంతో బయటకు రాశారు.

2. కొత్తపల్లెకు చెందిన శిరీషా కర్నూలు సర్వజన ఆస్పత్రిలో బాబుకు జన్మనిచ్చారు. శిశువుకు ఫిట్స్ రావడంతో వైద్యశాలలోని పీడియాట్రిక్ విభాగానికి రెఫర్ చేసి పంపారు. అక్కడ గత నెల 19వ తేదీ నుంచి చికిత్స అందిస్తున్నారు. నిత్యం మధుమేహం పరీక్షలు చేసేందుకు మూడుసార్లు గ్లూకోజ్ స్లిప్స్ రాసిస్తున్నారు. సుమారు 20 రోజుల నుంచి రూ.1,000 వరకు ఖర్చు చేయాల్సి వచ్చిందని ఆమె కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు.

ఉమ్మడి కర్నూలు, అనంతపురం, కడప, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి రోగులొస్తుంటారు.

నిత్యం ఓపీ 3,420

ఐపీ 1,201

అత్యవసర విభాగానికి 400

వీటిని ఎందుకు తెప్పించడం లేదో

అత్యవసర విభాగంలో డైక్లోఫెనాక్, ప్యాంటోప్, హైడ్రో కార్టిసోన్, యాంటీ బయాటిక్స్, ఇన్సులిన్ సిరంజి, గ్లౌజ్‌లు, రక్తనమూనాలు సేకరించే ట్యూబ్‌లు తదితరాల అవసరం ఎక్కువగా ఉంటుంది. ఇవి అందుబాటులో లేకుంటే ఆసుపత్రి అధికారులు కొనుగోలు చేసి రోగులకు అందించాల్సి ఉంటుంది. అయినా ఎవరూ దృష్టి సారించడం లేదు. ఔషధాల సరఫరాకు టెండర్లు పిలిచి తెప్పించే అవకాశమున్నప్పటికీ పట్టించుకోవడం లేదు. ఈ విషయమై ఆస్పత్రి సీఎస్ఆర్ఎంవో డా.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఔషధాలకు సంబంధించి ఇండెంట్ పంపామని.. త్వరలో వస్తాయన్నారు.

# అభ్యసన తీరు అంచనాకు అవకాశం..

హిందూపురం : విద్యార్థి దశలో పదో తరగతి చాలా కీలకం. ఇందులో ఉత్తీర్ణులైతేనే ఉన్నత విద్య, ఉద్యోగాలకు అవకాశం. పాఠశాల దశలో చివరి పబ్లిక్ పరీక్షలు పదో తరగతి విద్యార్థులు రాయనున్నారు. మార్చి 17 నుంచి పబ్లిక్ పరీక్షలు ఆరంభం కానున్నాయి. ఈ పరీక్షల మాదిరిగానే ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ నెల 10 నుంచి 20 వరకూ ప్రీఫైనల్ పరీక్షలు నిర్వహించడానికి విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. పబ్లిక్ పరీక్షలు అనగానే విద్యార్థులకు భయం పుట్టుకొస్తుంది. విద్యార్థుల్లో మనోధైర్యం నింపాలనే ఉద్దేశం. సన్నద్ధం చేయడానికి ఎస్‌సీఈఆర్‌టీ ప్రశ్నపత్రాలు రూపొందించింది. ఇప్పటికే ప్రశ్నపత్రాలు ఎంఆర్‌సీ కేంద్రాలకు సరఫరా చేశారు. నిర్ణీత సమయం ప్రకారం పరీక్షలు నిర్వహిస్తారు. నిర్లక్ష్యం చేయకుండా విద్యార్థులందరూ రాయడం వల్ల వారికి ఉపయోగంగా ఉంటుంది.

**అన్నీ కొత్త పాఠ్యాంశాలే** పదోతరగతి విద్యార్థులకు 2024–25 విద్యా సంవత్సరం నుంచి పుస్తకాలు మారాయి. అన్ని కొత్త పాఠ్యాంశాలే.



గతంలో ఉన్న ప్రశ్నపత్రం, పాఠ్యాంశాలకు ఇప్పటి పుస్తకాలు, పరీక్షలకు వ్యత్యాసం ఉంది. కొత్త సిలబస్‌లో ఏఏ ప్రశ్నలు పరీక్షల్లో వస్తాయో తెలియని పరిస్థితి. ప్రీఫైనల్‌తో పాటు మార్చి 3 నుంచి గ్రాండ్ టెస్ట్ నిర్వహించనున్నారు. ఈ రెండు పరీక్షలు విద్యార్థుల ఉత్తీర్ణతను దాదాపు నిర్ణయిస్తాయి. తాము ఎంత వరకూ అభ్యసనం చేశామో విద్యార్థులకు కూడా అంచనా వేసుకోవచ్చు. డిసెంబరు 1 నుంచి పదో తరగతి విద్యార్థులకు 100 రోజుల కార్యాచరణ అమలు చేస్తున్నారు. మార్చి 10 వరకూ ఈ కార్యక్రమం అమలులో ఉంటుంది. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో సెలవు రోజుల్లో కూడా ప్రత్యేక శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నారు. ప్రీఫైనల్ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేశామని డీఈవో ప్రసాద్‌బాబు తెలిపారు.

# నీరుగార్చిన వైకాపా.. నీరు తెచ్చిన కూటమి

హిందూపురం : యోగివేమన జలాశయం నిర్వహణను గత వైకాపా ప్రభుత్వం పట్టించుకోకుండా నీరుగార్చింది. ఆయకట్టులో వేల ఎకరాల భూములున్నా కాలువల ఆధునికీకరణలేక గట్లు దెబ్బతినడంతో విడుదల చేసిన నీరంతా వృథాగా పోయేది. చివరి చెరువు వరకు నీరు రాకపోవడంతో రైతులకు సాగునీటి కష్టాలు ఎదురయ్యేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక కాలువగట్ల నిర్వహణ, మరమ్మతులు చేపట్టడంతో లీకేజీలకు అడ్డుకట్టపడుతోంది.

జలాశయం నుంచి కుడికాలువ 18 కి.మీ, ఎడమ కాలువ 13.74



కి.మీ, గాండ్లవారిపల్లికి వెళ్లే ఉపకాలువ 6 కి.మీ. మొత్తం కాలువలు 38 కిలోమీటర్ల పొడవు ఉంది. కాలువకు గండ్లుపడి నీరు వృథాగా పోవడం, కాలువల్లో పూడిక పేరుకుపోయి కంపచెట్లు మొలవడంతో నీరు వేగంగా వెళ్లేదికాదు. వీటిపై 'నిధుల్లేక నీరసించిన యోగివేమన', 'పంటకాలువలు అస్తవ్యస్తం.. మరమ్మతులు శూన్యం', 'వృథాజలం.. వినియోగిస్తే ప్రయోజనం', దీంతో నిధులు మంజూరైనా టెండర్లు నిర్వహించడంలో జాప్యంతో పనులు మొదలు పెట్టలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక టెండర్లు నిర్వహించిన కాలువ ఆధునికీకరణ పనులు ప్రారంభించారు. ప్రస్తుతం కుడికాలువలో నీరు వెళుతుండటంతో ఎడమ కాలువలో పూడికతీత, కంపచెట్లు తొలగిస్తున్నారు. తర్వాత గట్లకు కాంక్రీట్‌తో మరమ్మతులు చేయనున్నారు. కాలువ ఆధునికీకరణ పూర్తయితే ఆయకట్టు కింద ఉన్న ప్రతి చెరువుకు వేగంగా నీరువెళుతుంది. వీటిపై ఇరిగేషన్ జేఈ కృష్ణకుమార్‌ను వివరణ కోరగా ప్రస్తుతం పూడికతీత, కంపచెట్లు తొలగించామని, త్వరలోనే గట్లకు మరమ్మతులు చేస్తామని తెలిపారు.

# దీపం.. డబ్బులొచ్చాయి

చిత్తూరు : జిల్లాలో దీపం–2 పథకం కింద ఉచిత సిలిండర్ల పంపిణీ పక్కాగా సాగుతోంది. తొలుత పథకం అమలుకు ఆపసోపాలు పడ్డారు. చరవాణులకు సంక్షిప్త సమాచారం రాకపోవడం, సిలిండరు బుక్ చేసుకున్నాక సొమ్ము జమకాకపోవడంతో లబ్ధిదారులు ఆందోళన చెందారు. వినియోగదారుల సందేహాల నివృత్తి నిమిత్తం జిల్లా పౌరసరఫరాల శాఖ కార్యాలయంలో ప్రత్యేకంగా ముగ్గురు సాంకేతిక సిబ్బందిని నియమించారు. నగదు జమకాని వినియోగదారులు ఆయా గ్యాస్ ఏజెన్సీల వద్దకెళ్లి.. ఆధార్, బియ్యంకార్డు సమర్పిస్తే రాయితీ నగదు ఎందుకు రాలేదో కారణాలు తెలియజేస్తున్నారు. మూడునెలలకొకటి చొప్పున తొలి సిలిండరు పంపిణీ గతేడాది అక్టోబరు 31న ప్రారంభించారు. రూ.837 చెల్లిస్తే ఆ సొమ్ము మళ్లీ ప్రభుత్వం జమ చేస్తుంది. కేంద్రం రూ.19–50 రాయితీ సొమ్ము ఇస్తోంది. దీని ప్రకారం ఇప్పటివరకు జిల్లాలో వినియోగదారులకు రూ.26.23 కోట్లు జమయింది.

**తొలి సిలిండరు గడువు వచ్చేనెల వరకు..** ఈ పథకాన్ని పక్కాగా అమలు చేస్తున్నాం. సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నాం. వినియోగదారుల సందేహాలు నివృతి చేస్తున్నాం. తొలి సిలిండర్ పంపిణీ వచ్చే మార్చి నెలాఖరు వరకు గడువు ఉంది. అర్హులందరికీ రాయితీ నగదు జమవుతోంది. శంకరన్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి

పథకం పేరు : దీపం–2

లబ్ధిదారులు: 5,80,287

ఉచిత సిలిండర్ల పంపిణీ 3.27 లక్షలు

రాయితీ నగదు జమ రూ.26.23 కోట్లు

# అనధికార లేఅవుట్లు.. నిబంధనలకు తూట్లు



కదిరి : 'మండల కేంద్రమైన తలుపులలోని కుమ్మరపేట చింతవనంలో సుమారు మూడెకరాల్లో లేఅవుట్ ఏర్పాటు వేశారు. ఇక్కడ సెంటు విలువ రూ.4 లక్షల వరకు పలుకుతోంది. లేఅవుట్ తలుపుల–కదిరి ప్రధాన రహదారికి ఆనుకునే ఉంది. నిబంధనల మేరకు రోడ్లు, రిజర్వు స్థలం కూడా కేటాయించలేదు. పంచాయతీ నుంచి ఎలాంటి అనుమతి పొందలేదు.'

స్థానిక సంస్థల్లో గ్రామ పంచాయతీల అభివృద్ధికి పన్నుల రాబడి ఎంతో కీలకం. ఇంటి, ఆస్తి, సేవా పన్నులు చెల్లించని ప్రజలకు నోటీసులిచ్చి మరీ వసూలు చేస్తారు. పెద్ద మొత్తంలో వచ్చే ఆదాయానికి వ్యాపారులు ఎగవేత నామం పెడుతున్నారు. పంచాయతీల పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా లేఅవుట్లు వేస్తున్నారు. ప్లాట్ల వ్యాపారంతో రియల్టర్లు లాభాలు పొందుతూ పంచాయతీల ఆదాయానికి గండి కొడుతున్నారు. అడ్డుకోవాల్సిన పంచాయతీ సిబ్బంది రియల్టర్లతో కుమ్మక్కై చోద్యం చూస్తున్నారు. తద్వారా స్థానిక సంస్థల ఆదాయానికి భారీగా గండి పడుతోంది.'ఓబుళ దేవరచెరువు మండలం తిప్పేపల్లి రెవెన్యూ పొలం సర్వేనంబరు 163, 166ఎలో అక్రమ లేఅవుట్లు వెలిశాయి. ఎలాంటి అనుమతులు లేకున్నా, క్రయవిక్రయాలు జరుపుతున్నారు. అధికారులు ప్రధాన రహదారిపై నిత్యం రాకపోకలు సాగిస్తూ అక్రమాలను చూస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు.'

**వ్యాపారులకే అధికారుల వత్తాసు**

ఇళ్ల స్థలాల కోసం వేసే లేఅవుట్ల విషయంలో అధికారుల తీరు వ్యాపారుల లాభానికే సాయమన్న చందంగా కనిపిస్తోంది. లేఅవుట్ల ఏర్పాటుకు అహుడాకు దరఖాస్తు చేసుకోవాలి. నిబంధనల మేరకు ఎకరాకు పదిసెంట్ల రిజర్వు స్థలం కేటాయించాలి. లేఅవుట్‌కు కనెక్టివిటీ రోడ్డు 40 అడుగులు, 33 అడుగుల ఇంటర్నల్ రోడ్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అనుమతి పొందడానికి చతురస్రపు అడుగుకు రూ.40 చెల్లించాల్సి ఉంది. అలా పంచాయతీలకు రావాల్సిన రూ.కోట్ల ఆదాయాన్ని ప్రైవేటు వ్యక్తులు జేబులు నింపుకొంటున్నారు. ఇవేమీ పాటించకుండా 525 చోట్ల ప్లాట్లు వేసినట్లు అధికారులే గుర్తించారు. వీటన్నిటినీ క్షేత్రస్థాయిలో గమనిస్తున్నా పంచాయతీల ఆదాయానికి గండికొడుతున్న ప్రైవేటు వ్యాపారులపై చర్యల్లేవు.

**చర్యలు తీసుకుంటాం- సమత, డీపీఓ** జిల్లావ్యాప్తంగా అక్రమ లేఅవుట్ల పరిశీలనకు ఆదేశించాం. క్షేత్రస్థాయిలో పంచాయతీల సిబ్బంది చర్యలు చేపట్టారు. ఇప్పటికే వందల సంఖ్యలో అనధికారిక లేఅవుట్లను గుర్తించాం. రావాల్సిన ఆదాయాన్ని వసూలు చేస్తాం. అక్రమాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటాం.

# దాణా కర్మాగారం.. ఎన్నాళ్లకు ప్రారంభం?



హిందూపురం : పశువుల అభివృద్ధి, పాల ఉత్పత్తిని పెంచడానికి అవసరమైన దాణా తయారీ కోసం ఉమ్మడి రాష్ట్రంలో పశు దాణా ఉత్పత్తి కర్మాగారం తెలంగాణ పరిధిలోని జహీర్‌బాద్‌లో ఉండేది. రాష్ట్రం విడిపోయిన తరువాత ఆంధ్రప్రదేశ్‌లో దీని ఏర్పాటుకు కేంద్రం నిధులు మంజూరు చేసింది. కేంద్ర ప్రభుత్వ సహకారంతో నిర్మించే ఈ ప్రాజెక్టును వెనుకబడిన రాయలసీమలో హిందూపురంలో ఏర్పాటు చేయాలని అప్పటి తెదేపా ప్రభుత్వం 2016లో నిర్ణయించింది. ఈ ప్రాంతంలో పాల ఉత్పత్తి ఎక్కువగా ఉండటంతో ఇక్కడ ఏర్పాటు చేస్తే రైతులకు ఉపయుక్తంగా ఉంటుందని ఈ నిర్ణయం తీసుకొంది. రాష్ట్రీయ కృషి వికాస్ యోజన కింద కేంద్రం నిధులు కేటాయించింది. రాష్ట్ర పాడి పరిశ్రమాభివృద్ధి సహకార సమాఖ్య ఆధ్వర్యంలో 2016 నవంబరులో ఎమ్మెల్యే బాలకృష్ణ చేతులమీదుగా, పట్టణంలోని డెయిరీ కేంద్రం ప్రాంగణంలో దాణా తయారీ కర్మాగార నిర్మాణానికి శంకుస్థాపన చేయించారు. 2017లో పనులు చేపట్టారు. భవన నిర్మాణం, యంత్ర పరికరాల సరఫరా తదితర పనులన్నీ 2018 చివరి నాటికే పూర్తి అయ్యాయి. యంత్ర పరికరాలను అమర్చే పనులు మాత్రమే మిగిలాయి. అయితే అదే సమయంలో సార్వత్రిక ఎన్నికలు రావడం, వైకాపా ప్రభుత్వం అధికారంలోకి రావడం ఈ కర్మాగారం పాలిట శాపంగా మారింది. వైకాపా ప్రభుత్వం దాణా కేంద్రం పనులను పూర్తిగా పక్కన పెట్టింది. దీంతో అప్పటి నుంచి భవనం నిరుపయోగంగా ఉండిపోగా ఆరుబయట ఉన్న విలువైన యంత్రపరికరాలు ఎండకు ఎండి వానకు తడిసిపోతున్నాయి. అయినా ఎవరూ పట్టించుకోవడం లేదు.

**కర్ణాటక నుంచి అధిక ధరలకు..**

ప్రభుత్వమే దాణాను ఉత్పత్తి చేస్తే రైతులకు తక్కువ ధరకే అందించడానికి అవకాశం ఉండేది. ప్రభుత్వాలు పట్టించుకోకపోవడంతో ఈ ప్రాంత పాడి రైతులు కర్ణాటకలో ఉత్పత్తయ్యే దాణాను అధిక ధరకు కొనుగోలు చేయాల్సి వస్తోంది. మరోవైపు కేంద్రం మంజూరు చేసిన రూ.3 కోట్లకు పైగా నిధులు బూడిదలో పోసిన పన్నీరులా వృథా అయ్యాయి.

విషయాన్ని ఎమ్మెల్యే కార్యాలయం దృష్టికి తీసుకెళ్లగా పాడి పరిశ్రమ శాఖ అధికారులను పిలిపించి, సమీక్ష నిర్వహిస్తామని తెలిపారు. యంత్రాలు పనిచేసే స్థితిలో ఉంటే వెంటనే పనులు పూర్తయ్యేలా చూస్తామని తెలిపారు. లేదంటే సమగ్ర ప్రతిపాదనలు తయారు చేయించి, దాణా ఉత్పత్తికి అవసరమైన పనులు చేపడతామని వివరించారు.

# మల్లన్న క్షేత్రం.. ప్రగతి నాదం



శ్రీశైలం : ద్వాదశ జ్యోతిర్లింగాల్లో ఒకటైన శ్రీశైల మహాక్షేత్రం ఆధ్యాత్మిక నగరంగా అభివృద్ధికి అడుగులు పడుతున్నాయి. దేశ, విదేశీ యాత్రికులను ఆకట్టుకునేలా అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో అభివృద్ధి చేయడంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దృష్టి పెట్టాయి. ఇటీవల కేంద్ర పర్యాటకశాఖ కార్యదర్శి విద్యావతి ఆధ్వర్యంలో శ్రీశైలంలో అంతర్జాతీయ స్థాయిలో సదుపాయాలు కల్పించే విషయమై ప్రాథమిక సమీక్ష నిర్వహించారు. రానున్న రోజుల్లో చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. విడతల వారీగా ఆధునిక వసతులు కల్పించేందుకు కన్సల్టెన్సీల ద్వారా ప్రణాళికలు రూపొందించాలని నిర్ణయించారు. మహాశివరాత్రి ఏర్పాట్లు పరిశీలించేందుకు సోమవారం రాష్ట్ర మంత్రుల బృందం పర్యటించనుంది.. ఈ నేపథ్యంలో ప్రగతి ప్రణాళికలను సమీక్షించి అమలు వేగవంతం చేయాలని భక్తజనం విన్నవిస్తోంది.

**వసతులు మెరుగుపడాలి**

శ్రీశైల క్షేత్రానికి 4,433 ఎకరాల భూమి ఉంది. రెండేళ్ల కిందట అటవీ, రెవెన్యూ శాఖలు, దేవస్థానం అధికారులు సంయుక్తంగా సమగ్ర భూ సర్వే చేసి హద్దులు నిర్ధారించారు. ప్రస్తుతం 900 ఎకరాల్లో శ్రీశైల క్షేత్రం విస్తరించి ఉంది.

ప్రస్తుతమున్న తాత్కాలిక క్యూ కంపార్ట్‌మెంట్లు రద్దీ రోజుల్లో భక్తులకు సరిపోవడం లేదు. ఆలయానికి సమీపంలోనే రూ.51 కోట్లతో తితిదే తరహా నూతన క్యూ కాంప్లెక్స్ నిర్మించాలన్న నిర్ణయాన్ని వేగవంతం చేయాలి.

శ్రీశైలంలో పర్యాటకశాఖ ఆధ్వర్యంలో దశాబ్దాల కిందట హరితా రెస్టారెంట్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం దీనిని తొలగించి కొత్తగా గ్రౌండ్ ఫ్లోర్‌లో నూతన రెస్టారెంట్, 50 ఏసీ వసతి గదులు నిర్మిస్తున్నారు. ఇక్కడ మరింత స్థలం కేటాయిస్తే మరిన్ని వసతులు కల్పించడానికి వీలుంది.

**సున్నిపెంట ప్రగతి ఎంతో అవసరం**

శ్రీశైలం చెంతనే ఉన్న సున్నిపెంట గ్రామాన్ని టెంపుల్ సిటీగా అభివృద్ధి చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే సుమారు రూ.70 కోట్లతో సున్నిపెంటలో దేవస్థానం ఉద్యోగుల నివాస భవనాలు నిర్మిస్తున్నారు. ఈ నిర్మాణాలు తుది దశకు చేరుకున్నాయి.

శ్రీశైలంలో ఆలయానికి చుట్టుపక్కల ఉన్న నివాసాలను సున్నిపెంటకు తరలించాలన్న ప్రతిపాదన ఉంది. ఇప్పటికే సున్నిపెంటలో పేదలకు మంజూరు చేసిన స్థలాల్లో ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా ప్రభుత్వం చొరవ తీసుకోవాల్సిన అవసరం ఉంది.

**ఆహ్లాదం పంచాలి**

శ్రీశైలంలో పర్యాటకులను ఆకట్టుకునే విధంగా ఆధ్యాత్మిక, పర్యాటక థీమ్ పార్కులు తీర్చిదిద్దాలి. 2000లో ఏర్పాటు చేసిన ఏరియల్ రోప్‌వేను విదేశాల తరహాలో ఆధునికీకరించాలన్న ప్రతిపాదన ఉంది. దీనివల్ల దేశ, విదేశీ పర్యాటకులను ఆకట్టుకునే వీలు కలుగుతుంది. దోమలపెంట (తెలంగాణ) నుంచి శ్రీశైలంలోని రుద్రపార్కు వరకు కొత్తగా రోప్‌వే ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది.

**తీరాలి ట్రాఫిక్ కష్టాలు**

ముఖద్వారం నుంచి హఠకేశ్వరం, సాక్షి గణపతి, శ్రీశైలం వరకు ఉన్న ఇరుకైన రహదారిని నాలుగు వరుసలుగా అభివృద్ధి చేయాలన్న ప్రతిపాదనకు అడుగులు పడాలి.సున్నిపెంట నుంచి శ్రీశైలానికి 2.5 కి.మీ దూరం వరకు వంతెన నిర్మించడానికి ప్రతిపాదన ఉంది. అటవీశాఖ సహకారంతో దీనిని త్వరగా చేపడితే రాకపోకలు సులభతరం కానున్నాయి.

# కట్టేయ్.. అడిగేదెవరు

తిరుపతి : నగరాలు, పట్టణాలు దినదినాభివృద్ధి చెందుతున్నాయి. ఈ నేపథ్యంలో కొందరు అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపడుతుండగా.. మరికొందరు అనధికారికంగా నిర్మాణాలు చేపట్టి నగరాలు, పట్టణాల ఆదాయానికి గండికొడుతున్నారు. వీరికి ప్రజాప్రతినిధుల అండదండలు ఉండటంతో అధికారులు సైతం అటువైపు కన్నెత్తి చూడటం లేదు. చిత్తూరు జిల్లాలో నగరి, పలమనేరు, పుంగనూరు, కుప్పం మున్సిపాలిటీలు, చిత్తూరు నగర పాలక సంస్థలు ఉన్నాయి. తిరుపతి జిల్లాలో తిరుపతి కార్పొరేషన్‌తో పాటు పుత్తూరు, శ్రీకాళహస్తి, వెంకటగిరి, సూళ్లూరుపేట, నాయుడుపేట, గూడూరు మున్సిపాలిటీలు ఉన్నాయి. ఈ నగరాలు, పట్టణాల్లో ఏటా వందల సంఖ్యలో అనధికార కట్టడాలు వెలుస్తున్నాయి. వాటిని గుర్తించి అడ్డుకోవాల్సిన అధికార యంత్రాంగం అటువైపు దృష్టి సారించడం లేదు. దీంతో అనధికారిక కట్టడాల సంఖ్య ఏటా పెరుగుతోంది. వీటిని నియంత్రించకపోతే భవిష్యత్తులో నగరాలు, పురపాలికల్లో ఆర్థిక పరిస్థితి మరింత దిగజారే అవకాశం ఉంది.

ఇటీవల తిరుపతిలో ఓ కార్పొరేటర్ అనుమతులు ఉల్లంఘించి నిర్మాణాలు చేపట్టారు. వాటిని అధికారులు కూల్చడానికి వెళ్తే.. ఆ పార్టీకి చెందిన ఓ ముఖ్య ప్రజాప్రతినిధి తిరుపతిలో 60 శాతం నిర్మాణాలు



అనధికారికంగా చేపట్టినవేనని, వాటిని తొలగించాక, మా పార్టీ కార్పొరేటర్ చేపట్టిన అక్రమ నిర్మాణాన్ని తొలగించాలని చెప్పడం గమనార్హం. దీన్నిబట్టి నగరాలు, పట్టణాల్లో అక్రమ నిర్మాణాలు ఏస్థాయిలో జరుగుతున్నాయో ఆయన మాటలే చెబుతున్నాయి.

తిరుపతి నగరంలో ప్రభుత్వ భూములు, కాల్వ పోరంబోకు, 22(ఏ) నిషేధిత జాబితాలోని భూములు, కుంటలు, తితిదే స్థలాలు ఎక్కువ. ప్రభుత్వం ఈ భూముల్లో నిర్మించే కట్టడాలకు ఎలాంటి అనుమతులు ఇవ్వదు. ఈ నేపథ్యంలో భవన నిర్మాణదారులు నగరపాలకసంస్థ అధికారులతో లోపాయికారీ ఒప్పందం కుదుర్చుకుని అనధికారికంగా నిర్మాణాలు పూర్తిచేస్తున్నారు. నగర పరిధిలోని తిమ్మినాయుడు పాళెం, అక్కారంపల్లి, కొంకా చెన్నాయగుంట, మంగళం, తిరుపతి నగర సర్వే, గ్రామీణ సర్వేలో 10,683 ఎకరాలు నిషేధిత జాబితాలో ఉన్నాయి. కొర్లగుంట, రెడ్డీ అండ్ రెడ్డీ కాలనీ, రైల్వే కాలనీ, చింతలచేను, శివజ్యోతినగర్, యశోదానగర్, భవానీ నగర్ గిరిపురం తదితర ప్రాంతాల్లో నిర్మాణ అనుమతులు అరుదుగా లభిస్తాయి. ఈ నేపథ్యంలో అనధికారిక నిర్మాణాలను చేపడుతున్నా ఉదాసీనంగా వ్యవహరిస్తున్నట్లు వెల్లడవుతోంది.చిత్తూరు నగరంలో అనధికార కట్టడాలు జోరుగా సాగుతున్నాయి. పట్టణంలో నూతనంగా ఏర్పడుతున్న కాలనీల్లో ఈ అక్రమ నిర్మాణాలు సాగుతుండటం గమనార్హం. అయితే నగరపాలికలోని ప్రణాళికా విభాగం అధికారులకు ఇదంతా తెలిసినా తెలియనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

**కఠిన చర్యలు తీసుకుంటాం..**

నగరాలు, పట్టణాల్లో అక్రమ కట్టడాలు వివరాలు ఆరాతీస్తాం. ఆయా నగరాలు, పట్టణాల్లో ఇప్పటి వరకు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ఎన్ని నిర్మించారు. వాటి లెక్కలు తేలాక కఠినంగా వ్యవహరిస్తాం. పట్టించుకోని పట్టణ ప్రణాళికా విభాగం అధికారులపైనా చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. విశ్వనాథ్, ఆర్డీ, అనంతపురం

# మట్టే బంగారమాయెనే..!

చిత్తూరు : ప్రభుత్వం మారినా మట్టి మాఫియా దందా యథేచ్ఛగా కొనసాగుతోంది. కుంటలు, చెరువులు, కొండలను, అటవీ భూములను తవ్వి మట్టిని అమ్ముకుంటున్నారు. మట్టి మాఫియా చదును చేసిన కొండలను కబ్జాదారులు ఆక్రమించుకుని పంటలు సాగు చేస్తున్నారు. మండలంలోని డీఎంపురం, నిశ్శంకదుర్గం, ఎల్ఆర్‌పేట, గోపిశెట్టిపల్లి పరిసర ప్రాంతాల్లో కొండలు, చెరువులను తవ్వి మట్టిని తమిళనాడుకు తరలిస్తూ లక్షల రూపాయలు దండుకుంటున్నారు. నిశ్శంకదుర్గం పరిసర ప్రాంతంలోని తమిళనాడు సరిహద్దులో జాతీయ రహదారి నిర్మాణ పనుల నిమిత్తం గనులశాఖ అధికారుల నుంచి తాత్కాలిక అనుమతులు పొంది మట్టిని అక్రమంగా తమిళనాడుకు తరలిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. ప్రభుత్వ కార్యాలయాలకు సెలవు దినాల్లో దళారులు జేసీబీలతో కొండల్ని తవ్వి మట్టిని ప్రైవేటు వ్యక్తులకు, ఇటుక బట్టీలకు, రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మి సొమ్ము చేసుకుంటున్నారు. కళ్లెదుటే మట్టి తరలిస్తున్నా రెవెన్యూ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తు న్నారు. మట్టి మాఫియా చదును చేసిన ప్రభుత్వ స్థలాలను కబ్జాదారులు ఆక్రమించి డీకేటీ పట్టాలను పొందడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. దీనిపై తహసీల్దారు నాగరాజును వివరణ కోరగా మట్టి తవ్వకాలకు అనుమతులు ఇవ్వలేదన్నారు. అక్రమంగా మట్టి తరలిస్తే వాహనాలు సీజ్ చేస్తామన్నారు. ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములను గుర్తించి నోటీసు బోర్డులు ఏర్పాటు చేయడంతో పాటు కబ్జాకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.

# చేపకు కాటు.. ఆక్రమణలకు చోటు

నందికొట్కూరు: రూ.5 కోట్ల విలువైన ఖాళీ స్థలంపై వైకాపా నాయకుడు కన్నేశారు. అక్కడ చెట్లన్నీ తొలగించి పొలాన్ని చదును చేసి ఐదెకరాలు ఆక్రమించేశారు. చేప పిల్లల పెంపకానికి తంగడంచ సీడ్ ఫామ్ భూముల్లోని 10 ఎకరాల్లో ఇంక్యుబేటర్‌కు షెడ్డు, యంత్రాలతో పాటు 25 బెడ్లను, సిబ్బంది కోసం ఆరు గదుల క్వార్టర్స్‌ను మత్స్యశాఖ నిర్మించింది. కేసీకెనాల్, బోరు నీటి ఆధారంగా చేపగుడ్లను ఇంక్యుబేటర్‌లో ఉంచి పిల్లలను ఉత్పత్తి చేసి బెడ్లలో వదిలి పెంపకాన్ని చేపట్టేవారు. సంబంధిత శాఖ నిర్లక్ష్యం కారణంగా చేప పిల్లల పెంపకం నిలిచిపోవడంతో ఏళ్లపాటు భవనాలు, యంత్రాలు అన్నీ నిరుపయోగంగా మారాయి. దీన్ని అదునుగా చేసుకొని తాటిపాడుకు చెందిన వైకాపానేత గత ప్రభుత్వ హయాంలో అధికారుల అండదండలతో అన్నింటినీ ఆక్రమించేశారు. అక్కడున్న చెట్లను తొలగించి చదునుచేశారు. ఇంత జరుగుతున్నా అధికారులు పట్టించుకోకపోవడం గమనార్హం.ఇదే గ్రామానికి చెందిన మరో వ్యక్తి క్వార్టర్స్ వద్ద పశువుల పెంపకం చేపడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

చురకలు



# రేవులో విధ్వంసం..!

కొత్తూరు : అధికారం చేతిలో ఉంది. ప్రతిపక్ష నాయకులను సైతం మన ఆధీనంలోకి తెచ్చుకున్నాం. ఇక మనల్ని ఎవరు అడ్డేది అన్న ధోరణిలో ఇసుక తవ్వకాలను దక్కించుకున్న గుత్తేదారులు బరితెగిస్తున్నారు. అధికారుల అండదండలతో యథేచ్ఛగా నిబంధనలు విస్మరించి, ప్రకృతి వనరులను దోచుకుంటున్నారు. ఇసుక ర్యాంపుల్లో కాసులు దండుకుంటున్నారు. వంశధార నదీ తీరంలో ఏర్పాటు చేసిన ఇసుక రేవుల్లో నిబంధనలు ఉల్లంఘిస్తూ సాగుతున్న తవ్వకాలు, తరలింపు కొందరికి వరంగా మారింది. గుట్టల కొలది ఇసుక తరలిపోతున్నా అధికార యంత్రాంగం చూస్తుండటం తప్ప, పట్టించుకునే పరిస్థితి లేదని కూటమి నేతలే విమర్శిస్తున్నారంటే ఇక్కడ సాగుతున్న దందాను అర్థం చేసుకోవచ్చు.

**రాత్రి, పగలు తేడా లేకుండా..**

కొత్తూరు మండలంలోని ఆకులతంపర, నివగాం గ్రామాల్లో అనుమతితో నడుస్తున్న ఇసుక ర్యాంపుల నుంచి నిత్యం రాత్రి, పగలు తేడా లేకుండా ఇసుక లారీల్లో తోడేస్తూ తరలిస్తున్నారు. ఆకులతంపరలో ఒక అడుగు ముందుకేసి నదీ గర్భంలో ఏకంగా అనధికారికంగా రహదారి వేసేశారు. ఇసుక తవ్వకాలు జరిపే సమయంలో పాటించాల్సిన నిబంధనలు తుంగలో తొక్కుతున్నారు. ప్రభుత్వ అనుమతి ఉన్న ఇసుక ర్యాంపుల్లో మీటరు లోతులో కేవలం మనుషులతోనే తవ్వకాలు చేపట్టాలి. కానీ యంత్రాలతో తోడేస్తున్నారు. ఐదారు మీటర్ల లోతు వరకు తవ్వకాలు చేపడుతున్నారు. ట్రాక్టర్ల ద్వారా ఇసుకను స్టాక్ పాయింట్‌కు చేర్చి, అక్కడి నుంచి లారీలకు లోడు చేయాల్సి ఉన్నా.. అలా జరగడం లేదు. విశాఖపట్నం, విజయనగరం, సరిహద్దు



రాష్ట్రం ఒడిశాకు నిత్యం వందల లారీల్లో రవాణా చేస్తున్నారు. నదీ గర్భంలో పొక్లెయిన్‌తో ఎత్తేందుకు రూ.8-10 వేల వరకు తీసుకుంటున్నారు. అయినా గనుల శాఖ కళ్లు మూసుకుంది.. రెవెన్యూ అధికారులు చోద్యం చూస్తున్నారు.

**ప్రవాహంలో మార్పు..**

నిబంధనలు అతిక్రమించి మీటరు దాటి తవ్వేస్తే నది సమతుల్యత దెబ్బతిని, ప్రవాహంలో మార్పు వచ్చే ప్రమాదం పొంచి ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. నివగాంలో వంశధార వంతెన సమీపంలో తవ్వకాలు చేపడుతుండటంతో వంతెన బలహీనమై కూలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇసుక ర్యాంపుల్లో జరుగుతున్న అక్రమాల బాగోతంపై తెదేపా పార్లమెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు కలమట వెంకటరమణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆకులతంపర ఇసుక ర్యాంపును గురువారం సందర్శించారు. ర్యాంపు వద్ద నుంచే ఉన్నతాధికారులతో మాట్లాడారు. యంత్రాలను స్వాధీనం చేసుకోవాలని కోరారు. 'ఆకులతంపర, నివగాం రేవుల్లో అక్రమ తవ్వకాలపై విచారణ చేస్తాం. నిబంధనల మేరకు తవ్వాలి. ఉల్లంఘిస్తే చర్యలు తీసుకుంటాం' అని కొత్తూరు తహసీల్దారు రవిచంద్ర తెలిపారు.

# హరిత వికాసానికి అడుగులు

ఒంగోలు: భూ విస్తీర్ణంలో 33 శాతం పచ్చదనం ఉండాలనేది కేంద్ర అటవీ శాఖ మార్గదర్శకాలు. జిల్లాలో అటవీ విస్తీర్ణం 22.77 శాతమే(2023 గణాంకాల ప్రకారం) ఉంది. 2021తో పోల్చితే 6.97 చదరపు కిలో మీటర్లు తగ్గినట్లు నివేదికలు తెలుపుతున్నాయి. ఈ నేపథ్యంలో కూటమి సర్కారు హరితాంధ్రప్రదేశ్‌కు శ్రీకారం చుట్టింది. పచ్చదనం పెంపుపై దృష్టిసారించింది.

నాడు అయిదేళ్లకు రూ. 65 లక్షలు: వైకాపా ప్రభుత్వం తన అయిదేళ్ల పాలనలో రూ.65 లక్షలు ఖర్చు చేసి 15 లక్షల మొక్కలు నాటినట్లు చూపింది. వాటితోపాటు 2019కి ముందు తెదేపా హయాంలో నాటిన వాటినీ సంరక్షించక.. పరోక్షంగా పచ్చదనం ఎండిపోవడానికి కారణమైంది. నేడు ఏడాదికే రూ. 3.98 కోట్లు: జిల్లాలో పచ్చదనం విస్తీర్ణం భూ విస్తీర్ణంలో సగభాగం(యాభై శాతం) ఉండాలన్నది హరితాంధ్రప్రదేశ్ లక్ష్యం. అందుకు అనుగుణంగా జిల్లాలో ఖాళీ స్థలాలు, రహదారుల వెంట, ఇళ్లల్లో సామాజిక అటవీ శాఖ ఆధ్వర్యంలో 30 లక్షల మొక్కలు పెంచాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఆ మేరకు ఉపాధి నిధులు రూ.3.98 కోట్లను విడుదల చేశారు. వీటితో సుమారు 30 రకాలకు పైగా మొక్కలను పెంచి ఇంటికి అయిదు చొప్పున ఉ



చితంగా అందించనున్నారు. ఉపాధి హామీ కూలీలకు పని కల్పించడానికి డ్వామా ఆధ్వర్యంలో రహదారుల వెంట గుంతలు తీసి నాటించనున్నారు. కంపా, అటవీ శాఖ నిధులతో మరో నాలుగు లక్షల మొక్కలు పెంచనున్నట్లు జిల్లా సామాజిక అటవీ శాఖ డివిజనల్ అధికారి రాజశేఖర్‌రావు తెలిపారు.

సిద్ధమైన నర్సరీలు

గతంలో కొత్తపట్నం, కలుజువ్వపాడు, తుమ్మలచెరువు గ్రామాల్లోని నర్సరీలే మొక్కల పెంపకానికి అనువుగా ఉన్నాయి. తాజాగా వీటితోపాటు తాపచెట్టు, హాజీపురం, బల్లిపల్లి, మర్రిపాలెం, మర్రిపల్లి, తోకపల్లి గ్రామాల్లోని నర్సరీలను పునరుద్ధరించారు. జూన్, జులైలో వర్షాలు సమృద్ధిగా కురిసే సమయానికి మొక్కలు అంది వచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

# ఇంత నిర్లక్ష్యమా?



నర్సీపట్నం : రహదారుల నిర్మాణ పనుల్లో నాణ్యతకు ఎక్కడా ఢోకా లేకుండా చేపట్టాలని కూటమి ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. తాజాగా చేపట్టిన పనులే కాకుండా గత వైకాపాలో చేసిన రోడ్ల పనుల నాణ్యతపై కూడా దృష్టి పెట్టాలని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. అయినా కొందరు ఇంజినీరింగ్ అధికారులకు ఈ విషయం తలకెక్కడం లేదు. ఈ దిశగా పరిశీలించాలంటూ శాసన సభాపతి అయ్యన్నపాత్రుడు సూచించినా తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వైకాపా ప్రభుత్వ హయాంలో ఎన్నికల ముందు ఎంతో ఆర్భాటంగా రోడ్లు పనులకు ప్రారంభోత్సవం చేశారు. ఓటర్లు మెప్పు పొందేందుకు యుద్ధప్రాతిపదికపై పనులు చేయాలంటూ గుత్తేదారులకు హుకుం జారీ చేశారు. నాణ్యతతో పనిలేకుండా ఎన్నికల కోడ్ కూయకముందే ప్రారంభోత్సవాలు జరగాలంటూ ఉత్సాహం చూపడంతో గుత్తేదారులు ఇదే అదునుగా మొక్కుబడి పనులు చేసి బిల్లులు మార్చేసుకున్నారు. నాణ్యత లేకుండా నిర్మించిన రోడ్లు ఇప్పుడు గిరిజనులకు సంకటంగా మారాయి. గొలుగొండ మండలం పాతమల్లంపేట పంచాయతీ గదబపాలెం నుంచి నిమ్మగెడ్డకు తారురోడ్డు నిర్మాణానికి గతేడాది పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి పథకం (నాబార్డు) ద్వారా 4 కిలోమీటర్ల మేర తారురోడ్డు నిర్మాణానికి రూ. 60 లక్షల నిధులు మంజూరయ్యాయి. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో వైకాపా నాయకుల ఆదేశాలతో గుత్తేదారు హడావుడిగా పనులు చేసి నాణ్యతకు నీళ్లొదిలేశారు. ఈ నాసిరకం పనులపై గతేడాది ఈనాడులో 'మొక్కుబడి పనులు మొదట్లోనే తూట్లు' అనే శీర్షికతో కథనం వెలువడింది. అప్పట్లో ఎన్నికల కోడ్ సమీపిస్తున్న నేపథ్యంలో 2024 జనవరి 30న అప్పటి నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ హడావుడిగా ప్రారంభోత్సవం చేసేశారు. ఇంజినీరింగ్ అధికారులు సహకారంతో బిల్లులు మార్చేసుకున్న గుత్తేదారు రోడ్డువంక చూడలేదు.

ప్రస్తుతం ఈ రోడ్డు అంచులు కంకరకు బదులు మట్టితో పూడ్చడం వల్ల అంచులు కోతకు గురయ్యాయి. ఎదురెదురుగా వస్తున్న వాహనాలు తప్పుకొనే యత్నంలో బోల్తా పడుతున్నాయి. రోడ్డుపై తారుపూత పూర్తిగా లేచిపోయింది. నాలుగు కిలోమీటర్లు మేర రోడ్డు పరిస్థితి ఇలాగే ఉండటంతో అటుగా రాకపోకలు సాగించే నాలుగు గ్రామాల గిరిజనులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఐదేళ్ల పోరాట ఫలితంగా మంజూరైన తారురోడ్డు నిర్మాణం ఇలా నాణ్యత లేకుండా నిర్మించి ఇబ్బందులకు గురిచేశారని ఈ ప్రాంత గిరిజనులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పుడున్న తారురోడ్డు కంటే గతంలో ఉన్న మట్టిరోడ్డే బాగుండేదంటున్నారు గిరిజనులు. మారుమూల గ్రామాలకు చిరకాలం ఉండాల్సిన తారురోడ్డును నాణ్యత లేకుండా నిర్మించారంటూ గదబపాలెం, నిమ్మగెడ్డ, భీమునిపట్నం గ్రామాలకు చెందిన గిరిజనులు పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేశారు. తక్షణం రోడ్డు పనుల నాణ్యత చక్కదిద్దాలని వేడుకున్నారు. ప్రజావాణి కార్యక్రమాల్లో ఫిర్యాదులు ఇచ్చారు. కానీ ఇంజినీరింగ్, మండలశాఖ అధికారులు పట్టించుకోలేదు. తక్షణం అధికారులు స్పందించి రోడ్డు నిర్మాణంలో నాణ్యత లోపాలు చక్కదిద్దాలని.. లేకుంటే ఆందోళన బాట పడతామని సీపీఎం నాయకులు చంద్రరావు తెలిపారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించాం..: గదబపాలెం తారురోడ్డు పనులు సక్రమంగా లేకపోవడం వాస్తవమే. ఆ ప్రాంతీయులు ఫిర్యాదు మేరకు క్షేత్రస్థాయి పరిశీలన చేశాం. తొలిదశలో హడావుడిగా పనులు చేపట్టడం వల్ల.. మరిగిన తారుపిక్క ఉష్ణోగ్రత శాతం ఎక్కువ కావడంతో రోడ్డుపై అంటుకోలేదని గుర్తించాం. ప్రకాశం జిల్లాకు చెందిన గుత్తేదారు ఈ పనులు చేపట్టారు. పూర్తిస్థాయిలో నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటాం.సత్యనారాయణ, డీఈ, పంచాయతీరాజ్, ప్రాజెక్టు నర్సీపట్నం

# 'క్లాప్'..కనుమరుగయ్యేనా..!



నర్సీపట్నం : రాష్ట్రంలో చెత్త సేకరణకు వినియోగిస్తున్న క్లాప్ (క్లీన్ ఆంధ్రప్రదేశ్) వాహనాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. ఏటా కోట్ల రూపాయల ప్రజాధనం గుత్తేదార్లకు దోచిపెడుతున్న తీరుపై పూర్తిగా విచారించి... క్లాప్ వాహనాలు నిలిపివేయాలన్న నిర్ణయానికి వచ్చింది.వైకాపా హయాంలో ఆ పార్టీ నాయకులకు లబ్ధిచేకూర్చేలా జీవీఎంసీ (మహా విశాఖ నగర పాలక సంస్థ)పై ఆర్థికభారం మోపుతూ 900 వాహనాలను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ద్వారా సమకూర్చారు.. నగరంలో కొండవాలు ప్రాంతాలు అధికంగా ఉన్నాయని, ఆయా చోట్లకు వాహనాలు వెళ్లవని నాటి ప్రతిపక్ష నాయకులు పేర్కొన్నా, వైకాపా ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే వాహనాలు ఏర్పాటు చేసింది. అప్పటివరకు నగర గుత్తేదారులు చెత్త సేకరణకు సమకూర్చిన ఒక్కో వాహనానికి రూ.45 వేలు ఇచ్చిన జీవీఎంసీ అధికారులు, క్లాప్ పథకంలో ఒక్కో వాహనానికి రూ.65 వేలు ఇచ్చేలా ఒప్పందం చేసుకున్నారు. అలా పెంచిన మొత్తాన్ని 'చెత్త సేకరణ ఛార్జీల' పేరిట ప్రజల నుంచి వసూలు చేసి, గుత్తేదారుకు జమ చేసేవారు.

**అయినా సరే..:** 'క్లాప్' ద్వారా జీవీఎంసీలో సేవలు అందిస్తున్న టాటా ఏస్ వాహనాలను భవిష్యత్తులోనూ కొనసాగించేలా పైరవీలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే సంబంధిత గుత్తేదారు మధ్యవర్తుల ద్వారా జీవీఎంసీ ఉన్నతాధికారులను కలిసి చర్చలు జరిపినట్లు సమాచారం. క్లాప్ వాహనాలను పక్కన పెట్టాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించినా, కొందరు జీవీఎంసీ అధికారులకు ఆర్థికంగా ఊతమిస్తున్న గుత్తేదారును కొనసాగించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు సమాచారం.

**కూలీల పేరిట కొల్లగొట్టారు:** రెండేళ్ల కిందట చెత్త సేకరణ చేస్తున్న జీవీఎంసీ కార్మికుల్ని రహదారులు శుభ్రం చేసేందుకు, కాలువల్లో పూడిక తీసేందుకు కేటాయించి, చెత్త సేకరణకు 600 మంది కార్మికులను అదనంగా సమకూర్చారు. ఒక్కో కార్మికుడికి రూ.12 వేలు చొప్పున వేతనం ఇచ్చేందుకు జీవీఎంసీ ఒప్పందం కుదుర్చుకుంది. ఆ టెండర్‌ను అప్పటి ప్రజారోగ్యం విభాగాన్ని పర్యవేక్షించిన ఓ అధికారి సహకారంతో 'క్లాప్ వాహనాల గుత్తేదారు' దక్కించుకున్నారు. అలా ఒక్కో వాహనానికి కార్మికునితో కలిపి రూ.77 వేలు ఇవ్వాల్సి వచ్చేది.

# నిర్మాణ, నిర్వహణ లోపాలతోనే ఎసెన్షియా ప్రమాదం

అనకాపల్లి : అచ్యుతాపురం సెజ్‌లోని ఎసెన్షియా ఫార్మా కంపెనీలో ప్రమాదానికి నిర్మాణ, నిర్వహణ లోపాలే ప్రధాన కారణమని కాలుష్య నియంత్రణ మండలి అధికారులు తేల్చారు. గతేడాది ఆగస్టు 21న జరిగిన ఈ ప్రమాదంలో 17 మంది చనిపోగా, 39 మంది క్షతగాత్రులయ్యారు. ప్రాణనష్టం భారీగా జరగడంతో ఈ ప్రమాదంపై జాతీయ హరిత ట్రైబ్యునల్ (ఎన్జీటీ) సుమోటోగా కేసు నమోదు చేసింది. కేంద్ర కాలుష్యనియంత్రణ మండలిని మొదటి ప్రతివాదిగా చేర్చి తదుపరి విచారణలోగా నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో పీసీబీ అధికారులు ఇటీవల ఎన్జీటీలో తమ పరిశీలన అంశాలతో అఫిడవిట్ దాఖలు చేశారు. అందులో ప్రమాదానికి దారితీసిన పలు కారణాలను వివరించారు. ప్రమాదకర రసాయనాలు వినియోగించి మందులు తయారు చేసినప్పుడు ప్రమాద విశ్లేషణ, ఆపద మదింపు (హజార్డ్ ఎనాలసిస్ రిస్క్ అసెస్‌మెంట్- హర) చేసే ప్రక్రియ చేపట్టాలి. అలాంటిది చేపట్టకుండా రెమిజ్‌పెంట్ సల్ఫేట్ మందు తయారు చేస్తున్నప్పుడే ఈ ప్రమాదం జరిగినట్లు నివేదికలో పేర్కొన్నారు. 'ఈ మందు తయారీలో ఉపయోగించే మిథైల్ టెర్ట్ బ్యూటైల్ ఈథర్ (ఎంటీబీఈ) రసాయనం 200 లీటర్లు పైప్‌లైన్ నుంచి లీకయింది. చాలావరకు ఆవిరిగా మారిపోగా.. కొన్ని చుక్కలు కింది అంతస్తులో ఉన్న విద్యుత్తు స్విచ్‌బోర్డుపై పడడంతో చిన్న నిప్పు రేగి పేలుడు చోటుచేసుకుంది. ఆవిరిగా మారిన రసాయనం బయటకు వెళ్లే అవకాశం లేకపోవడంతో భారీ పేలుడు జరిగి గోడలు, సీలింగ్ కూలిపోయి ఎక్కువ మంది చనిపోయారు'





**ఏడాది ముందే చెప్పినా..**

'ఎసెన్షియా ఫార్మాలో 2023 జులైలో సేఫ్టీ ఆడిట్ జరిగింది. కంపెనీలో వెంటిలేషన్ సమస్య ఉందని, గాలిని బయటకు పంపే పంకాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. వారి సూచనను పట్టించుకోలేదు. ప్రమాద తీవ్రతకు ఇది కూడా ఒక కారణమే. లీకైన ఎంటీబీఈ మొత్తం ఎయిర్ హ్యాండ్లింగ్ డక్ట్‌ల్లో నిండిపోవడంతోనే పేలుడు తీవ్రత భారీస్థాయికి చేరింది. రసాయనాలు లీకైనప్పుడు వాటిని గుర్తించే సాంకేతిక పరికరాలేవీ ఏర్పాటు చేసుకోలేదు. మందుల తయారీకి ముందు రసాయనాలు పైప్‌లైన్‌లో పంపించేటప్పుడు ఒత్తిడి, లీకేజి పరీక్షలు చేయాలి. ఇక్కడ అలాంటి పరీక్షలు జరగలేద'ని నివేదికలో స్పష్టంచేశారు.

# వైకాపా పాపం.. వెన్నాడుతుంది శాపం

నెల్లూరు : సముద్రంలో వేట నిషేధ సమయంలో ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులను ఆదుకునేందుకు అందించే మత్స్యకార భరోసాకు 8 నెలలుగా ఎదురుచూపులు తప్పడం లేదు. అప్పట్లో వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉంది. ప్రభుత్వం జాప్యం చేయడం.. ఇంతలో ఎన్నికల కోడ్ రావడంతో పరిహారం విడుదల కాలేదు.

జిల్లాలో 110 కిలోమీటర్ల పొడవున సముద్రతీరం ఉంది. దీని వెంట ఉన్న గ్రామాలతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన మత్స్యకారులు సముద్రాన్ని నమ్ముకుని జీవిస్తున్నారు. కందుకూరు, కావలి, కోవూరు, సర్వేపల్లి నియోజకవర్గాల పరిధిలో ఉలవపాడు, గుడ్లూరు, కావలి, బోగోలు, అల్లూరు, విడవలూరు, ఇందుకూరుపేట, తోటపల్లిగూడూరు, ముత్తుకూరు, మనుబోలు మండలాలకు చెందిన ప్రాంతాలున్నాయి. 14వేలకు పైగానే మత్స్యకారులు ఉన్నారు. వీరంతా సముద్రంలో వేటకు వెళ్లడం, దొరికిన మత్స్య సంపదను అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. మత్స్యకారులలో ఎక్కువ మంది పేద, మధ్య తరగతి వారే ఎక్కువ. ఏ రోజుకారోజు వేట చేసుకుని పూట గడుపుకొనే పరిస్థితి.

**12,444 మంది బాధితులు**

ప్రతి సంవత్సరం ఏప్రిల్ 15వ తేదీ నుంచి జూన్ 14వ తేదీ వరకు



అంటే 61 రోజుల పాటు వేట నిషేధ%రి%ం ఉంటుంది. ఈ సమయంలో ఉపాధి కోల్పోతున్న మత్స్యకారులకు మత్స్యకార భరోసా పథకం కింద ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున ప్రభుత్వం జీవన భృతి అందిస్తుంది. పరిహారం వేట నిషేధ కాలంలో మే నెలలో అందజేస్తారు. మత్స్యకారుల పేర్ల నమోదు, ఆధార్ తదితర వివరాలు వారి నుంచి తీసుకోవడం, అర్హులను గుర్తించడం, జాబితాలను ప్రచురించడం చేస్తారు. గతేడాది జిల్లాలో మత్స్యకార భరోసా కింద 12,444 మంది మత్స్యకారులను అర్హులుగా గుర్తించారు. వీరికి భృతి కింద డబ్బులు అందజేయాల్సి ఉంది. అప్పట్లో వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉండడం, ఎన్నికల కోడ్ తదితర కారణాల్లో పరిహారం విడుదల కాలేదు. ఇప్పటికే 8నెలలు గడిచింది. పరిహారం విడుదల కాక ఎదురు చూస్తున్నారు. అసలు భృతి డబ్బులు వస్తాయా లేదా అన్న ఆందోళనలో ఉన్నారు. మరో మూడు నెలలు గడిస్తే మళ్లీ వేట నిషేధకాలం వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రభుత్వానికి నివేదించాం- నాగేశ్వరరావు, జిల్లా మత్స్యశాఖ జేడీ**

గతేడాది వేట నిషేధకాలంలో మత్స్యకార భరోసా పథకానికి 12,444 మందిని అర్హులుగా గుర్తించాం. అప్పట్లోనే వివరాలు ప్రభుత్వానికి అందజేశాం. నిధులు మంజూరు కావాల్సి ఉంది.

# 1030 ఎకరాల్లో అటవీ వనాలు

ఆత్మకూరు : జిల్లాలో అటవీ విస్తీర్ణం పెంపుపై ఆ శాఖ దృష్టిసారించింది. ఇప్పటికే ఈ ఆర్థిక సంవత్సరంలో 1030 ఎకరాల్లో మొక్కలు నాటారు. ఒక్క ఆత్మకూరు రేంజి పరిధిలోనే 480 ఎకరాల్లో పూర్తి చేశారు. గ్రీన్‌కో కంపెనీ తన అవసరాల కోసం కర్నూలు జిల్లాలో తీసుకున్న అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా జిల్లాలో కేటాయించారు. అందులో అటవీ జాతి మొక్కలు నాటి.. పెంచుతున్నారు. అనంతసాగరం మండలం కామిరెడ్డిపాడు, అనుమసముద్రంపేట మండలం దూబగుంటల్లో ఎర్రచందనం, తెల్లమద్ది, నేరేడు, వేప, రావి, మర్రి తదితర 12 రకాల మొక్కలను పెంచి.. అడవులుగా



తీర్చిదిద్దుతారు.

**జామాయిల్ నరికివేతకు...**

వీఎస్‌ఎస్‌ల పరిధిలోని జామాయిల్ మొక్కలు కొట్టేందుకూ అటవీశాఖ కార్యాచరణ చేపట్టింది. ఇప్పటికే టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. జిల్లాలో 1,02,000 మెట్రిక్ టన్నుల యూకలిప్టస్ ఉన్నట్లు సమాచారం. వాటిని కొడితే రూ. 80 కోట్లపైనే ఆదాయం వస్తుందని.. అందులో సగం తిరిగి వీఎస్‌ఎస్‌ల అభివృద్ధికే ఖర్చు చేయనున్నట్లు అధికారులు చెబుతున్నారు. ఆత్మకూరు రేంజి పరిధిలో ఇప్పటికే 22 టన్నుల జామాయిల్ కర్ర కొట్టారు. మరో ఏడు వేల టన్నులు సిద్ధంగా ఉంది. సంక్రాంతి తర్వాత కొట్టడం మొదలు పెట్టాలని నిర్ణయించారు. దీనిపై డీఎఫ్‌వో మహబూబ్‌బాషా మాట్లాడుతూ.. ఈ ఏడాది లక్ష్యం మేరకు అటవీ ప్లాంటేషన్ వేశాం. యూకలిప్టస్ చెట్లు కొట్టే ప్రక్రియ సంక్రాంతి తర్వాత చేపడతామని తెలిపారు.

# పాడి రైతుకు పండగ

ఒంగోలు : పాడి పరిశ్రమకు మరింత చేయూతనివ్వడంపై రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం దృష్టి సారించింది. మినీ గోకులం నిర్మాణాలకు పచ్చజెండా ఊపింది. ఇందుకుగాను ఒక్కో యూనిట్‌కు రూ.1.15 లక్షల నుంచి రూ.2.30 లక్షల వరకు కేటాయించింది. వీటిని జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నుంచి మంజూరు చేసింది. గత ఏడాది జులైలో జిల్లాకు మొత్తం 1,075 యూనిట్లు కేటాయించగా.. అంతకుమించి 1,342 షెడ్ల నిర్మాణానికి అధికారులు అనుమతి ఇచ్చారు. మద్దిపాడు నుంచి మొదలు: షెడ్లు నిర్మించుకునేందుకు ఆసక్తి ఉన్న పాడి రైతుల నుంచి తొలుత దరఖాస్తులు స్వీకరించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం చిన్న, సన్నకారు, ఎస్సీ, ఎస్టీ రైతులకు ప్రాధాన్యమిచ్చారు. జిల్లా వ్యాప్తంగా 458 మంది ఇప్పటికే నిర్మాణాలు పూర్తి చేయగాబీ మిగతావి పలు దశల్లో ఉన్నాయి. వీటిని ఈ నెలాఖరుకల్లా పూర్తి చేసేలా అధికారులు కార్యాచరణ రూపొందించారు. రాష్ట్ర పంచాయతీరాజ్‌శాఖ ఆదేశాల మేరకు పూర్తయిన షెడ్లను ఈ నెల 12వ తేదీ వరకు ప్రారంభించనున్నారు. అందులో భాగంగా మద్దిపాడులో నిర్మించిన గోకులాన్ని మంత్రి స్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఎమ్మెల్యే బీఎన్.విజయ్ కుమార్ శుక్రవారం ప్రారంభిస్తారు.

# కప్పం కట్టు.. బరులు పెట్టు

కప్పం : ఒక పక్క కోడిపందేలు నిర్వహిస్తే ఊరుకోనే ప్రసక్తే లేదని పోలీసులు హెచ్చరిస్తున్నారు. మరో పక్క కళ్లెదుటే బరులు, పందెం కోళ్లు కత్తికట్టి కాలు దువ్వడానికి సిద్ధమవుతున్నాయి. ఉమ్మడి జిల్లాలో నెలరోజుల నుంచి అడపాదడపా వేర్వేరు చోట్ల ఓ మాదిరి పందేలు జరుగుతున్నా పోలీసులు కిమ్మనడం లేదు. సంక్రాంతి సంప్రదాయం ముసుగులో పొలాలు, స్థిరాస్తి వెంచర్లను చదును చేసి మరీ బరులకు ఏర్పాట్లు చేస్తున్నారు. నిర్వాహకులు వేలం పాటలు నిర్వహించి మరీ జూదాల వారీగా అప్పగిస్తున్నారు.

**మధ్యవర్తిత్వాలతో..**

వీరవాసరం మండలంలో ఏడెకరాల్లో అతిపెద్ద బరిని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేసినట్లు తెలిసింది. వద్దంటూ ఒకరిద్దరు హైకోర్టును ఆశ్రయించగా, పార్టీలకతీతంగా పెద్దలు రంగంలోకి దిగి మధ్యవర్తిత్వం చేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఆచంటలో గతేడాది కంటే ఈ సారి బరుల సంఖ్య పెరగడంతోపాటు విస్తీర్ణం మరింత పెంచుతున్నారు. ఇటీవల పెనుమంట్ర మండలంలోని ఓ గ్రామంలో బరుల నిర్వాహకులు, పందెంరాయుళ్లకు విందు భోజనాలు ఏర్పాటుచేసి మరీ వారికి ఆహ్వానాలు పలికారు. ఉమ్మడి జిల్లాలో ప్రతి రెండు గ్రామాలకు ఒకటి వంతున బరులు సిద్ధం చేసేందుకు ఇప్పటికే చకచకా ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ మేరకు రాజకీయ నేతల అండదండలతో నిర్వాహకులు చక్రం తిప్పుతున్నారు. మొత్తంగా ఉమ్మడి జిల్లాలో 500పైగా బరులు సిద్ధం అవుతున్నాయని అంచనా.

**ఫ్లడ్‌లైట్ల వెలుగులో..** ఉమ్మడి జిల్లాలోని పలు ప్రాంతాల్లో ఇప్పటికే జోరుగా కోడి పందేలు సాగుతున్నాయి. మొన్న భీమవరం, సీసలి, పెదఅమిరం, నిన్న ఎన్.ఆర్.సి.అగ్రహారం, మహాదేవపట్నం



ప్రాంతాల్లోని ఖాళీ జాగాల్లో ఫ్లడ్‌లైట్ల వెలుతురులో రాత్రి 10 నుంచి 2 గంటల మధ్య పందేలు నిర్వహించారు.

**అభివృద్ధి పేరుతో వేలం పాటలు..** ఆయా ప్రాంతాల్లో అభివృద్ధి పనుల పేరిట వేలం పాటలు నిర్వహించి, హెచ్చు పాటదారులకు బరులు అప్పగిస్తున్నారు. బరుల పరిమాణం, రాబడిని బట్టి మధ్యవర్తులు భారీ మొత్తంలో వసూలు చేస్తున్నారని సమాచారం. గతంలో భోగి, సంక్రాంతి, కనుమ, ముక్కనుమ నిర్వహిస్తే ఈసారి అదనంగా మరో రెండు రోజులు ఆడించేందుకు సిద్ధమవుతున్నారు. దీనిపై నిర్వాహకులు ఇప్పటికే ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలోని ఉన్నతాధికారులను కలిసి ముట్టచెప్పినట్లు తెలిసింది. గతేడాది కంటే ఈ ఏడాది బరుల సంఖ్య పెరగడంతో భారీ మొత్తంలో చేతులు మారే అవకాశం ఉందని పందెం రాయుళ్లు చెబుతున్నారు.

**విడిది కోసం ప్రత్యేక ఏర్పాట్లు..** జిల్లాలో నిర్వహించే కోడి పందేల్లో పాల్గొనేందుకు గోదావరి జిల్లాలతో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక, ఒడిశా తదితర రాష్ట్రాల నుంచి పెద్ద ఎత్తున తరలివస్తారు. ఇప్పటికే భీమవరం, ఆకివీడు, పాలకొల్లు, నరసాపురం, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, ఏలూరు, కైకలూరు, నూజివీడు తదితర పట్టణాల్లోని లాడ్జిల్లో గదులన్నీ నిండిపోయాయి. నేటి నుంచి స్కూళ్లకు సంక్రాంతి సెలవులు, శనివారం నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు సెలవులు కావడంతో జిల్లాకు పెద్ద సంఖ్యలో పందెం రాయుళ్లు రానున్నారు. వచ్చిన వారికి ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఆయా ప్రాంతాల్లో అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు.

# వన్నెతగ్గిన పాలిష్

బనగానపల్లి : గత కొన్ని నెలలుగా నాపరాతి బండల ఎగుమతులు ఆగిపోయాయి.. పోర్టుల్లో వేల టన్నుల సరకు పేరుకుపోయింది.. దీంతో పరిశ్రమల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. పరిశ్రమల్లో పనిలేక కార్మికులకు ఉపాధి కొరవడింది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో 900 వరకు నాపరాతి బండలను పాలిష్ చేసే పరిశ్రమలు ఉన్నాయి. అలాంటి పరిశ్రమలు ఒక్క బేతంచెర్లలోనే సుమారు 400 వరకు ఉన్నాయి. గనుల్లో తీసిన నాపరాళ్లను పరిశ్రమలకు తీసుకెళ్లి పాలిష్ చేస్తారు.. వాటిని వివిధ రకాల సైజులుగా మార్చి ఎగుమతికి సిద్ధం చేస్తారు. కంటెయినర్లలో కాకినాడ, చెన్నై, కృష్ణపట్నం పోర్టులకు తరలిస్తారు.. అక్కడి నుంచి నౌకల్లో బ్రిటన్, కెనడా, అమెరికా వంటి 18 దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. అంతర్జాతీయ మార్కెట్లో డిమాండ్ లేకపోవడంతో టన్నుల మేర సరకు పోర్టుల్లో నిలిచింది.



**పరిశ్రమలకు తాళం**

గతంలో నిత్యం 90 నుంచి 100 కంటెయినర్లలో ఎగుమతి చేసేవారు.. ప్రస్తుతం 10 వాహనాలు కూడా వెళ్లడం లేదు. ఓ కంటెయినర్‌లో 28 టన్నుల పాలిష్ బండలు ఉంటాయి.. వాటి విలువ రూ.3 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు ఉంటుంది. ఒకప్పుడు నిత్యం 2,800 టన్నుల సరకు పోర్టులకు వెళ్లేది. అక్కడి నుంచి నిత్యం ఐదువేల టన్నుల సరకు వివిధ దేశాలకు ఎగుమతి అయ్యేది. ప్రస్తుతం గిరాకీ లేక ఏజెంట్లు ఖాళీగా ఉంటున్నారు. నిత్యం రూ.3 కోట్లు అంటే నెలకు రూ.30 కోట్ల వ్యాపారం పడిపోయింది. "పాలిష్ పరిశ్రమలు బతకాలంటే ప్రభుత్వం రాయితీ కల్పనతో పాటు రాయల్టీ తగ్గించాలి.. గత మూడేళ్లుగా వ్యాపారాలు పడిపోయాయి.. ఈ ఏడాది మరింత తగ్గాయి.. కూలీలకు ఉపాధి కల్పించలేకపోతున్నాం.. ఇప్పటికే పలువురు పరిశ్రమలకు తాళం వేశారు.. గుజరాత్‌లో చౌకగా దొరకడంతో ఈ పరిస్థితి వచ్చిందని" పరిశ్రమ యజమాని కార్తీక్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

# లైనింగ్ వద్దు.. విస్తరణ ముద్దు



అనంతపురం: శ్రీశైలం నుంచి వీలైనంత ఎక్కువ నీటిని తీసుకోవాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం హంద్రీనీవా విస్తరణ, లైనింగ్ పనులకు శ్రీకారం చుట్టింది. ఫేజ్-1లో జీడిపల్లి జలాశయం వరకు కాలువ విస్తరణ, ఫేజ్-2లో జీడిపల్లి నుంచి శ్రీసత్యసాయి-అన్నమయ్య జిల్లా సరిహద్దు వరకు లైనింగ్ పనులు చేపట్టాలని నిర్ణయించింది. అయితే ఫేజ్-2లో లైనింగ్ పనులను జిల్లా రైతులు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ప్రధాన కాలువకు లైనింగ్ చేస్తే భూగర్భ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లైనింగ్ పనుల్ని టెండరు దశలోనే నిలిపివేయాలని ప్రజాప్రతినిధులపై ఒత్తిడి తెస్తున్నారు. ఇప్పటికే రైతులు, రైతు సంఘాలు హంద్రీనీవా కార్యాలయం వద్ద నిరసనలు వ్యక్తం చేశారు. లైనింగ్ పనులు చేస్తే ప్రయోజనం లేకపోగా రైతులకు మరింత నష్టం వాటిల్లుతుందని వివరిస్తున్నారు. ప్రభుత్వం పునరాలోచించాలని కోరుతున్నారు.

**హంద్రీనీవాతో మారిన రూపురేఖలు**

ఉమ్మడి జిల్లాలో 1.80 లక్షల ఎకరాలకు సాగునీరు లక్ష్యంతో నిర్మించిన హంద్రీనీవా 312 కిలోమీటర్ల మేర విస్తరించి ఉంది. 2014లో ఫేజ్-1కు, 2016లో ఫేజ్-2కు శ్రీశైలం నుంచి నీటిని విడుదల చేశారు. డిస్టిబ్యూటరీల నిర్మాణం పూర్తికాకపోవడంతో ఇంకా ఆయకట్టు స్థిరీకరణ జరగలేదు. కానీ, ప్రధాన కాలువలో మోటార్లు ఏర్పాటు చేసుకుని పంటలు పండిస్తున్నారు. భూగర్భ జలాలు పెరగడంతో వేలాదిమంది రైతులు బోర్లు వేసుకున్నారు. గుంతకల్లు, ఉరవకొండ, రాప్తాడు, పుట్టపర్తి, ధర్మవరం, కదిరి నియోజకవర్గాల్లో భూగర్భ జలాలు పెరగడంతో సాగు విస్తీర్ణం పెరిగింది. ఫలితంగా పదేళ్లలో ఉమ్మడి జిల్లాలో వ్యవసాయ రూపురేఖలు మారిపోయాయి. ఇప్పుడు ప్రభుత్వం మంచి ఉద్దేశంతోనే లైనింగ్ పనులు చేపట్టినా.. భూగర్భ జలాలు తగ్గిపోయి రైతులకు నష్టం వాటిల్లుతుందని కూటమి ప్రజాప్రతినిధులు సైతం వ్యతిరేకిస్తున్నారు.

**భవిష్యత్తులో ఇబ్బంది రాకూడదని..**

శ్రీశైలం నుంచి 3,500 క్యూసెక్కుల నీటిని తీసుకునేలా హంద్రీనీవా ప్రధాన కాలువ నిర్మాణం చేపట్టారు. కాలువ పటిష్ఠంగా లేకపోవడంతో 1,100 క్యూసెక్కులకు మించి తీసుకోలేపోతున్నాం. తలుపుల మండలంలోని పుంగనూరు బ్రాంచి కెనాల్‌కు వచ్చేసరికి ప్రవాహ 200 క్యూసెక్కులకు తగ్గిపోతోంది. నీటి నష్టాలను అరికట్టాలంటే లైనింగ్ ఒకటే పరిష్కారమని ప్రభుత్వం భావిస్తోంది. అయితే కాలువ విస్తరణ చేపట్టకుండా లైనింగ్ పూర్తి చేస్తే భవిష్యత్తులో ఇక విస్తరణ పనులు చేసేందుకు వీలుండదని రైతు సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. ఫేజ్-2లోనూ విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేస్తున్నాయి.

**రైతులకు నష్టం తెచ్చే పనులు చేయం - పయ్యావుల కేశవ్, రాష్ట్ర ఆర్థిక మంత్రి**

కూటమి ప్రభుత్వం హంద్రీనీవాను పూర్తిచేయాలనే సంకల్పంతో ముందుకెళ్తోంది. అందులో భాగంగానే మొదటి బడ్జెట్‌లోనే భారీగా నిధులు కేటాయించాం. ఫేజ్-1లో విస్తరణ, ఫేజ్-2లో లైనింగ్ పనులు చేపట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. అయితే లైనింగ్ పనులు చేపడితే భూగర్భ జలాలు తగ్గిపోతాయని జిల్లా రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లైనింగ్‌పై ప్రభుత్వానికి మా అభ్యంతరం వ్యక్తం చేశాం. దీంతో స్పందించిన సీఎం చంద్రబాబు తదుపరి ఆదేశాలు వచ్చేవరకు ప్రక్రియను నిలిపివేసేలా నీటిపారుదలశాఖకు సూచించారు. రైతులకు నష్టం చేకూర్చే పనులను ఎట్టిపరిస్థితుల్లో చేపట్టబోం.

**విస్తరణతోనే రైతులకు మేలు - పరిటాల సునీత, రాప్తాడు ఎమ్మెల్యే**

హంద్రీనీవా జలాలు వచ్చిన తర్వాత ఆత్మకూరు, కనగానపల్లి, రామగిరి, చెన్నేకొత్తపల్లి మండలాల పరిధిలో భూగర్భ జలాలు పెరిగాయి. వేలాదిమంది రైతులు బోర్లు వేసుకుని పంటలు సాగుచేస్తున్నారు. ప్రధాన కాలువకు లైనింగ్ పనులు చేయడంపై ప్రభుత్వ ఉద్దేశం మంచిదే అయినప్పటికీ భూగర్భ జలాలు తగ్గిపోయే ప్రమాదం ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో లైనింగ్ కంటే విస్తరణతోనే మరింత మేలు జరుగుతుందని ప్రభుత్వానికి విన్నవించాం. విషయాన్ని నీటిపారుదలశాఖ మంత్రి నిమ్మల రామానాయు డు దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం లైనింగ్ నిర్ణయంపై పునరాలోచించాలి.

# జీర్ణకోశవ్యాధుల విభాగానికి గ్రహణం



అనంతపురం : ఉమ్మడి అనంతపురం జిల్లాతో పాటు పక్క జిల్లాలకు కూడా వరంగా ఉన్న సూపర్‌స్పెషాలిటీ వైద్యశాలలో జీర్ణకోశవ్యాధుల(మెడికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ) విభాగానికి సంబంధించి ప్రభుత్వం వైద్యులను నియమించకపోవటంతో విభాగం తలుపులు కూడా తీయని పరిస్థితి నెలకొంది. దీంతో రూ.కోట్లు విలువ చేసే వైద్యసామగ్రి నిరుపయోగంగా మారింది. వైద్యులను నియమించేందుకు చర్యలు చేపట్టాల్సిన పాలకులు, అధికారులు నిర్లక్ష్యంగా ఉండటంతో జీర్ణకోశవ్యాధుల విభాగానికి గ్రహణం పట్టింది.

**రూ.కోట్లు విలువైన యంత్రాలు నిరుపయోగం**

జీర్ణకోశవ్యాధుల విభాగంలో రూ.కోట్లు విలువ చేసే వైద్యసామగ్రి ఏళ్ల తరబడి వృథాగా మారిపోయింది. ఇందులో భాగంగా కడుపులో అల్సర్‌లు, గ్యాస్ట్రబుల్, పేగు సమస్యలు వంటి వాటిని గుర్తించేందుకు వీడియోఎండోస్కోపీ యంత్రాన్ని వినియోగిస్తారు. ఈ యంత్రం రూ.55 లక్షలు పెట్టి కొనుగోలు చేసి సూపర్‌స్పెషాల్టీ వైద్యశాలకు పంపారు. ప్రస్తుతం నిరుపయోగంగా మారింది. ఎండోస్కోపీ పరీక్ష ప్రైవేట్‌గా చేయించుకోవాలంటే రూ.3 వేల నుంచి రూ.12 వేల వరకు ఖర్చు చేయాల్సి ఉంటుంది. లివర్ ఫంక్షన్ వివరాలను తెలుసుకునేందుకు రూ.1.50 కోట్లు విలువ చేసే ఫైబ్రోస్కాన్ యంత్రాన్ని కొనుగోలు చేశారు. ఈ యంత్రం అనంతపురంలోని రెండు ప్రైవేట్ ఆసుపత్రుల్లో మాత్రమే అందుబాటులో ఉంది. సదరు పరీక్షను ప్రైవేట్‌గా చేయించుకోవాలంటే రూ.4 వేలు అవుతుంది. లివర్ ఫంక్షన్‌కు సంబంధించి రక్తపరీక్షలు (హెచ్‌బీఎస్‌ఏజీ) చేయించుకునేందుకు లక్ష కిట్లు అందుబాటులో ఉన్నాయి. ఈ కిట్లన్నీ ఈ ఏడాది ఆఖరుకు సమయం ముగిసే పరిస్థితి ఉంది.


**ఏపీ సేవలందించాలంటే..**

జీర్ణకోశవ్యాధులకు సంబంధించిన విభాగంకు సూపర్‌స్పెషాల్టీ వైద్యశాలలో 21 పడకలు కేటాయించారు. ఓపీ సేవలు అందించేందుకు ప్రత్యేక గదులు కేటాయించారు. 2022 మార్చి 18న వైద్యశాలను ప్రారంభించారు. కడుపునొప్పి, కడుపులో మంట, ఆకలి లేకపోవటం, శరీరంలో వికారం గ్యాస్ట్రబుల్, పేగు వ్యాధులు, జాండీస్, మూత్రవిసర్జనలో సమస్యలు వంటి వాటికి వైద్యసేవలు అందించాలి. ఈ సేవలకు సంబంధించి ప్రైవేట్ ఆసుపత్రుల్లో ఓపీ సేవలు పొందాలంటే ఒక్కొక్కరితో రూ.500 కన్సల్టేషన్ ఫీజు కింద వైద్యులు వసూలు చేస్తున్నారు. అలాగే ప్రైవేట్ వైద్యులు రాయించే పరీక్షలు చేయించుకోవాలంటే రూ.వేలల్లో ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఉంది. ఈ విషయంపై ప్రభుత్వ సర్వజన వైద్యశాల సూపరింటెండెంట్ వెంకటేశ్వరరావును వివరణ కోరగా సూపర్‌స్పెషాల్టీ వైద్యశాలలో జీర్ణకోశవ్యాధుల విభాగానికి వైద్యులను కేటాయించాలని డీఎంఈ దృష్టికి తీసుకెళ్లాం. వైద్యులు వస్తే ఓపీ, ఐపీ సేవలను ప్రారంభిస్తామని తెలిపారు.

# పండగ వేళ.. ప్రైవేటు దందా!

విశాఖపట్నం : సంక్రాంతి వేళ కొన్ని ప్రైవేటు బస్సుల యజమానులు టికెట్ల ధరలు పెంచేశారు. ప్రయాణికుల డిమాండును ఆసరాగా చేసుకొని మూడింతలు పెంచి దోచేస్తున్నారు. హైదరాబాద్, విజయవాడ, చెన్నై, బెంగళూరు నుంచి ఉత్తరాంధ్ర జిల్లాల్లోని స్వస్థలాలకు వచ్చేవారు అధికం. దీంతో పండగ సమీపంచే కొద్దీ ధరలు పెంచుకుంటూ పోతున్నారు. ఈనెల 10, 11 తేదీల్లో హైదరాబాద్ నుంచి విశాఖకు వచ్చేందుకు ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో సీట్లు లేవు. తెలంగాణ ఆర్టీసీ బస్సుల్లో పరిమితంగా ఉన్నాయి. దీంతో కొన్ని ప్రైవేటు ట్రావెల్స్ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ఓ ట్రావెల్స్ బస్సులో హైదాబాద్ నుంచి విశాఖకు సాధారణ రోజుల్లో రూ.3 వేలుండే టికెట్ ప్రస్తుతం రూ.6,000లకు పెంచి విక్రయిస్తున్నారు.

సాధారణ రోజుల్లో హైదరాబాద్ నుంచి విశాఖకు రూ.1500 ఉండే నాన్ ఏసీ స్లీపర్ బస్సు టికెట్ ధర రూ.3,500 నుంచి రూ.4 వేలకు పెంచేశారు. నాన్‌ఏసీ బస్సుల్లో రూ.1200 టికెట్ రూ.2500కు పెంచారు. సాధారణ రోజుల్లో విజయవాడ నుంచి విశాఖ వచ్చే ఏసీ బస్సుల్లో టికెట్ ధర రూ.1500 ఉంటే...దానిని రూ.3 వేలుకు పెంచేశారు. సాధారణ బస్సుల్లో రూ.800 నుంచి రూ.2 వేలకు పెంచి ఆన్‌లైన్‌లో ఉంచారు. రవాణాశాఖ దృష్టేది: పండగ రద్దీ నేపథ్యంలో ప్రైవేటు ట్రావెల్స్ దందాపై రవాణాశాఖ దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. అధిక ధరలు, అదనపు సీట్లు, కాంట్రాక్టు క్యారేజ్ పర్మిట్లు తీసుకొని నిబంధనలు ఉల్లంఘించి తిరుగుతున్న వాటిపై కన్నేయాలి. కొందరు అనుమతి లేని బస్సులను రోడ్డెక్కిస్తుంటే..మరికొందరు సరైన ఫిట్‌నెస్ లేనివాటినీ



తిప్పుతున్నట్లు సమాచారం. **ప్రత్యేక బృందాలతో తనిఖీలు:** 'ట్రావెల్ బస్సుల ఉల్లంఘనలపై తనిఖీలు ప్రారంభించాం. 13వ తేదీ వరకు కూర్మన్నపాలెం, ఎన్‌ఏడీ వద్ద రెండు బృందాలు విశాఖ వచ్చే బస్సులను తనిఖీ చేస్తాయి. అలాగే 15 నుంచి 18వ తేదీ వరకు విశాఖ నుంచి బయలుదేరే వాటినీ తనిఖీ చేస్తాం. నిబంధనలు అతిక్రమించిన వారి మీద కఠిన చర్యలు తీసుకుంటాం' అని ఆర్టీవో రామ్‌కుమార్ పేర్కొన్నారు.

# పది విద్యార్థులకు ప్రత్యేక పాఠం

కర్నూలు : ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పదో తరగతి విద్యార్థులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది.. జిల్లాలో ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉంది.. ముఖ్యంగా పశ్చిమ ప్రాంతంలో పలు పాఠశాలల్లో బోధన ఉపాధ్యాయుల్లేక విద్యార్థులు ఇబ్బంది పడుతున్నారు.. దీన్ని గమనించి ప్రయోగాత్మకంగా వర్చువల్ బోధనకు శ్రీకారం చుట్టారు. కలెక్టర్ రంజిత్ బాషా ప్రత్యేక చొరవ తీసుకొని నగరపాలక సమావేశ భవన పైభాగంలో విశాలమైన గదిని కేటాయించారు. అక్కడ వర్చువల్ లెర్నింగ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ రిసోర్సు నెట్వర్క్ (వీ-లెర్న్) కావాల్సిన ఏర్పాట్లు చేశారు. ఇక్కడ ఉపాధ్యాయులు బోధిస్తే ఒకేసారి 352 పాఠశాలల్లోనివిద్యార్థులు పాఠాలు వింటున్నారు.

**యూట్యూబ్‌లో పాఠాలు**

వర్చువల్ తరగతి గదిలో బోధించిన పాఠాలను వీడియో రికార్డింగ్ చేయిస్తున్నారు. వాటిని ప్రధానోపాధ్యాయుల జీ-మెయిల్‌కు పంపడంతోపాటు విద్యాశాఖ రూపొందించిన యూట్యూబ్‌లోనూ అప్‌లోడ్ చేస్తారు. యూట్యూబ్‌ను అధికారికంగా విడుదల చేయాల్సి ఉంది.

**352 పాఠశాలలు.. 14,600 మంది విద్యార్థులు**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో 38 వేల మంది వరకు పదో తరగతి చదువుతున్నారు. వర్చువల్ తరగతులు వినడానికి ఉపాధ్యాయుల కొరత ఉన్న 352 పాఠశాలలను ఎంపిక చేశారు. ఇవి పశ్చిమ ప్రాంతంలో ఎక్కువగా ఉన్నాయి. హిందీ ఉపాధ్యాయుల కొరత ఎక్కువగా ఉంది. ఈ సబ్జెక్టుపై ప్రధానంగా దృష్టి సారించారు. గతేడాది సాంఘిక



శాస్త్రంలో చాలామంది ఫెయిల్ కావడంతో ఈసారి ప్రత్యేక దృష్టి సారించారు. గణితం, సైన్సు సబ్జెక్టుల్లో పట్టులేని విద్యార్థులకు వర్చువల్ పద్ధతిలో ప్రత్యేక తరగతులు నిర్వహిస్తారు.

సి, డి గ్రేడ్‌లో ఉన్న విద్యార్థులు 40 నుంచి 50 మార్కులు తెచ్చుకునేలా పాఠ్యాంశాలను సులువైన పద్ధతిలో బోధించడంతోపాటు వీడియో చిత్రీకరణ చేస్తున్నారు.

**నిత్యం గంట పాటు బోధన**

వర్చువల్ బోధనకు మొదట సాంకేతిక ఇబ్బందులు ఎదురయ్యాయి.. ఇంటర్‌నెట్ సరిగా లేకపోవడంతో వీడియో సరిగా రాక.. మాటలు పూర్తి స్థాయిలో వినిపించేవి కావు. ఏపీ ఫైబర్‌నెట్ ఫ్రీక్వెన్సీ పెంచడంతో సమస్య తీరింది. విద్యా నిపుణులు నిత్యం సాయంత్రం 3 నుంచి 4 గంటల మధ్య వర్చువల్ గదిలో పాఠాలు బోధిస్తారు.. ఎంపిక చేసిన పాఠశాలల్లో విద్యార్థులు వింటారు. ఆ రోజు ఏ పాఠం బోధిస్తారు.. ఎవరు బోధిస్తారో ముందుగానే సమాచారం ఇస్తారు.

సాయంత్రం బోధించిన పాఠ్యాంశాలకు సంబంధించి మరుసటి రోజు బడికి వచ్చిన విద్యార్థులకు పరీక్ష నిర్వహిస్తారు. ఇందులో వచ్చిన మార్కుల ఆధారంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్నారు. ప్రధానోపాధ్యాయులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.

# ఒప్పందానికి పొగ

నందికొట్కూరు : పొగాకు సాగు చేస్తే మంచి ధర ఇస్తామని కంపెనీలు నమ్మించాయి.. వాతావరణ పరిస్థితులను తట్టుకొని రైతులు పంటను కాపాడారు.. చేతికొచ్చింది.. కొనుగోలుకు వెళ్తే కొర్రీలు పెడుతున్నారు.. 'తేమ' పేరుతో పొగ పెడుతున్నారు. రైతులకు అనువుగా లేని దూర ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశారు. అష్టకష్టాలుపడి అక్కడికి బేళ్లను తీసుకెళ్తే ధరలు తగ్గించేస్తున్నారు. కొన్ని బేళ్లను కొని మిగిలినవి వెనక్కి పంపిస్తున్నారు. వాటిని విక్రయించేందుకు మళ్లీ టోకెన్ వచ్చే వరకు వేచి ఉండాల్సి వస్తోందని రైతులు వాపోతున్నారు.

**సాగు చేసిన రకాలు** బర్లీ (సిగరెట్) వీఐఎన్-5, వీబీహెచ్-3, రుస్టిక (బీడీ) ఏ-119 రకాలతోపాటు నాగు పొగాకు మరికొన్ని చోట్ల ఫ్లూ క్యూర్డ్ వర్జీనియాఎకరాకు పెట్టుబడి: రూ.40 వేలు రూ.50 వేలు దిగుబడి(ఎకరాకు): 7-12 క్వింటాళ్లు

**అమాంతం పెరిగిన సాగు**గతేడాది కంపెనీలు క్వింటా పొగాకుకు రూ.15 వేల వరకు చెల్లించాయి. బయట రూ.20 వేల వరకు ధర పలికింది. ఈ ఏడాది క్వింటా రూ.18 వేలు ఉంటుందన్న ఆశతో చాలామంది దీనిని సాగు చేశారు. ఈ ఏడాది అన్నదాతల ఉత్సాహాన్ని చూసి పలు కంపెనీలు విత్తనం ఇచ్చి ప్రోత్సహించాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాలో గతేడాది కంటే 40 వేల ఎకరాలు అదనంగా సాగైంది. ఒక్క నందికొట్కూరు నియోజకవర్గంలోనే 10 వేల ఎకరాల్లో పంట వేశారు. పొగాకు సాగు చేసిన వారిలో ఎక్కువ మంది కౌలు రైతులే ఉన్నారు.. పొలం రకాన్ని బట్టి ఎకరాకు రూ.10 వేల నుంచి రూ.18 వేల వరకు కౌలు చెల్లించారు.

**కొర్రీలు పెట్టి కొసరంత కొని**తేమ 8 శాతం ఉంటే క్వింటాకు రూ.15,500 చెల్లించాలని కంపెనీలు నిర్ధారించాయి. ప్రస్తుతం పంట చేతికొచ్చింది. రకాన్ని బట్టి క్వింటా రూ.12 వేల నుంచి రూ.15,500 వరకు ధర చెల్లిస్తున్నాయి. స్థానికంగా కొనుగోలు కేంద్రాలున్నా సరే కంపెనీలు చెప్పినచోటే విక్రయించాలి. సుదూర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కేంద్రాలకు వెళ్తే మొత్తం దిగుబడులు కొనకుండా కొర్రీలు పెడుతుండటంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. "నాణ్యత సరిగా లేదు.. తేమ ఎక్కువగా ఉందంటూ కొర్రీలు పెడుతున్నారు. ఆకు పూర్తిగా ఎండిన తర్వాతే తీసుకురావాలని వెనక్కి పంపిస్తున్నారు.. రూ.13 వేలకు మించి ఇవ్వడం లేదని" రైతులు వాపోతున్నారు. తేమ లేకుండా ఉన్న వాటికే టోకెన్ ఇస్తున్నారు.

నమ్మకం లేక తక్కువ సాగుచేశా

ఫక్కీరన్న, చౌట్కూరు, మిడుతూరు

పంట సాగుచేస్తే మేమే కొంటామని కంపెనీ ప్రతినిధులు చెప్పారు. నేను బీడీలకు వచ్చే సూరు పొగాకును సాగు చేసుకున్నా. దీన్ని వ్యాపారి ఇంటి వద్దకొచ్చి కొంటారు. చుక్క బర్లీ పొగాకు వేస్తే బేళ్లు తయారు చేసుకుని కంపెనీ ఎక్కడికి చెబితే అక్కడికి తీసుకెళ్లాలి. ఈ కష్టాలన్నీ ఉంటాయనే నేను రెండెకరాల్లో మాత్రమే పంటను సాగుచేశా. దానిని విక్రయించేందుకు తీసుకొచ్చా. కిలో రూ.134 ధర వేశారు. అదే సూరు పొగాకు అయితే పుట్టి రూ.40 వేల వరకు ఉంది. ఎకరాకు 4- 5 పుట్లు అవుతుంది. శ్రమ కూడా ఉండదు. కంపెనీ మాటలు వింటే రైతులకు నష్టమే మిగులుతోంది.




## ఇప్పటికీ 25 ఏళ్ల అమ్మాయిలా 40 వయసు నటి!

సాహో లాంటి భారీ యాక్షన్ చిత్రంలో పాన్ ఇండియన్ స్టార్ ప్రభాస్ సరసన నటించింది శ్రద్ధా కపూర్. అంతకుముందు బాలీవుడ్‌లో ఆషిఖీ 2, ఏక్ విలన్ సహా పలు విజయవంతమైన చిత్రాల్లో నటించిన శ్రద్ధాకు అసాధారణ ఫాలోయింగ్ ఏర్పడిన సంగతి తెలిసిందే. సోషల్ మీడియాల్లో చాలా మంది అగ్ర హీరోలను మించిన ఫాలోయింగ్ ని శ్రద్ధా ఆస్వాధిస్తోంది. శ్రద్ధా ప్రస్తుతం బాలీవుడ్ టాలీవుడ్‌లో పలువురు అగ్ర హీరోల సరసన నటించేందుకు సంతకాలు చేస్తోందని కథనాలొస్తున్నాయి. హృతిక్ రోషన్ క్రిష్ 4లో శ్రద్ధా కథానాయికగా నటించనుందని కథనాలొచ్చాయి. తదుపరి యంగ్ టైగర్ ఎన్టీఆర్ నటిస్తున్న వార్ 2లో నటించనుందని గుసగుసలు వినిపిస్తున్నాయి. ఎన్టీఆర్, హృతిక్ లతో కలిసి స్పెషల్ నంబర్ లో శ్రద్ధా నర్తిస్తుందని కూడా టాక్ వినిపిస్తోంది. ఇంతకుముందు పుష్ప 2లో ఐటమ్ నంబర్ కోసం సంప్రదించినా అప్పట్లో కాదని అనుకుంది.




కానీ ఇప్పుడు ఎన్టీఆర్ తో స్పెషల్ నంబర్ కోసం ఓకే చెప్పిందని గుసగుసలు వినిపిస్తున్నాయి. స్త్రీ 2 లాంటి బ్లాక్ బస్టర్ లో నటించిన శ్రద్ధా ఆచితూచి కథలు, పాత్రలను ఎంపిక చేసుకుంటోంది. ఇప్పటివరకూ తన తదుపరి పెద్ద సినిమా గురించి వివరాల్ని వెల్లడించలేదు. మరోవైపు శ్రద్ధా వరుస ఫోటోషూట్లు ఇంటర్నెట్ ని షేక్ చేస్తున్నాయి. తాజాగా ప్రముఖ మ్యాగజైన్ %-%ది నాడ్%-% కవర్ పేజీపై రెబల్ క్వీన్ లుక్ లో శ్రద్ధా అద్భుతంగా కనిపించింది. ఈ బ్యూటీ బ్లాక్ బ్లేజర్ లో స్ట్రైకింగ్ ఫోజులతో కట్టి పడేస్తోంది. ముఖ్యంగా తన పొడుగు కాళ్ల సొగసును ఆవిష్కరిస్తూ బోల్డ్ గా ఇచ్చిన ఫోజ్ యువతరంలోకి దూసుకెళుతోంది. ది నాడ్ మ్యాగజైన్ ప్రత్యేక కథనంలో శ్రద్ధా ప్రతిభ గురించి ప్రశంసలు కురిపించింది. ఈ ఫోటోషూట్ పై ప్రశంసలు కురుస్తున్నాయి. శ్రద్ధా వయసు 40 దాటుతోంది కానీ ఇప్పటికీ ఆమె బాలీవుడ్‌లో భారీ మేకప్ వేసుకునే 90 శాతం మంది నటీమణుల కంటే చాలా బాగుంటుందని %-%ది నాడ్%-% మ్యాగజైన్ స్టిల్ పై ప్రశంసలు కురిపిస్తున్నారు. శ్రద్ధా ఎప్పటికీ తన స్టార్‌డమ్‌ను అలాగే కొనసాగిస్తుంది... తక్కువ సినిమాలు చేస్తుంది కానీ అవి పెద్ద హిట్లుగా మారతాయి. శ్రద్ధా కపూర్ ప్రజాదరణను మరింత పెంచుతాయి. ప్రస్తుతం స్త్రీ 2 ఘనవిజయం తర్వాత కెరీర్ పరంగా శిఖరాగ్రంలో ఉంది.. అని అభిమానులు ప్రశంసిస్తున్నారు. శ్రద్ధా ఇప్పటికీ 25 ఏళ్ల అమ్మాయిలా కనిపిస్తుందని ఒక నెటిజన్ ఈ ఫోటో చూశాక కామెంట్ చేసారు.

## స్టన్నింగ్ జ్యోతి.. అందమే అసూయ పడేలా..

జగతి మేడమ్.. అలియాస్ జ్యోతి పూర్వాజ్ గురించి తెలుగు బుల్లితెర ఆడియన్స్ లో తెలియని వారుండరని చెప్పడంలో ఎలాంటి డౌట్ అక్కర్లేదు. హైయెస్ట్ టాప్ రేటింగ్ తో కొన్నాళ్ల పాటు సీరియల్ ప్రపంచాన్ని ఏలిన గుప్పెడంత మనసు ద్వారా తెలుగు ప్రజలకు పరిచయమైంది కన్నడ బ్యూటీ జ్యోతి పూర్వాజ్. సీరియల్ లో జగతి మేడమ్ రోల్ లో కనిపించిన ఆమెకు ఫ్యాన్ బేస్ వేరే లెవెల్ లో ఉందనే చెప్పాలి. తక్కువ టైమ్ లో ఎక్కువ పాపులారిటీ సంపాదించుకున్న జ్యోతి.. అందం, అభినయంతో మెప్పించింది. అటు తల్లి పాత్రలో.. ఇటు టీచర్ రోల్ లో జీవించేసిందని చెప్పడంలో ఆలోచించక్కర్లేదేమో. అయితే సడెన్ గా ఆ సీరియల్ నుంచి తప్పుకున్న.. సినిమాలు, వెబ్ సిరీసులతో ఫుల్ బిజీగా మారిపోయింది. దర్శక నిర్మాత పూర్వాజ్.. ఆమెను సిల్వర్ స్క్రీన్ కు పరిచయం చేశారు! ఆ తర్వాత ఏ మాస్టర్



పీస్ మూవీ టైమ్ లో ప్రేమలో పడ్డి ఇద్దరూ పెళ్లి చేసుకున్న విషయం తెలిసిందే. భర్త తీసిన శుక్ర, మాటరాని మౌనమిది చిత్రాల్లో కూడా నటించి మెప్పించింది జ్యోతి. ఇప్పుడు పలు సినిమాలతో బిజీగా ఉన్న అమ్మడు.. సోషల్ మీడియాలో చేసే సందడి మామూలుగా ఉండదు. ఎప్పటికప్పుడు ట్రెండీ డ్రెస్సుల్లో, పొట్టి బట్టల్లో వేరే లెవెల్ లో అందాలు ఆరోబోస్తుంటుంది. అలా రోజురోజుకూ ఫాలోవర్స్ ను పెంచుకుంటున్న ముద్దుగుమ్మ.. తన ఫ్యాన్స్ ను అస్సలు డిస్పాయింట్ చేయదనే చెప్పాలి. తాజాగా కిర్రాక్ పిక్ ను పోస్ట్ చేసిన జ్యోతి.. ఒక్కసారిగా అందరినీ ఫ్లాట్ చేసేసింది. తన గ్లామరస్ లుక్ తో మైండ్ బ్లాక్ చేసిన అమ్మడు.. మైమరపించే పోజు ఇచ్చిందనే చెప్పాలి. సోఫాలో కూర్చున్న బ్యూటీ.. మోడ్రన్ డ్రెస్ లో కనిపించగా.. అంతా ఫిదా. అయితే జ్యోతి అంద చందాలకు ఎవరైనా క్లీన్ బౌల్డ్ అవ్వకుండా ఉండరేమో. ప్రస్తుతం జ్యోతి పిక్ సోషల్ మీడియాలో ఓ రేంజ్ లో వైరల్ అవుతోంది. బ్యూటిఫుల్ మేడమ్ అంటూ నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు. అందమే అసూయ పడేలా ఉన్నారని చెబుతున్నారు. లైకులు కొడుతూ రచ్చ రచ్చ చేస్తున్నారు. మేడమ్ సర్ మేడమ్ అంతే అంటూ ఆకాశానికెత్తేస్తున్నారు.

## 'అఖండ-2'లో యాక్షన్ సంచలనం 'డెడ్ లీ దత్'!






గాడ్ ఆఫ్ మాసెస్ బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో భారీ అంచనాల మధ్య 'అంఖడ-2' పాన్ ఇండియాలో తెరకెక్కుతోన్న సంగతి తెలిసిందే. సీక్వెల్ లోబాలయ్య శివ తాండవం ఊహకి కూడా అందని విధంగా బోయపాటి డిజైన్ చేసారు. బాలయ్య మాస్ ఇమేజ్...అఖండతో పాన్ ఇండియాలో క్రియేట్ అయిన బజ్ నేపథ్యంలో పార్ట్ 2 మరింత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిస్తున్నారు. ఇప్పటికే ఓ విలన్ గా ఆదిపినిశెట్టిని ఫైనల్ చేసారు. బాలయ్య- ఆది మధ్య ఓ భారీ యాక్షన్ సన్నివేశాన్ని కూడా చిత్రీకరిస్తున్నట్లు వార్తలొస్తున్నాయి. సినిమాకే ఈ ఫైట్ సన్నివేశం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందని అంచనాలున్నాయి. దీంతో ఆది నే మెయిన్ విలన్ గా అంతా భావిస్తున్నారు.

అయితే బోయపాటి అంతకు మంచి ప్లాన్ చేస్తున్నాడని గెస్ చేయలేకపోతున్నారు. తాజాగా ఈ ప్రాజెక్ట్ లోకి బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ ని తీసుకొస్తున్నట్లు వినిపిస్తుంది. ఇందులో అసలైన ప్రతి నాయకుడి బాధ్యతలు దత్ కి అప్పగిస్తున్నట్లు సమాచారం. ప్రస్తుతం సంజయ్ దత్ తో బోయపాటి సంప్రదింపులు జరుపుతున్నట్లు ప్రచారం జరుగుతోంది. దత్ ఎంట్రీ కనుక ఖాయమైతే? విలన్ పాత్ర మామూలుగా ఉండదు. సాధారణ నటీనటుల్నే బోయపాటి యాక్షన్ సన్నివేశాల్లో ఓ రేంజ్లో లాంచ్ చేస్తుంటారు. ఇది బోయపాటికి మాత్రమే చెల్లింది. అలాంటింది సంజయ్ దత్ లాంటి యెగ్రసివ్ నటుడితో ఇంకే రేంజ్లో అద్భుతాలు సృష్టిస్తాడో చెప్పాల్సిన పనిలేదు. బాలయ్య-సంజయ్ దత్ మధ్య వార్ పీక్స్ లోనే ఉంటుంది. సంజయ్ దత్ ఇప్పటి వరకూ రెండు తెలుగు సినిమాలే చేసారు. 1998లో నాగార్జున హీరోగా నటించిన 'చంద్రలేఖ'లో నటించారు. ఆ తర్వాత మళ్లీ మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ నటించిన బాలీవుడ్ రీమేక్ 'జంజీర్' లో నటించారు. తెలుగులో 'తుఫాన్' గా రిలీజ్ అయింది.

ఆ తర్వాత మళ్లీ దత్ తెలుగు సినిమా చేయలేదు. పాన్ ఇండియా చిత్రం 'కేజీఎఫ్ 2' లో విలన్ గా నటించారు. అదే దత్ చివరి సౌత్ చిత్రం. మళ్లీ 'అఖండ2' లో విలన్ అంటూ ప్రచారం తో సంజయ్ దత్ పేరు నెట్టింట మారు మ్రోగిపోతుంది.

## దేవర-2 అవసరమా అంటూ క్వశ్చన్లు.. మేకర్స్ మాత్రం కష్టపడాల్సిందే..




టాలీవుడ్ యంగ్ టైగర్ జూనియర్ ఎన్టీఆర్, మాస్ డైరెక్టర్ కొరటాల శివ కాంబినేషన్ లో గతేడాది దేవర పార్ట్-1 ప్రేక్షకుల ముందుకు వచ్చిన విషయం తెలిసిందే. బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్ గా యాక్ట్ చేసిన ఆ సినిమాలో సైఫ్ అలీ ఖాన్ విలన్ గా నటించారు. అనిరుధ్ రవిచందర్ సంగీతం అందించగా.. ఎన్టీఆర్ ఆర్ట్స్, యువసుధ ఆర్ట్స్ బ్యానర్లు ప్రొడ్యూస్ చేశాయి. అయితే బాక్సాఫీస్ వద్ద దాదాపు రూ.500 కోట్లను వసూలు చేసి క్లీన్ హిట్ గా నిలిచింది దేవర. కానీ బెనిఫిట్ షో తర్వాత నెగిటివిటీ అందుకుంది. ఆ తర్వాత మాస్ ఆడియన్స్ కనెక్ట్ కావడంతో నెగిటివిటీ అధిగమించి మంచి విజయం సాధించిందనే చెప్పాలి. అదే సమయంలో సినీ ప్రియులను అంచనాలు మాత్రం అందుకోలేదని కొందరు అభిప్రాయపడ్డారు.

ఓటీటీలోకి వచ్చాక మూవీపై ఫుల్ ట్రోల్స్ వచ్చాయని చెప్పాలి. ఎక్కడా ఏ మిస్టేక్ జరిగిందో క్లియర్ గా ఐడెంటిఫై చేసిన సినీ ప్రియులు.. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారు. కొందరు బ్యాడ్ రివ్యూస్ కూడా ఇచ్చారు. సినిమాకు సీక్వెల్ అవసరం లేదని మరికొందరు అభిప్రాయపడ్డారు. దీంతో సీక్వెల్ రద్దు అయిందని ఆ మధ్య ఊహాగానాలు వచ్చాయి. అయితే ప్రస్తుతం దేవర-2 స్క్రిప్ట్ వర్క్ ను చేస్తున్నారు కొరటాల శివ. తన పవర్ ఏంటో చూపించాలని ఫిక్స్ అయినట్లు తెలుస్తోంది. పార్ట్ 2 మూవీలో యాక్షన్ తక్కువ, ఎమోషన్స్ ఎక్కువగా ఉండేలా స్క్రిప్ట్ రెడీ చేసినట్లు టాక్ వినిపిస్తోంది. 2025 జూలై నుంచి సెట్స్ మీదకు సినిమాకు తీసుకెళ్లి, 2026లో రిలీజ్ చేయాలనే ఆలోచనలో మేకర్స్ ఉన్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. అదే సమయంలో ఇప్పటికీ కొందరు సీక్వెల్ నిజంగా అవసరమా అని అని క్వశ్చన్ చేస్తున్నారు. పార్ట్-2 చాలా బాగుంటుందని ఇప్పటికే మేకర్స్ చెప్పినప్పటికీ.. తమకు ఇంట్రెస్ట్ లేదని అంటున్నారు. టైం వేస్ట్ అని.. ఇప్పటికే ఫస్ట్ పార్ట్ కోసం రెండేళ్లు వృథా చేశారని ఆరోపిస్తున్నారు. దీంతో వాళ్లకు సీక్వెల్ నచ్చాలంటే కొరటాల శివ బాగా కష్టపడాల్సిందే. తొలి భాగంలో జాన్వీ తన యాక్టింగ్ తో చాలా ట్రోల్స్ ఎదుర్కొన్నారు. ఆమె రోల్ కు స్కోప్ లేదని అన్నారు. రెండు పేజీల డైలాగ్ అంటూ ప్రమోషన్స్ లో చెప్పినది ఎక్కడుందని అప్పట్లో కామెంట్లు పెట్టారు. దీంతో హీరోయిన్ విషయంతోపాటు అన్ని విషయాల్లో మేకర్స్ తమ వర్క్ తో మెప్పించాలి. అప్పుడే సీక్వెల్.. ఫస్ట్ పార్ట్ కన్నా హిట్ అయ్యే ఛాన్స్ ఉంది. మరేం జరుగుతుందో వేచి చూడాలి.

## మీ శరీరం మాట వినండి.. ఏదీ అతిగా చేయొద్దు!

టాలీవుడ్ లో ఒకప్పుడు స్టార్ హీరోయిన్ గా అగ్ర హీరోల పక్కన నటించిన రకుల్ ప్రీత్ సింగ్ చేతిలో ఇప్పుడు ఏ తెలుగు సినిమా లేదు. రకుల్ చివరిగా ఇండియన్2 సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించింది. ఆ సినిమాలో రకుల్ పాత్రకు పెద్దగా గుర్తింపు లేకపోవడంతో పాటూ శంకర్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా డిజాస్టర్ కూడా అవడంతో ఎవరికీ ఆ సినిమా గుర్తు లేదు. అయితే రకుల్ రీసెంట్ గా గాయపడిన విషయం తెలిసిందే. గాయం నుంచి కోలుకున్న అమ్మడు ఇప్పుడు మళ్లీ తన తర్వాతి సినిమా షూటింగ్ లో బిజీగా ఉంది. గాయపడిన రకుల్ కొన్నాళ్ల పాటూ రెస్ట్ తీసుకుని ఇప్పుడు సెట్స్ లోకి అడుగుపెట్టింది. ఈ నేపథ్యంలో రకుల్ తన గాయం గురించి, దాన్నుంచి ఆమె నేర్చుకున్న విషయాల గురించి ఓ



ఇంటర్వ్యూలో మాట్లాడింది. గాయపడిన తర్వాత తనకు తన శరీరంపై గౌరవం పెరిగిందని, దాని వల్ల కెరీర్ పై దృష్టి పెట్టగలగడం నేర్చుకున్నట్టు రకుల్ తెలిపింది. అంతేకాదు ఏదీ అతిగా చేయకూడదని తనకు అర్థమైనట్టు రకుల్ ఈ సందర్భంగా చెప్పింది. మన శరీరం మాట మనం వినాలని, లిమిట్స్ ను దాటి మరీ అతిగా ఎక్సర్‌సైజులు చేయొద్దని రకుల్ అందరికీ సూచిస్తుంది. గాయం నుంచి కోలుకుని మళ్లీ సెట్స్ లోకి రావడం ఎంతో ఆనందాన్నిస్తుందని, ఇక నుంచి ఎక్కువ ప్రెజర్ తీసుకోకుండా వర్క్ చేస్తానని రకుల్ వెల్లడించింది. ఇక తన భర్త గురించి మాట్లాడుతూ, ఆయన తన బెస్ట్ ఫ్రెండ్ అని చెప్పుకొచ్చింది. ఎవరైనా ప్రాణ స్నేహితుడిని పెళ్లి చేసుకున్నప్పుడు ఆ లైఫ్ చాలా అందంగా, ఆనందంగా ఉంటుందని చెప్పిన రకుల్, తన భర్త ఆమెని ప్రతీ విషయంలో అర్థం చేసుకుంటూ, ఆమె చేసే ప్రతి పనికీ మద్దతు ఇస్తూ ఉంటాడని, అతను దొరకడం తన అదృష్టమని రకుల్ పేర్కొంది. ఇక కెరీర్ విషయానికొస్తే, రకుల్ చేతిలో ప్రస్తుతం మేరే హస్బెండ్ కీ బీవీ అనే సినిమా ఉంది. ఈ సినిమా చాలా భిన్నమైన కథతో రూపొందుతుందని, ఇప్పటివరకు ఈ నేపథ్యంలో అసలు ఎలాంటి సినిమా రాలేదని చెప్పింది. అంతేకాదు ఈ సినిమాకు రకుల్ భర్తే ప్రొడ్యూసర్. అందుకే మేరే హస్బెంర్ కీ బీవీ మూవీ తనకు మరింత స్పెషల్ అని తెలిపింది. ముదస్సర్ అజీజ్ దర్శకత్వంలో రూపొందుతున్న ఈ సినిమాలో అర్జున్ కపూర్ హీరోగా నటిస్తున్నాడు. ఈ నెల 21న ఈ సినిమా ప్రేక్షకుల ముందుకు రానుంది.

## చీరకట్టులో అందాల రాక్షసి వయ్యారాలు.. వ్వాటే లుక్స్!

'అందాల రాక్షసి' సినిమాతో తెలుగు ప్రేక్షకుల గుండెల్లో చెరగని ముద్ర వేసుకున్న లావణ్య, తన అందం, అభినయంతో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఆమె కెరీర్ ప్రారంభంలోనే వైవిధ్యమైన పాత్రలతో ప్రేక్షకులను అలరించడంలో సక్సెస్ అయ్యారు. ఇక తాజాగా తన ట్రెడిషనల్ లుక్‌తో మళ్లీ సోషల్ మీడియాలో హీటెక్కించిన విధానం వైరల్ అవుతోంది. పీచ్ కలర్ చీరలో మెల్లగా మెరిసిపోతూ కనిపించిన లావణ్య ఫోటోస్ ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. చీరకట్టులో ఆమె అందం అభిమానులను ఆకర్షిస్తోంది. ఈ లుక్‌లో సింప్లిసిటీకి గ్లామర్ జోడించి తనదైన స్టైల్‌ను చూపించారు. లావణ్య త్రిపాఠి తన డ్రెస్సింగ్ చాయిస్‌తో ఎల్లప్పుడూ ప్రత్యేకమై నిలుస్తారు, ఈ సారి కూడా అదే ప్రూవ్ అయ్యింది. మెకప్ చాలా సాఫ్ట్‌గా ఉండగా, ఆమె సొగసైన జడ ధరించిన చెవిపోగులు, హుందాతనానికి



తార్కాణంగా నిలిచాయి. అవకాశాలు తగ్గినా, సోషల్ మీడియాలో మాత్రం ఆమె క్రేజ్ తగ్గడం లేదు. ఇన్‌స్టాగ్రామ్‌లో లావణ్య తరచుగా తన అందాలను మెరిపిస్తూ, ఫ్యాన్స్‌ను కనువిందు చేస్తుంటారు. ఇటీవలనే ఆమె మెగా ఫ్యామిలీ కోడలిగా మారి కొత్త జీవితంలో అడుగు పెట్టారు. ప్రొఫెషనల్ లైఫ్‌ను, పర్సనల్ లైఫ్‌ను సమన్వయం చేస్తూ కెరీర్‌లో మరో హిట్ కోసం సిద్ధమవుతున్నారు. ఆమె గత చిత్రాల విషయానికి వస్తే, 'మిస్టర్,' 'సోగ్గాడే చిన్ని నాయన,' 'భలే భలే మగాడివోయ్' వంటి బ్లాక్ బస్టర్స్ ఆమె కెరీర్‌కు మంచి బూస్ట్ ఇచ్చాయి. ప్రస్తుతం 'సతీ లీలావతి' అనే ప్రాజెక్ట్‌తో బిజీగా ఉన్నారు. ఈ సినిమా ఆమెకు మరింత గుర్తింపు తీసుకొస్తుందని సినీ వర్గాలు ఆశిస్తున్నాయి. టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేకమైన ఇమేజ్‌ను నిలబెట్టుకున్న లావణ్య, పలు భాషల్లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. ట్రెడిషనల్ లుక్‌తో అలా మెరిసిపోయిన ఈ ఫోటోలు, మరోసారి ఆమె తన అందాన్ని ఎలా ప్రదర్శించాలో చూపిస్తున్నాయి. 'సతీ లీలావతి'తో మరోసారి ప్రేక్షకులను మెప్పించే పనిలో ఉన్న లావణ్య త్రిపాఠి, ఫ్యాన్స్‌ను మరింతగా ఆకట్టుకుంటారనే ఆశాభావం ఉంది. చూడాలి మరి అమ్మడు ఎంతవరకు సక్సెస్ అందుకుంటుందో.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA. PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536